సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 112

శుక్రవారం 6-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



సినిమా అంటే దేవాలయం

12లో


ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి 'న్యూయార్క్ ఫిలిమ్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డును అందుకున్నారు. ఆర్ఆర్ఆర్‌కు ఈ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని రాజమౌళి చెప్పారు. తన దృష్టిలో సినిమా అంటే ఒక దేవాలయమన్నారు.



ఆక్రమణల తొలగింపుపై స్టే

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో 29 ఎకరాల రైల్వే భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

వివరాలు 6లో ▸



జన భాగస్వామ్యంతోనే..

ప్రజలందరి భాగసామ్యంతోనే జల సంరక్షణ సాధ్యమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. కేవలం ప్రభుత్వ చర్యలే సరిపోవన్నారు.

వివరాలు 6లో ▸



11 రకాల ఒమిక్రాన్

భారత్‌కు వస్తున్న విదేశీ ప్రయాణికుల్లో 11 రకాల ఒమిక్రాన్ సబ్ వేరియెంట్లను గుర్తించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸



బీజింగ్‌లో కోవిడ్ బీభత్సం

బీజింగ్‌లో కోవిడ్ బాధితులు ఆస్పత్రులకు పోటెత్తుతున్నారు. చుయాంగ్‌లియూ ఆస్పత్రి లోని బెడ్లన్నీ వృద్ధులతో నిండిపోయాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కీలక శక్తిగా మహిళలు



రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడంలో మహిళలే కీలక శక్తిగా మారనున్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణ తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో ఓటర్లు 3,99,84,868 మంది కాగా.. పురుషులు 1,97,59,489 మంది, మహిళలు 2,02,21,455 మంది ఉన్నారు.

వివరాలు 2 ▸

రష్యా కాల్పుల విరమణ



ఆర్థోడాక్స్ క్రిస్టమస్ సెలవు నేపథ్యంలో ఈ వారాంతంలో 36 గంటలపాటు కాల్పుల విరమణ పాటించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ తమ సైన్యాన్ని ఆదేశించారు. ఉక్రెయిన్‌పై దాడులు చేయొద్దని స్పష్టం చేశారు.

వివరాలు 6 ▸

నిరంతర పరిశీలన

ట్యాబ్‌లలో సమస్య వస్తే వారంలో మరమ్మతు లేదా కొత్త ట్యాబ్

ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం

- రాష్ట్ర వ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ పూర్తి
- విద్యార్థులు నేర్చుకుంటున్న తీరుపై డేటా అనలిటిక్స్‌తో పరిశీలించాలి
- ఇందుకు అనుగుణంగా హెచ్ఎం, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి
- వచ్చే విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి ఐఎఫ్‌పీ ప్యానల్స్
- డిజిటల్ స్క్రీన్ల వల్ల 6–10 తరగతుల విద్యార్థులకు అత్యుత్తమ బోధన
- డిక్షనరీలు లేని పిల్లలకు వచ్చే విద్యా కానుకతో కలిపి ఇవ్వాలి
- విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పిల్లలకు విద్యాకానుక అందాలి
- డీఎస్సీ–98 అభ్యర్థులకు త్వరగా పోస్టింగులు ఇవ్వాలి
- గోరుముద్దకు అదనంగా వారంలో మూడు రోజులు రాగి మాల్ట్
- ఇందుకు ప్రభుత్వంపై అదనంగా రూ.50 కోట్లు భారం
- పాఠశాలల్లో సౌకర్యాల నిర్వహణను నిరంతరం పరిశీలించాలి



విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2లో

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబుల్లో ఎలాంటి సమస్య తలెత్తినా వారం రోజుల్లో మరమ్మతు చేసి ఇవ్వాలని, లేదా కొత్త ట్యాబును అందజేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ట్యాబుల ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న తీరుపై డేటా అనలిటిక్స్ ద్వారా నిరంతర పరిశీలన ఉండాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా హెడ్ మాస్టర్, ఎంఈఓలు తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యా శాఖ కార్యకలాపాలపై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్యాబుల పంపిణీ పూర్తయిందని

మిగతా 2వ పేజీలో ▶



సచివాలయాల పనితీరు బాగుంది

- 80.90 శాతం సూపర్.. 17.99 శాతం పరవాలేదు
- 76.59 శాతం వలంటీర్ల పనితీరు బాగుంది.. 21.55 శాతం పరవాలేదు
- సచివాలయాల తనిఖీల్లో వెల్లడి.. 98.71% ప్రజా సమస్యల పరిష్కారం
- పనితీరు పరవాలేదు, బాగోలేని వాటిపై ఫోకస్ పెట్టి మెరుగుపర్చండి
- కలెక్టర్లకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ ఆదేశం

2లో

టీడీపీ మీడియా వైరల్ చేసిన వీడియో | వాస్తవానికి ఆ వీడియో కర్ణాటకలో జరిగిన సిద్ధేశ్వరస్వామి అంతిమయాత్రకు సంబంధించినది



బాబు వాడుకున్నారు.. జనం ఆడుకున్నారు

టీడీపీ గిమ్మిక్కును బయటపెట్టి.. ఎండగట్టిన నెటిజన్లు

- భారీగా జనాన్ని చూపించడానికి మొదట సందుల్లో సభ
- అక్కడ 8 మంది మరణించటంతో.. తరువాత కానుకల ఎత్తుగడ
- మాట తప్పి మోసం చేయటంతో ముగ్గురి ప్రాణాలు బలి
- ఇక కుప్పంలో బాబు సభను ఏమాత్రం పట్టించుకోని జనం
- దీంతో భారీగా జనం హాజరయ్యారంటూ 'మార్ఫింగ్' ఫొటోలు
- సిద్ధేశ్వర స్వామి అంతిమయాత్ర ఫొటోలను వాడేసిన ఎల్లో ముఠా

10లో

కొనసాగుతున్న బాబు 'షో'

కుప్పంలో కార్యకర్తలకు పరామర్శ పేరుతో డ్రామా.. చంద్రబాబు వెళ్లగానే కట్లు విప్పేసి, ఇళ్లకు వెళ్లిపోయిన వైనం

10లో

బొప్పాయి పాలు.. రైతుకు లాభాలు

మందుల తయారీలో బొప్పాయి పాలు

- తోటల వద్ద పాలు కొనుగోలు చేస్తున్న కాంట్రాక్టర్లు
- పాలసేకరణకు నైపుణ్యం కలిగిన కూలీల వినియోగం
- ఎకరం బొప్పాయి తోటలో పాల ధర రూ. 20వేలు
- బొప్పాయి ఆకు టన్ను రూ. 15వేలు



బొప్పాయి తోటల్లో పాలసేకరణ చేస్తున్న కూలీలు

గుర్రంకొండ

సాధారణంగా బొప్పాయి తోటలు అనగానే బొప్పాయి కాయలే గుర్తుకు వస్తాయి. అయితే అందులో మరో కోణం దాగి ఉంది. బొప్పాయి కాయలు తినడానికే కాకుండా బొప్పాయి పాలు, ఆకులు మందుల తయారీలో వినియోగిస్తున్నారు. ఇందుకోసం నైపుణ్యం కలిగిన కూలీలు తోటల వద్దనే మకాం వేసి మరీ పాలసేకరణ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నేరుగా తోటల వద్దకే వచ్చి వాటిని కొనుగోలు చేస్తున్నారు. బొప్పాయి పాల కోసం ఎకరం తోటకు రూ. 20వేలు, బొప్పాయి ఆకు కోసం ఎకరం తోటకు రూ.15వేలు కాంట్రాక్టర్లు చెల్లిస్తున్నారు.

ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు పాలసేకరణ

బొప్పాయి తోటల్లో చెట్ల నుంచి పాలసేకరణ ఉదయం 6 గంటల నుంచి పదిగంటల వరకు మాత్రమే చేస్తారు. ఆ తరువాత కూలీలకు ఎలాంటి పని ఉండదు. జిల్లాలోని రైల్వేకోడూరు నుంచి ఇందుకోసం ప్రత్యేకంగా కూలీలను తీసుకొస్తున్నారు. కూలీలు బొప్పాయి తోటల్లోనే గుడిసెలు వేసుకొని పాలసేకరణ పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఉంటారు. కూలీలందరూ ఉదయం ఆరు గంటల నుంచి పదిగంటల వరకు పాలసేకరణ చేస్తారు.

ఎకరానికి ఎనిమిది క్యాన్ల పాలసేకరణ

ఎకరం బొప్పాయి తోటలో కూలీలు ఎనిమిది క్యాన్ల వరకు పాలసేకరణ చేస్తారు. ఒక్కో కూలీ కనీసం రోజుకు ఒక క్యాన్ పాలు సేకరిస్తారు. ఒక క్యాన్ పాలు సేకరిస్తే కూలీలకు కాంట్రాక్టర్ రూ. 1500 చెల్లిస్తారు. కనీసం పది మంది కూలీలు గుంపులు, గుంపులుగా బొప్పాయి తోటల్లో మకాం వేసి పాలు సేకరిస్తుంటారు.

ప్రత్యేక పద్ధతుల్లో పాలసేకరణ

బొప్పాయి పాలసేకరణ ప్రత్యేక పద్ధతుల్లో సేకరిస్తుంటారు. ముళ్ల కంప లాంటి వస్తువుతో ముందుగా బొప్పాయి కాయలపై గాట్లు వేస్తారు. అనంతరం బొప్పాయిచెట్టు కింద చెట్టు చుట్టూ ప్లాస్టిక్ కవర్‌తో తయారు చేసిన ఓ జల్లెడలాంటి అట్టను కింద ఉంచుతారు. బొప్పాయి కాయల్లో నుంచి కారే పాలన్నీ కింద ఉన్న ప్లాస్టిక్ సంచుల్లో పడతాయి. పాలు కింద పడిన కొద్దిసేపటికే అవి గడ్డగా మారిపోతాయి. పాలధార నిలిచిపోయిన తరువాత గడ్డగా మారిన పాలను ప్లాస్టిక్ క్యాన్లలో నింపుతారు.

సాధారణ, ఆయుర్వేద మందుల తయారీలో వినియోగం

ఇక్కడి బొప్పాయి తోటల్లో సేకరించిన పాలను క్యాన్ల ద్వారా కాంట్రాక్టర్లు రైల్వే కోడూరులోని ఫ్యాక్టరీలకు చేరుస్తారు. అక్కడి నుంచి ఈ బొప్పాయి పాలను ట్యాంకర్ల ద్వారా కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తారు. సాధారణ అల్లోపతి మందులతో పాటు ఆయుర్వేద మందుల తయారీలో ఈపాలను వినియోగిస్తుండడంతో వీటికి మంచి డిమాండ్ ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఎకరం తోట రూ.20వేలు

పాలసేకరణ కోసం కాంట్రాక్టర్లు ఎకరం బొప్పాయి తోటలకు రూ. 20 వేలు వరకు చెల్లిస్తుంటారు. పాలసేకరణ పూర్తి అయిన తరువాత బొప్పాయి ఆకు ను కూడా కత్తిరించి టన్ను రూ. 15 వేలు చొప్పున విక్రయిస్తుంటారు. బొప్పాయి పాలతో పాటు ఆకు కూడా మందుల తయారీలో వినియోగిస్తుంటా రు. దీంతో పాలతో పాటు ఆకుకు కూడా మంచి డిమాండ్ ఉంది. ఆకు, పాలసేకరణ ముగిసిన తరువాత తోటల్లో మిగిలిన కాయల్ని ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. బొప్పాయి పచ్చికాయల నుంచి స్వీట్లు, బ్రెడ్లు, కేక్‌ల తయారీలో వినియోగించే స్వీట్ చిప్స్‌ను తయారు చేస్తారు.



బొప్పాయి తోటల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న కూలీలు

మందుల తయారీలో పాలను వాడతారు



బొప్పాయి పాలను మందులు తయారు చేసే ప్రక్రియలో భాగంగా వాడతారు. బొప్పాయి పాలు కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు తీసుకెళుతుంటారు. మేము బొప్పాయి తోటలను కాంట్రాక్ట్ తీసుకొని పాలను సేకరిస్తాము. బొప్పాయి పాలతో పాటు ఆకు కుడా మందుల తయారీలో వినియోగిస్తారు. చివరగా మిగిలిన కాయలు స్వీట్ చిప్స్ తయారీకి వాడతారు.

– సిద్ధార్థ, కాంట్రాక్టర్, రైల్వేకోడూరు

రోజుకు ఒక క్యాన్ పాలు సేకరిస్తాం



బొప్పాయి తోటల్లో రోజుకు ఒక క్యాన్ పాలు సేకరిస్తాము. ఉదయం 6 గంటల నుంచి 10 వరకు మాత్రమే పాలసేకరణకు అనుకూల సమయం. ఒక క్యాన్‌కు కాంట్రాక్టర్ రూ. 1500 ఇస్తాడు. పదిమంది ఒక బృందంగా ఏర్పడి బొప్పాయి తోటల్లోనే గుడిసెలు వేసుకొని ఇక్కడే ఉండిపోతాం. 15 రోజుల వరకు ఒక తోటలో పాలసేకరణ చేస్తాము.

– శీను, రైల్వేకోడూరు

తల్లీబిడ్డల ఆరోగ్యానికి అభయం

5లో

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- 'కిల్‌కారీ' పేరిట వినూత్న కార్యక్రమానికి రూపకల్పన
- వాయిస్ కాల్‌తో ఆరోగ్య పరమైన సూచనలు, సలహాలు



క్లుప్తంగా...

నేటి నుంచి విశాఖలో గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్

- వర్చువల్‌గా ప్రసంగించనున్న సీఎం జగన్

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి విశాఖలో గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్ జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచం నలుమూలల నుంచి 450 మంది వైద్య నిపుణులు పాల్గొంటున్నారు. తొలిరోజు సదస్సులో సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ప్రసంగిస్తారు. వైద్య సేవలను మరింత మెరుగు పరచడంతోపాటు వైద్య విజ్ఞానాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం, మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ, మాతా శిశు మరణాల నివారణ, పౌష్టికాహారం తదితర అంశాలపై సదస్సులో చర్చిస్తారు. రెండోరోజైన శనివారంనాడు ఏపీ, తెలంగాణ గవర్నర్లు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. 8న ఆర్.కె. బీచ్‌లో హెల్త్ కేర్ వాక్ ఉంటుందని చెప్పారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యత

విద్యాశాఖ మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: విద్యార్థులు తమ చదువు పూర్తిచేసి కాలేజీ నుంచి బయటకు వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా తగిన నైపుణ్యాలు, సామర్థ్యాలు కలిగి ఉండేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఇందుకోసం విద్యార్థులందరికీ నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. విజయవాడలోని ఒక హోటల్‌లో గురువారం కాలేజీ విద్య విభాగం ఆధ్వర్యంలో లైఫ్‌స్కిల్స్, స్కిల్ డెవలప్‌మెంటు కోర్సుల పాఠ్యపుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నూతన విద్యావిధానాన్ని అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందు వరుసలో ఉందని వివరించారు. లక్ష మందికి పైగా విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ సంస్థ ద్వారా శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, కమిషనర్ పోలా భాస్కర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షులుగా ఆర్.ధనుంజయ్‌రెడ్డి, బసిరెడ్డి సిద్ధారెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రచార విభాగం అధ్యక్షులను నియమించినట్లు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరుదు కళ్యాణి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు మేరకు శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణిని పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

సచివాలయాల పనితీరు బాగుంది

సచివాలయాల తనిఖీల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటివద్దే సేవలందించే వలంటీర్ల వ్యవస్థతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు ఎప్పుడూ సమర్థవంతంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాలను కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో పాటు ఇతర ఉన్నతాధికారులతో తనిఖీలు నిర్వహిస్తోంది. వీటి ద్వారా ఏమైనా లోటుపాట్లు, పనితీరు సక్రమంగా లేనట్లు తేలితే వాటిని సరిచేయడం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతంగా మెరుగైన సేవలు అందించేలా వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. 2020 అక్టోబర్ 20 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు గ్రామ, వార్డు సచివాలయాల్లో 27,473 తనిఖీలను నిర్వహించారు. ఇందులో ఒకసారి కన్నా ఎక్కువసార్లు 2,870 సచివాలయాలను సందర్శించారు. అక్కడ సిబ్బంది, వలంటీర్ల పనితీరు, రంగాల వారీగా ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించడమే కాక.. ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించి, వాటి పనితీరును మదింపు చేశారు. 2021 సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 3 వరకు కూడా సచివాలయాల పనితీరును పరిశీలించారు. దాని ప్రకారం చూస్తే.. 80.90 శాతం గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు బాగుందని.. మరో 17.99 శాతం ఓ మోస్తరుగా ఉన్నాయని తేలింది. మిగిలిన 1.11 శాతం సచివాలయాల పనితీరు బాగోలేదని తేలింది. అలాగే, 76.59 శాతం మంది వలంటీర్ల పనితీరు బాగుందని, 21.55 శాతం వలంటీర్ల పనితీరు ఓ మోస్తరుగా ఉందని.. 1.86 శాతం వలంటీర్ల పనితీరు బాగోలేదని ఆ తనిఖీల్లో తేలింది.

తనిఖీలు విధిగా నిర్వహించండి : సీఎస్

ఈ నేపథ్యంలో.. ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంతో పాటు పథకాల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు గ్రామ, వార్డు సచివాలయాలను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు నెలలో తప్పనిసరిగా రెండు గ్రామ, వార్డు సచివాలాయాలను తనిఖీ చేయాలని సూచించారు. అలాగే, శాఖాధిపతులు నెలకు రెండు, కలెక్టర్లు వారంలో రెండు..జాయింట్ కలెక్టర్లు వారానికి నాలుగు గ్రామ, వార్డు సచివాలయాలను తనిఖీ చేయాలని జవహర్‌రెడ్డి స్పష్టంచేశారు.

బాగోలేని, మోస్తరు పనితీరు సచివాలయాలపై ఫోకస్

ఇక పనితీరు బాగోలేని, మోస్తరు పనితీరు మాత్రమే ఉన్న సచివాలయాలపై కారణాలు అన్వేషించి ఫోకస్ పెట్టాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్‌జైన్ తెలిపారు. మంచి పనితీరు కనబరిచేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాల్సిందిగా కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

2021 సెప్టెంబర్ 1 నుంచి ఈనెల 3 వరకు నిర్వహించిన తనిఖీల్లో పరిశీలించిన ఫలితాలు	
వివిధ పథకాల పోస్టర్ల ప్రదర్శన	96.74 శాతం
సంక్షేమ క్యాలెండర్ ప్రదర్శన	99.20 శాతం
సచివాలయాల ఉద్యోగుల హాజరు	98.86 శాతం
వలంటీర్ల హాజరు	95.60 శాతం
రిజిస్టర్లు, రికార్డుల అందుబాటు	98.59 శాతం
ముఖ్యమైన ఫోన్ నంబర్ల ప్రదర్శన	99.06 శాతం
తిరస్కరించిన లబ్ధిదారుల జాబితా ప్రదర్శన	96.87 శాతం
సిటిజన్ ఔట్‌రీచ్ నిర్వహణ	98.42 శాతం
ఫిర్యాదుల పరిష్కారం	98.71 శాతం

రోడ్ల నిర్మాణానికి నిధుల లోటు లేదు

- ఇప్పటికే రూ.2,075 కోట్ల విలువైన 1,069 పనులు పూర్తి
- 'ఈనాడు' కథనం అవాస్తవం: రహదారుల అభివృద్ధి సంస్థ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడం లేదంటూ 'ఈనాడు' పత్రిక గురువారం ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ స్పష్టం చేసింది. రాష్ట్రంలో 7,900 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి 1,168 పనుల కింద రూ.2,205 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు ఆర్‌డీసీ ఎండీ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో బ్యాంక్ ఆఫ్ బరోడా రుణం రూ.2 వేల కోట్లు కాగా.. ప్రభుత్వ వాటా రూ.205 కోట్లు అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.2,075 కోట్ల విలువైన 1,069 పనులను పూర్తి చేశామని వివరించారు. వాటికి సంబంధించి రూ.1,830 కోట్ల బిల్లులను కూడా కాంట్రాక్టర్లకు చెల్లించామని తెలిపారు. మిగిలిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు కూడా ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తన వాటాకు సంబంధించి రూ.30 కోట్లు ఇచ్చిందన్నారు. బ్యాంకు రుణాన్ని ఉపయోగించిన తర్వాత మిగిలిన వాటాను కూడా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావుకు సీఎం నివాళి

కుటుంబ సభ్యులను ఓదార్చిన వైఎస్ జగన్

సాక్షి, అనకాపల్లి: విశాఖ డెయిరీ చైర్మన్, ఆంధ్రా కురియన్‌గా పేరుగాంచిన ఆడారి తులసీరావు పార్థివ దేహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం తుది శ్వాస విడిచిన తులసీరావు భౌతిక కాయాన్ని అనకాపల్లి జిల్లాలోని ఆయన స్వస్థలం యలమంచిలికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. మధ్యాహ్నం 12.25 గంటలకు యలమంచిలి చేరుకున్న సీఎం.. తులసీరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన సతీమణి జయమ్మ, కుమారుడు, వైఎస్సార్‌సీపీ విశాఖ వెస్ట్ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. 20 నిమిషాల పాటు అక్కడే గడిపిన ముఖ్యమంత్రి వారందరికీ ధైర్యం చెప్పారు. తండ్రి ఆశయాన్ని కొనసాగించాలని ఆనంద్‌కుమార్‌కు ఉద్బోధించారు. కాగా, తులసీరావుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, రమణమూర్తి రాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు నివాళులర్పించారు. తులసీరావు పార్థివ దేహానికి యలమంచిలిలోని ఆయన సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేనున్నానని అభయం..

సీఎం వైఎస్ జగన్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. యలమంచిలికి చెందిన కొండమంచిలి వాణికి మాటలు రావని, చెవులు వినిపించవని తల్లిదండ్రులు సీఎంకు గోడు వెళ్లబోసుకున్నారు. ఎస్.రాయవరం మండలం సైతాలుపేట గ్రామానికి చెందిన కలగా శివాజీ మూడేళ్ల కిందట మోటార్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఏ అవయవాలు పని చేయక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని కుటుంబ సభ్యులు సీఎంకు విన్నవించారు. వీరిద్దరి సమస్య విన్న సీఎం వెంటనే చలించిపోయారు. వారికి మెరుగైన వైద్యం, రూ.లక్ష చొప్పున తక్షణ సాయం అందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు వారికి మెరుగైన వైద్యం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు.



కొండమంచిలి వాణి అమ్మమ్మకు భరోసానిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కలగా శివాజీ పరిస్థితిని తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్



శివాజీకి రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



వాణికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

నిరంతర పరిశీలన

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ట్యాబుల (నిర్వహణ) మెయింటెనెన్స్‌కు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వీస్ సెంటర్‌ను కంపెనీ ద్వారా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ట్యాబుల వాడకం.. దాని ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న తీరు, తదితర అంశాలపై ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. తరగతి గదుల డిజిటలైజేషన్‌లో భాగంగా ఐఎఫ్‌పీ ప్యానల్స్ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యల గురించి సీఎంకు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు కావాలని, 6–10 తరగతుల విద్యార్థులందరికీ ఇవి అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు. డిజిటల్ స్క్రీన్ల వల్ల విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందాలని, వీటిని ఉపయోగించుకుని ఎలా బోధన చేయాలో టీచర్లకు చక్కటి అవగాహన కలిగేలా శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

పిల్లలందరికీ డిక్షనరీలు ఇవ్వాలి

- పిల్లలు అందరి వద్దా డిక్షనరీలు ఉన్నాయా? లేవా? మరోసారి పరిశీలించండి. లేని పిల్లలు అందరికీ వచ్చే విద్యా సంవత్సరం విద్యా కానుకతో కలిపి ఇవ్వాలి. ఇందు కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలి. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పిల్లలకు విద్యా కానుక అందాలి.
- పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా టీచర్లు ఉండేలా చూసుకోవాలి. ఏ స్కూల్లో లేకపోయినా వెంటనే ఆ మేరకు చర్యలు తీసుకోవాలి. సబ్జెక్టుల వారీగా టీచర్లను పెట్టడం వల్ల బోధనలో నాణ్యత పెరుగుతుంది. తద్వారా విద్యార్థుల అభ్యాసం కూడా మెరుగు పడుతుంది. డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగులు త్వరగా ఇవ్వాలి.
- గోరుముద్ద నాణ్యతను నిరంతరం పరిశీలించాలి. ఫిబ్రవరి 1 నుంచి వారంలో మూడు రోజులు పిల్లలకు బెల్లంతో తయారు చేసిన రాగి మాల్ట్ ఇవ్వాలి. అన్ని స్కూళ్లు, అంగన్‌వాడీలకు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే సరఫరా చేయాలి. నాణ్యత విషయంలో రాజీపడొద్దు.

> స్కూలు పిల్లలకు ఇప్పుడు ఇస్తున్న ఆహారానికి అదనంగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి వారానికి మూడు రోజులు బెల్లంతో తయారు చేసిన రాగి మాల్ట్ గ్లాసుడు చొప్పున ఇవ్వాలి. ఐరన్, కాల్షియం లోపం నివారణకు ఇది బాగా ఉపయోగపడుతుంది. దీనివల్ల ప్రభుత్వానికి రూ.50 కోట్లు అదనంగా ఖర్చవుతుంది. నాడు- నేడు కింద బాగు చేసిన పాఠశాలల్లో సౌకర్యాల నిర్వహణపై నిరంతర పరిశీలన ఉండాలి. ఎస్ఎంఎఫ్, టీఎంఎఫ్ (స్కూల్, టాయిలెట్ నిర్వహణ నిధి) నిధులను వినియోగించుకుని ఏ సమస్య వచ్చినా వెంటనే మరమ్మతులు చేపట్టాలి. - సీఎం వైఎస్ జగన్

ఇప్పటికే సరఫరా..

- ప్రత్యేక లేబుల్‌తో సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలు, అన్ని గురుకుల పాఠశాలలు హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.
- 22 వేలకుపైగా స్కూళ్లలో నాడు–నేడు రెండో దశ పనులు నడుస్తున్నాయని, ఇప్పటికే దాదాపు రూ.1,500 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని వివరించారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ గుల్జార్, విద్యాశాఖ సలహాదారు ఏ సాంబశివారెడ్డి, ఇంటర్ మీడియెట్ విద్య కమిషనర్ ఎం వీ శేషగిరిబాబు, పాఠశాల మౌలిక వసతులు కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ జీ వీరపాండ్యన్, మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధి మీనా, నాడు–నేడు డైరెక్టర్ (టెక్నికల్) మనోహర్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఏ సిరి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ (పాఠశాల విద్యా శాఖ) ప్రతాప్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రజలకు సేవలందించేందుకు మరిన్ని 104 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. దాదాపు 300కు పైగా వాహనాలు మంగళగిరి సమీపంలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరాయి. త్వరలో ఇవి సేవలందించనున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పోలీసుల అదుపులో ఇంటూరి బ్రదర్స్

- కందుకూరు ఘటనలో కీలకం వీరే
- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నేడు అరెస్టు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కందుకూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన దుర్ఘటన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ప్రధాన నిందితులు ఇద్దరిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గత నెల 28న ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కందుకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఎనిమిదిమంది మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బాధితుడు పిచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితులుగా ఉన్న టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని కందుకూరు తీసుకొచ్చారు.

లోతుగా దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు సీఆర్‌పీసీ 174 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు. సభ జరిగిన ప్రాంతంలో డ్రోన్ ద్వారా షూట్ చేసిన వీడియో విజువల్స్ సేకరించారు. అనుమతిలేకుండా బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ప్రోత్సహించి స్థానిక పెట్రోలు బంకు వద్ద బైక్‌లకు పెట్రోలు పోయించిన వివరాలు తీసుకున్నారు. సభకు జనాలను తరలించేందుకు వాహనాలు సమకూర్చి నగదు పంపిణీ చేసిన వివరాలు, సభకు వచ్చిన వారికి భోజనాలు, డీజే ఏర్పాటు చేసినవారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించింది ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్‌గా గుర్తించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు

కందుకూరు ఘటనలో మృతిచెందిన వారిలో ఐదుగురు ఎస్సీ, ఎస్టీలున్నారు. దీంతో పోలీసులు అదనంగా సెక్షన్ 304(2), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ సెక్షన్లను కలిపారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 'ప్రాజెక్ట్ టీల్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర వైద్య శాఖ ప్రవేశపెట్టిందన్నారు. డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్‌లు ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్ట్ టీల్‌లో భాగంగా పీహెచ్‌సీ నుంచి బోధనాస్పత్రి వరకూ అన్ని ఆస్పత్రుల్లోని ప్రముఖ ప్రదేశంలో ముదురు నీలం –ఆకు పచ్చ లైటింగ్‌ను ప్రదర్శించాలన్నారు.

ఎన్నికల్లో కీలక శక్తిగా మహిళలు

పురుషులకంటే మహిళా ఓటర్లు 4,61,966 మంది ఎక్కువ

- రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 3.99 కోట్ల మంది
- మహిళలు 2.02 కోట్లు.. పురుషులు 1.97 కోట్లు
- నాలుగు జిల్లాల్లో మాత్రం పురుష ఓటర్లే అధికం
- 2022తో పోలిస్తే 7,51,411 తగ్గిన ఓటర్ల సంఖ్య
- రాష్ట్రవ్యాప్తంగా 45,951 పోలింగ్ స్టేషన్లు
- 2023 ప్రత్యేక ఓటర్ల సవరణ తుది జాబితా విడుదల



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చట్ట సభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో మహిళలే కీలక శక్తిగా మారనున్నారు. రాష్ట్రంలో పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండటం ఈ అంశాన్ని స్పష్టం చేస్తోంది. ప్రత్యేక ఓటర్ల సవరణ తుది జాబితా 2023ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం రాష్ట్రంలో సర్వీసు ఓటర్లతో కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,84,868. వీరిలో పురుష ఓటర్లు 1,97,59,489 మంది కాగా, మహిళా ఓటర్లు 2,02,21,455 మంది ఉన్నారు. అంటే 4,61,966 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. థర్డ్ జెండర్స్ ఓటర్ల సంఖ్య 3,924గా ఉంది. మొత్తం 26 జిల్లాల్లో 22 జిల్లాల్లో పురుషులకంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మాత్రమే పురుష ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 19,41,277 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7,29,085 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 7,76,716 మంది ఓటర్లు ఉన్నారు.

2022తో పోలిస్తే తగ్గిన ఓటర్ల సంఖ్య

గతేడాది తుది ఓటర్ల సవరణ జాబితాతో పోలిస్తే ఈ ఏడాది ఓటర్ల సంఖ్య 7,51,411 తగ్గింది. 2022 తుది జాబితాలో 4,07,36,279గా ఉన్న ఓటర్ల సంఖ్య 2023 జాబితా నాటికి 3,99,84,868కి పరిమితమయింది. కానీ, నవంబర్‌లో విడుదల చేసిన ముసాయిదా జాబితా సవరణ తర్వాత నికరంగా ఓటర్ల సంఖ్య 1,30,728 పెరిగినట్లు మీనా తెలిపారు. ముసాయిదా జాబితా తర్వాత కొత్తగా 5,97,701 మంది ఓటర్లు చేరితే 4,66,973 మంది ఓటర్లను తొలగించినట్లు పేర్కొన్నారు. గతంతో పోలిస్తే అదనంగా ఒక పోలింగ్ స్టేషన్ పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 45,951 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి వెయ్యి మంది జనాభాకు 721 మందికి ఓటు హక్కు ఉండగా, లింగ నిష్పత్తి 1,027గా ఉంది.

పెరిగిన తొలి ఓటు హక్కు వినియోగదారులు

2023 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారిని ఓటర్లుగా చేర్చుకున్నారు. గత ఏడాది నవంబర్ 9న ప్రకటించిన ముసాయిదా జాబితాలో 18 నుంచి 19 ఏళ్లు ఉన్న తొలి ఓటు హక్కు వినియోగదారుల సంఖ్య 78,438గా ఉంటే తుది జాబితా నాటికి ఈ సంఖ్య 3,03,225కు చేరినట్లు మీనా తెలిపారు. విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా ప్రచారం చేయడమే కొత్త ఓటర్ల సంఖ్య భారీగా పెరగడానికి కారణమని చెప్పారు. మొత్తం ఓటర్లలో దివ్యాంగుల సంఖ్య 5,17,403గా ఉంది. ఈ తుది ఓటర్ల జాబితాను అన్ని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శుక్రవారం అందజేస్తామని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోలేకపోయినవారు ఫారం–6 ద్వారా నమోదు చేసుకోవచ్చని, అభ్యంతరాలను ఫారం–7 ద్వారా, సవరణలను ఫారం–8 ద్వారా చేయవచ్చని తెలిపారు.

జిల్లాల వారీగా 2023 తుది ఓటర్ల జాబితా (సర్వీస్ ఓటర్లతో కలిపి)

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
శ్రీకాకుళం	9,25,185	9,16,793	202	18,42,480
విజయనగరం	7,52,941	7,64,546	102	15,17,589
పార్వతీపురం మన్యం	3,81,176	3,95,477	63	7,76,716
అల్లూరి సీతారామరాజు	3,53,324	3,75,728	33	7,29,085
విశాఖపట్నం	9,51,563	9,48,023	125	18,99,711
అనకాపల్లి	6,32,576	6,55,840	62	12,88,478
కాకినాడ	7,91,290	8,08,177	240	15,99,707
డా.అంబేద్కర్ కోనసీమ	7,40,572	7,44,691	25	14,85,288
తూర్పుగోదావరి	7,61,678	7,91,180	114	15,52,972
పశ్చిమ గోదావరి	7,08,254	7,34,989	101	14,43,344
ఏలూరు	7,79,500	8,07,139	113	15,86,752
కృష్ణా	7,12,443	7,49,716	87	14,62,246
ఎన్టీఆర్	8,01,127	8,30,991	155	16,32,273
గుంటూరు	8,28,632	8,82,220	230	17,11,082
బాపట్ల	6,13,948	6,38,405	79	12,52,432
పల్నాడు	8,29,117	8,58,501	213	16,87,831
ప్రకాశం	8,98,692	8,94,854	120	17,93,666
ఎస్పీఎస్సార్ నెల్లూరు	9,39,844	9,73,830	246	19,13,920
కర్నూలు	9,67,249	9,74,690	294	19,42,233
నంద్యాల	6,69,877	6,83,762	284	13,53,923
అనంతపురం	9,69,915	9,71,138	224	19,41,277
శ్రీ సత్యసాయి	6,75,290	6,69,330	63	13,44,683
వైఎస్సార్	7,84,837	8,06,609	254	15,91,700
అన్నమయ్య	6,72,980	6,86,935	141	13,60,056
చిత్తూరు	7,69,272	7,77,873	113	15,47,258
తిరుపతి	8,48,207	8,80,018	241	17,28,466
మొత్తం	1,97,59,489	2,02,21,455	3,924	3,99,84,868

క్లుప్తంగా...

నిర్ణీత సమయంలోనే శ్రీవారి దర్శనం

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్స్లాట్ టికెట్లకు త్వరితగతిన దర్శనమవుతోంది. బుధవారం అర్ధరాత్రి వరకు 61,116 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.19 కోట్లు సమర్పించారు.

దేవదాయ శాఖ సలహాదారు కొనసాగింపునకు హైకోర్టు అనుమతి

- ఈ నియామకం తుది తీర్పుకు లోబడి ఉంటుందని వెల్లడి
- లోతుగా విచారణ జరుపుతామని ధర్మాసనం వెల్లడి

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ సలహాదారు కొనసాగింపునకు హైకోర్టు ధర్మాసనం అనుమతినిచ్చింది. ఈమేరకు గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను సవరించింది అయితే, ఈ నియామకం తుది తీర్పునకు లోబడి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవదాయ శాఖ సలహాదారుగా జ్వాలాపురపు శ్రీకాంత్ నియామకం జీవోను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలో ఎక్కడా సలహాదారుల నియామకం ప్రస్తావన లేదని తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ స్పందిస్తూ.. ఆయా రంగాల్లో వారి నైపుణ్యం, అనుభవాల ఆధారంగా సలహాదారుల నియామకం జరుగుతుందన్నారు. ఇది కొత్త విషయం కాదని, గత ప్రభుత్వాలు కూడా పలువురిని నియమించుకున్నాయని వివరించారు. దేవదాయశాఖకు గత ప్రభుత్వ హయాంలో సైతం సలహాదారు ఉన్నారని తెలిపారు. శ్రీకాంత్ తరఫున సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి వాదనలు వినిపిస్తూ.. అర్చకుల సమస్యలు, దేవాలయాల నిర్వహణలో అనుభవం ఆధారంగానే శ్రీకాంత్‌ను సలహాదారుగా నియమించారని తెలిపారు. వివిధశాఖలకు సలహాదారుల నియామకంలో ప్రభుత్వానికున్న అధికారంపై లోతుగా విచారణ జరుపుతామన్న ధర్మాసనం సలహాదారుల నియామకాల పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

మరింతమంది రైతులకు పెట్టుబడి సాయం

రాష్ట్రంలో 12.98 లక్షల మందికి ఈ-కేవైసీ పెండింగ్

- 15వ తేదీలోగా పూర్తిచేసేందుకు కార్యాచరణ
- ఆర్బీకే స్థాయిలో పరిష్కారానికి చొరవ
- రోజువారీ పర్యవేక్షణ బాధ్యత కలెక్టర్లకు



సాక్షి, అమరావతి: సాధ్యమైనంత ఎక్కువమందికి పెట్టుబడి సాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పీఎం కిసాన్ పథకం కింద విడతకు రూ.2 వేల చొప్పున ఏడాదిలో మూడు విడతలుగా కేంద్రం పెట్టుబడి సాయం చేస్తోంది. ఆ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 కలిపి వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పేరిట రూ.13,500 చొప్పున రైతులకు పెట్టుబడి సాయం జమచేస్తోంది. పంట భూమి గల యజమానులకు మాత్రమే కేంద్రం సాయం అందిస్తుంటే.. అటవీ, దేవదాయ భూముల సాగుదారులతోపాటు కౌలుదారులకు సైతం రూ.13,500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తోంది. అయితే.. వివిధ సమస్యలు, సాంకేతిక కారణాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 12.98 లక్షలమందికి పీఎం కిసాన్ సాయం అందని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో క్రియాశీలక రైతులు 48.43 లక్షలమంది ఉన్నారు. వీరిలో ఈ-కేవైసీ పూర్తయిన 35.45 లక్షలమంది రైతులు మాత్రమే పీఎం కిసాన్‌కు అర్హత పొందారు. మిగిలినవారికి ఈ నెల 15వ తేదీలోగా ఈ కేవైసీ పూర్తిచేసి నూరుశాతం మంది రైతులకు పీఎం కిసాన్ సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రధాన సమస్యలు ఇవే..

ప్రధానంగా లబ్ధిదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి/పింఛనుదారు ఉండటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వెబ్‌ల్యాండ్, ఎన్‌పీసీఐ పోర్టల్‌లో మ్యాపింగ్ కాకపోవడం, ఆదాయపన్ను చెల్లింపుదారులై ఉండడం, ఆధార్ అప్‌డేట్ చేయడం వలన అనుసంధాన సమయంలో విఫలం కావడం, ఆర్టీజీఎస్, ఎన్ఐసీ సమస్యలు, అకౌంట్ బ్లాక్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా నమోదు కావడం, డూప్లికేట్, ఉమ్మడి ఖాతాలుండడం, చనిపోవడం వంటి వివిధ కారణాలతో వీరంతా ఇబ్బందిపడుతున్నారు. కేంద్ర వెబ్‌ల్యాండ్ మ్యాపింగ్, ఈ-కేవైసీ పూర్తిగాకపోవడమే ప్రధాన సమస్యగా ఉంది.

ఆర్బీకే స్థాయిలో అర్హుల గుర్తింపు

పెండింగ్ దరఖాస్తుల డేటాను ప్రభుత్వం మండల వ్యవసాయాధికారులతో పాటు రైతుభరోసా కేంద్రాలకు (ఆర్బీకేలకు) కూడా పంపించింది. ఆర్బీకేల ద్వారా దరఖాస్తుదారులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలని ఆదేశించింది. దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యల పరిష్కారంలో ఆర్బీకే సిబ్బంది సాయపడతారు. మండల వ్యవసాయాధికారి వద్ద కిసాన్ పోర్టల్‌లో తగిన వివరాలను అప్‌లోడ్ చేయించి, ఆ తర్వాత బ్యాంకు ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పోర్టల్‌తో మ్యాపింగ్ చేయించనున్నారు. తొలుత డిసెంబర్ నెలాఖరువరకు గడువునిచ్చిన కేంద్రం.. రాష్ట్రప్రభుత్వాల అభ్యర్థన మేరకు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించింది. గడువులోగా ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. ఇంకా ఈ-కేవైసీ చేయించుకోని రైతులను ఆర్బీకే స్థాయిలో గుర్తించి వారితో దగ్గరుండి ఈ-కేవైసీ చేయించాలని సూచించింది. అర్హులైన ప్రతి ఒక్కరికి పీఎం కిసాన్ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీలోగా మిగిలిన రైతులందరితో ఈ-కేవైసీ చేయించడంతోపాటు ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్టు వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ 'సాక్షి'కి తెలిపారు.

జలభద్రత దిశగా సీఎం అడుగులు

- సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకూ నీళ్లందించడానికి చర్యలు
- రైతుల జీవనోపాధి పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- ఇప్పటికే 1.05 కోట్ల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాం
- బోర్ల కింద 40 లక్షల ఎకరాలు సాగు
- నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే 32 లక్షల ఎకరాలు సాగులోకి
- వాటర్ విజన్–2047 జాతీయ సదస్సులో జలవనరుల శాఖ మంత్రి అంబటి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో సాగుకు అనువైన ప్రతి ఎకరాకూ నీళ్లందించడం ద్వారా జలభద్రత చేకూర్చి.. రైతుల జీవనోపాధిని పెంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. భోపాల్‌లో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన గురువారం జరిగిన వాటర్ విజన్–2047పై నిర్వహించిన జాతీయ సదస్సులో జలవనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను మంత్రి అంబటి వివరించారు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 4.02 కోట్ల ఎకరాలలైతే.. అందులో సాగుకు అనువైన భూమి 1.99 కోట్ల ఎకరాలని చెప్పారు. ఏటా సగటున 2,500 టీఎంసీల గోదావరి జలాలు కడలి పాలవుతున్నాయన్నారు. కడలిలో కలుస్తున్న నదీ జలాలను మళ్లించి.. రాష్ట్రాన్ని సుభిక్షం చేయడమే లక్ష్యంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో జలయజ్ఞం కింద 54 ప్రాజెక్టులను ఒకేసారి చేపట్టారన్నారు. ఆ ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా ఇప్పటికే 1.05 కోట్ల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించామని ఆయన చెప్పారు. మరో 94 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ ప్రాజెక్టుల పనులు చేపట్టారన్నారు. ఇక రాష్ట్రంలో భూగర్భ జలవనరుల సంరక్షణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయన్నారు. ప్రస్తుతం 5.65 మీటర్లలో భూగర్భ జలాలు లభ్యమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో భూగర్భ జలాలపై ఆధారపడి సుమారు 19 లక్షల బోరుబావుల కింద 40 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారన్నారు. సూక్ష్మనీటి పారుదల వ్యవస్థ (డ్రిప్, స్ప్రింక్లర్ల)ను అమలుచేసి.. నీటిని సమర్థవంతంగా వాడుకుంటున్నామని అంబటి చెప్పారు.

మరో 32లక్షల ఎకరాలు సాగులోకి..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే 32 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని మంత్రి అన్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా నీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకుని.. సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకూ నీళ్లందించడానికి సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారన్నారు. సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు సమర్థవంతంగా నీటిని వినియోగించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేస్తామని చెప్పారు.

ఫీజులు అధికంగా వసూలు చేస్తే చర్యలు

లా కాలేజీల యాజమాన్యాలకు ఉన్నత విద్యామండలి హెచ్చరిక

సాక్షి, అమరావతి: ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకన్నా అధికంగా వసూలు చేసే లా కాలేజీల యాజమాన్యాలపై చర్యలు తప్పవని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. లా సెట్‌కు సంబంధించి కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థుల నుంచి కొన్ని కాలేజీలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకన్నా అధికంగా డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కన్వీనర్ కోటాలో సీటు కేటాయిస్తూ ఇచ్చిన అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న ఫీజుకన్నా ఎక్కువ కట్టాలని ఏ విద్యార్థిపైనా ఒత్తిడి తీసుకురాకూడదని స్పష్టంచేశారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ మినహా ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కూడా విద్యార్థులను అడగకూడదని ఆదేశించారు. ఈ అంశాలను విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని, ఎవరైనా ఒత్తిడి చేస్తే ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

• తెలంగాణ

అమ్మానాన్నకు చెప్పొద్దు ప్లీజ్!

ఆరేళ్ల కేన్సర్ బాధిత బాలుడి అభ్యర్థన

- బాలుడి పరిణితికి విస్తుపోయిన వైద్యుడు
- చివరి రోజులు సంతోషంగా గడిపేలా చూడంటంటూ సూచన
- ఇటీవలే మృతి చెందిన బాలుడు
- ట్విట్టర్‌లో జ్ఞాపకాలు పంచుకున్న డాక్టర్ సుధీర్

సాక్షి, హైదరాబాద్: కొన్ని వ్యాధులతో మరణం తప్పదని తెలిసినా ఆ విషయం బాధితులకు తెలియకూడదని కుటుంబీకులు, ఒక్కోసారి తమవారికి తెలియకూడదని బాధితులూ అనుకోవడం సహజమే. అయితే తాను చనిపోతానని తన తల్లిదండ్రులకు తెలీకూడదని ఓ ఆరేళ్ల చిన్నారి అనుకోవడమే ఆశ్చర్యం. మనసును మెలిపెట్టేస్తున్న విశేషం. నగరానికి చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ చిన్నారి పేషెంట్‌తో తన జ్ఞాపకాలను సోషల్ మీడియాలో పంచుకుని నెటిజనుల మనసుల్ని ద్రవింపజేశారు. సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు.

ఏకాంతంగా మాట్లాడాలన్నాడు..

'మను (పేరు మార్చాం)కి ఫిట్స్ వస్తున్నాయని ఓ అంకాలజిస్ట్ నా దగ్గరకు రిఫర్ చేశారు. అతని మెడికల్ రికార్డులు చూశాక మను మెదడుకు ఎడమ వైపు గ్లియోబ్లాస్టోమా మల్టీఫార్మ్ గ్రేడ్ 4 కేన్సర్‌తో బాధపడుతున్నాడని, దాని కారణంగా చిన్నారి కుడి చేయి, కాలు పక్షవాతానికి గురయ్యాయని తెలిసింది. ఏడెనిమిది నెలల క్రితం నా క్లినిక్‌లో మను తల్లిదండ్రులైన యువ జంటను కలిశాను. తమ బిడ్డ మనుకి క్యాన్సర్ ఉందని అయితే ఆ విషయం తనకి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియనివ్వద్దని ఆ జంట నన్ను అభ్యర్థించారు. ఇలాంటి అభ్యర్థనలు మామూలే కాబట్టి సరే అని, ఆ తర్వాత వీల్ చైర్‌లో నా ఛాంబర్‌లోకి ప్రవేశించిన మనుని కలిశా. ఆ సందర్భంగా డాక్టర్‌తో ఏకాంతంగా మాట్లాడాలనుకుంటున్నా అని మను తన తల్లిదండ్రులను కోరడం నన్ను ఆశ్చర్యపరచింది. తర్వాత తనకు క్యాన్సర్ ఉందనే విషయం తన తల్లిదండ్రులకు చెప్పవద్దని మను అభ్యర్థించడం నేను నివ్వెరపోయేలా చేసింది.

ఐప్యాడ్‌లో చదివి...

'ఐప్యాడ్‌లో గూగుల్ సెర్చ్ చేసి నా వ్యాధి గురించి చదివా. నేను 6 నెలలే జీవిస్తానని తెలుసు, కానీ తట్టుకోలేరని నా తల్లిదండ్రులతో ఈ విషయం చెప్పలేదు. వారికి నేనంటే చాలా ఇష్టం దయచేసి వారితో చెప్పకండి..' అన్న ఆ ఆరేళ్ల బాలుడి మాటలు విని కొన్ని క్షణాలు మాట్లాడలేకపోయా. తర్వాత సరే అని అన్నా. అయితే ఆ విషయం అప్పటికే తల్లిదండ్రులకు తెలుసు కాబట్టి.. వారికి మా మధ్య జరిగిన సంభాషణ సారాంశాన్ని వివరించా. వారు కూడా కొద్దిసేపు నిర్ఘాంతపోయారు. తర్వాత బాలుడి ఇష్టాఇష్టాలను తెలుసుకుని తీర్చడం ముఖ్యమని వారికి హితవు చెప్పా. ఆ తర్వాత కొన్ని నెలల దాకా ఆ జంట నన్ను కలవలేదు.

ఉద్యోగాలు వదిలి..మనుతో కదిలి...

మళ్లీ కొన్ని రోజుల క్రితమే వారు నన్ను కలిశారు. గతంలో ఇద్దరం ఉద్యోగస్తులమైనందున బిడ్డతో తగినంత సమయం గడపలేకపోయామని, నేను ఇచ్చిన సలహా మేరకు ఇద్దరం ఉద్యోగాలు వదిలేశామని చెప్పారు. అర్ధరాత్రి ఐస్‌క్రీమ్ తినిపించడం నుంచి, అమెరికాలో డిస్నీల్యాండ్ చూపించడం దాకా.. మను ఇష్టాలు, కోరికలు తీర్చడమే పనిగా ఆ సమయం అంతా గడిపామన్నారు. ఆర్నెల్లూ ముగ్గురం ఒకటిగా బ్రతికామని తెలిపారు. ఇటీవలే ఒకరోజు తీవ్రమైన తలనొప్పితో బాధపడిన మను తమని వదిలేసి వెళ్లిపోయాడని, ఆ బాధ నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటూ.. మనుతో గడిపిన చివరిరోజుల్ని మర్చిపోలేని జ్ఞాపకాలుగా మలచుకోవడానికి కారణమైన మీకు థ్యాంక్స్ చెప్పడానికి వచ్చామని చెప్పారు.

మను లేడు కానీ..

మను లేడు.. కానీ చిన్న వయస్సులోనే అతని గొప్ప మనసు మనతోనే ఉంది. చనిపోతానని తెలిసి కూడా తల్లిదండ్రుల్ని బాధ పెట్టకూడదనుకుంటూ చిన్నారి చెప్పిన మాటలు మన స్మృతులలో నిలిచే ఉంటాయి. పెద్దవాళ్లయినా, చిన్నవాళ్లయినా మరణం తప్పదని తెలిసినప్పుడు దాగుడు మూతలు ఆడడం కంటే.. ఆ నిజాన్ని అందరూ అంగీకరించి చివరి రోజుల్ని సంతోషంగా గడిపేలా చూడడం ముఖ్యం..' అంటూ ముగించారు డా.సుధీర్ కుమార్.

కామారెడ్డిలో ఉద్రిక్తత

- ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌పై రైతుల తీవ్ర నిరసన
- కుటుంబాలతో కలిసి ర్యాలీ.. మాస్టర్‌ప్లాన్ రద్దుకు డిమాండ్
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- కలెక్టర్ దిష్టిబొమ్మకు వినతిపత్రం
- నేడు కామారెడ్డి బంద్‌కు పిలుపు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ నూతన మాస్టర్ ప్లాన్ వివాదం రచ్చకెక్కింది. కొంతమంది రైతుల వ్యవసాయ భూములు వంద ఫీట్ల రోడ్డులో పోతుండగా, మరికొందరి భూములు ఇండస్ట్రియల్ జోన్‌లోకి మారుతున్నాయి. ఈ మాస్టర్‌ప్లాన్‌ను కామారెడ్డి శివారు గ్రామాల రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నెలరోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రైతు జేఏసీ ఆధ్వర్యంలో వేలాదిమంది రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి 'రైతు కుటుంబ సమేత ర్యాలీ' చేపట్టారు. కామారెడ్డి ప్రధాన వీధుల గుండా ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంది. కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఐదుగురు రైతులకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు ధర్నా కార్యక్రమం కొనసాగింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ బయటకు వచ్చి తమ గోడు వినాలని, వెంటనే మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చేదాకా కదిలేది లేదని రోడ్డుపై బైఠాయించారు. దీంతో కలెక్టరేట్‌లోకి రాకపోకలు నిలిచిపోయాయి. రైతులకు సర్ది చెప్పేందుకు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కలెక్టర్ వచ్చి స్వయంగా తమకు హామీ ఇవ్వాలని అక్కడే ధర్నాలో కూర్చున్నారు. అయితే రాత్రి 8 గంటలైనా కార్యాలయం బయటకు రాకపోవడంతో రైతులు కలెక్టర్ జితేష్ వి పాటిల్ దిష్టిబొమ్మకు మెమోరాండం ఇచ్చారు. అనంతరం ఆందోళన విరమించారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంతోపాటు నియోజకవర్గం బంద్‌కు రైతు ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది.

అంతరిక్ష రంగం స్టార్టప్‌ల కోసం ఇస్రో, మైక్రోసాఫ్ట్‌ల మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: అంతరిక్ష రంగ స్టార్టప్ కంపెనీలకు చేయూతనిచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), అంతర్జాతీయ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లు చేతులు కలిపాయి. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇస్రో ఎంపిక చేసిన అంతరిక్ష రంగ స్టార్టప్ కంపెనీలకు మైక్రోసాఫ్ట్ తన ఫౌండర్స్ హబ్‌లో స్థానం కల్పించడమే కాకుండా మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసిన టెక్నాలజీ టూల్స్, ప్లాట్‌ఫామ్స్‌లను వాడుకునే వెసులుబాటు కలగజేయనుంది. ఆయా స్టార్టప్ కంపెనీల ఆలోచనలు అవి భారీ కంపెనీలుగా ఎదిగేవరకూ అవసరమైన సాయం చేస్తాయి. మరోవైపు దేశంలో అంతరిక్షరంగ స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించడం, ఔత్సాహికులు, సృజనశీలురను గుర్తించి వారి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలన్న ఇస్రో లక్ష్యాన్ని అందుకునేందుకూ ఈ ఒప్పందం తోడ్పడనుంది. మైక్రోసాఫ్ట్ అజ్యూర్, గిట్‌హబ్ ఎంటర్‌ప్రైజ్, విజువల్ స్టూడియో ఎంటర్‌ప్రైజ్, మైక్రోసాఫ్ట్ 365లతో పాటు పవర్ బి.ఐ., డైనమిక్స్ 365 వంటి ఉత్పత్తులతో స్టార్టప్ కంపెనీలు తమ ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చే ప్రయత్నాలను వేగవంతం చేయవచ్చు.

ఉపగ్రహాల సమాచార విశ్లేషణకు ఉపయోగం

ఉపగ్రహాల నుంచి సేకరించిన విస్తృతమైన సమాచారాన్ని విశ్లేషించేందుకు మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు ఎంతో ఉపయోగపడతాయని, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌లతోపాటు డీప్ లెర్నింగ్‌లు కూడా అందుబాటులో ఉంటున్నందున వాటితో అంతరిక్ష రంగ స్టార్టప్ కంపెనీలకు ఎంతోమేలు జరుగుతుందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. మైక్రోసాఫ్ట్ ఫర్ స్టార్టప్స్ ఫౌండర్స్ హబ్ అనే ప్లాట్‌ఫాం అటు కంపెనీలను, ఇటు టెక్నాలజీ సొల్యూషన్స్ ఇచ్చేవారిని ఒక వేదికపైకి తెచ్చేందుకు ఏర్పాటైందని, దీని వల్ల జాతీయ అంతరిక్ష కార్యక్రమాలకు మంచిమద్దతు లభిస్తుందని అన్నారు. ఔత్సాహికులతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నామని, ఈ సహకారం భారత ఆర్థికవ్యవస్థకు ఊతమివ్వాలని ఆశిస్తున్నామని తెలిపారు.

తెలంగాణకు మరో కేంద్రమంత్రి పదవి?

- సంజయ్, అరవింద్, బాపూరావులలో ఒకరికి కేబినెట్‌లో స్థానం
- తదుపరి విస్తరణలో చోటు దక్కుతుందనే ప్రచారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన బీజేపీ నేతలకు జాతీయస్థాయిలో మరో కీలక పదవి లభించనుందా ? ఈ ప్రశ్నకు ఢిల్లీ పార్టీ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. 2024 ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలతో పాటు, ఈ ఏడాది 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశాలున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో... ఇప్పటికే కేంద్రమంత్రిగా ఉన్న జి.కిషన్‌రెడ్డికి తోడుగా తెలంగాణ నుంచి ఎంపీలుగా ఉన్న బండిసంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావులలో ఒకరికి కేబినెట్‌బెర్త్ దక్కే అవకాశాలున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన డా.కె.లక్ష్మణ్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్టుగా చెబుతున్నారు. తెలంగాణలో కచ్చితంగా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్న జాతీయనాయకత్వం ఈ దిశలో కేసీఆర్ సర్కారు వైఫల్యాలను మరింత గట్టిగా ఎండగట్టేందుకు మరో కేబినెట్ పదవి ఇచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సంజయ్‌ను కేంద్రమంత్రిని చేస్తే రాష్ట్ర పార్టీలో బీసీవర్గం నుంచి కీలకనేతగా ఉన్న మరో ముఖ్యనేతకు రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలు అప్పగించవచ్చునని ప్రచారం జరుగుతోంది.

జీడిమామిడికి మహర్దశ

ఉత్పత్తి పెంపునకు సర్కారు ప్రణాళిక

- బాపట్ల పరిశోధనా స్థానంలో అధిక దిగుబడినిచ్చే మొక్కల సృష్టి
- నామమాత్రపు ధరతో ఏటా లక్ష మొక్కల పంపిణీ
- రాష్ట్రంలో 1.35 లక్షల హెక్టార్లలో సాగు
- మరింతగా సాగును పెంచే లక్ష్యం



సాక్షిప్రతినిధి, బాపట్ల: అవసరానికి తగినట్లు జీడి మామిడి ఉత్పత్తులను మరింతగా పెంచేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా జీడి మామిడి సాగును పెంచాలని నిర్ణయించింది. అధిక ఉత్పత్తినిచ్చే మొక్కలను తయారుచేసి నామమాత్రపు ధరకు రైతులకు అందిస్తోంది. ఇందుకు డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని బాపట్ల జీడి మామిడి పరిశోధనా స్థానం వేదికైంది. ప్రభుత్వ సూచనలతో ఇక్కడి శాస్త్రవేత్తలు కొత్త రకం మొక్కలను సృష్టించడంతోపాటు అధిక దిగుబడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

దేశంలో 20 లక్షల టన్నుల వినియోగం

దేశవ్యాప్తంగా 20 లక్షల టన్నుల మేర జీడి మామిడి వినియోగం ఉండగా ప్రస్తుతం 11.83 లక్షల హెక్టార్ల పరిధిలో కేవలం 7.5 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నది. దీంతో జపాన్, యుఏఈ, సౌదీ, స్పెయిన్, యుఎస్ఏ, మలేషియా, కతార్, జర్మనీ, రోమ్, గ్రీస్, ఇరాన్ తదితర 34 దేశాల నుంచి గతేడాది రూ.9,338.3 కోట్ల విలువైన జీడి మామిడి ముడి గింజలను దిగుమతి చేసుకున్నారు. దిగుమతి చేసుకున్న గింజల నుంచి ప్రాసెసింగ్ ద్వారా ఏటా రూ 3,096.81 కోట్ల విలువైన జీడిపప్పును ప్రపంచ వ్యాప్తంగా 47 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

రాష్ట్రంలో 1,20,500 టన్నుల ఉత్పత్తి..

రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో 1,35,241 హెక్టార్లలో జీడిమామిడి సాగు ఉండగా ఏటా 1,20,500 టన్నుల జీడిగింజలు ఉత్పత్తి జరుగుతోంది. ఈ లెక్కన హెక్టారుకు 700 కేజీల గింజలు ఉత్పత్తి అవుతుండగా డిమాండ్‌కు అనుగుణంగా దీనిని 1,500 కేజీలకు పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

సాగు పెంచాలని నిర్ణయం

రాష్ట్ర వ్యాప్తంగా జీడిమామిడి ప్రాసెసింగ్ చేసేందుకు 25 పరిశ్రమలున్నప్పటికీ జీడి మామిడి సాగు ఆశించిన మేర లేకపోవడంతో ఇతర దేశాల నుంచి ముడిసరుకు తెచ్చుకొని ప్రాసెసింగ్ చేయాల్సి వస్తుంది. ఈ విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జీడిమామిడి సాగును పెంచాలని నిర్ణయించారు.



కాపుతో ఉన్న జీడి మామిడితోటలు

మెట్ట ప్రాంతాలకు అనువుగా బీపీపీ 10,11 రకాలు

బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానంలో కొత్తగా బీపీపీ 10,11 రకం వంగడాలను సృష్టించారు. ఇవి మెట్ట ప్రాంతాలకు అనువుగా ఉంటాయి.

ఎకరాకు 250 ప్లాంట్లు..

బీపీపీ 8,9 రకాల్లో ఎకరాకు 80 మొక్కలు మాత్రమే వేసుకునే అవకాశం ఉండగా బీపీపీ 11 రకం ఒక్క ఎకరాకు 250 మొక్కలు సాగుచేసుకోవచ్చు. ఈ రకం మిగతావాటితో పోలిస్తే ఒక నెల ముందుగా డిసెంబర్‌లోనే పూతకు వస్తుంది. ఎకరాలో మొక్కలు అధికంగా వేసుకోవడంవల్ల దిగుబడులు పెరుగుతాయి.


నాణ్యమైన అంటు మొక్కల సరఫరా

బాపట్ల పరిశోధనా స్థానం రైతులకు నాణ్యమైన జీడిమామిడి అంటు మొక్కలను సరఫరా చేస్తోంది. ఏటా లక్షకు పైగా మొక్కలను ఇక్కడ ఉత్పత్తి చేస్తూ ఒక్కొక్క మొక్క రూ.50కే అందిస్తోంది. బాపట్ల పరిశోధనా స్థానం నుంచి మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు జీడిమామిడి మొక్కలను ఎగుమతి చేస్తుండడం గమనార్హం.



విక్రయానికి సిద్ధంగా ఉన్న జీడి మామిడి మొక్కలు

వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి..



తక్కువ పెట్టుబడితో జీడిమామిడి సాగు చేసుకోవచ్చు. ఇసుక, ఎర్రనేలలు అనుకూలంగా ఉంటాయి. ఒక సారి సాగుచేస్తే 45 ఏళ్ల వరకు ఉంటుంది. మంచి దిగుబడి వస్తుంది. దీనికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఎకరాకు రూ.60 వేల వరకు రాబడి ఉంటుంది. పంట విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ కె. ఉమామహేశ్వరరావు, సీనియర్ సైంటిస్ట్, హార్టికల్చర్ అండ్ హెడ్, బాపట్ల

వైభవంగా శ్రీశైల మల్లన్న వార్షిక ఆరుద్రోత్సవం



శ్రీశైలాలయం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామికి వార్షిక ఆరుద్రోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ప్రతి నెలా ఆరుద్రోత్సవాన్ని మాసోత్సవంగా నిర్వహిస్తుండగా ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున మాత్రం వార్షిక ఆరుద్రోత్సవంగా చేపడతారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి మల్లికార్జునస్వామికి మహాన్యాసపూర్వక లింగోద్భవకాల రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. శుక్రవారం ప్రాతఃకాల పూజల తరువాత ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండపంలో ఉత్తరముఖంగా వేంచేపు చేయించి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ముఖమండపం ఉత్తర ద్వారాలను తెరచి భక్తులకు ఉత్సవమూర్తుల ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖ మండపం ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు తీసుకొచ్చి ఆలయ ఉత్తర భాగంలోనే నందివాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపిస్తారు. ఆలయ ప్రధాన మాడవీధుల్లో నందివాహన గ్రామోత్సవం నిర్వహిస్తారు.

హౌరా– చెన్నై మెయిల్ బోగీలో పొగలు

తునిలో నిలిపివేసి నిప్పురవ్వలను ఆర్పిన సిబ్బంది

తుని: లగేజ్ బోగీలో నిప్పు రాజుకుని పొగ రావడంతో హౌరా – చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. గురువారం సాయంత్రం జరిగిన ఘటన వివరాలివి. హౌరా నుంచి చెన్నై వెళుతున్న మెయిల్ ఇంజిన్ తర్వాత ఉన్న లగేజ్ బోగీలో పొగలు రావడాన్ని అనకాపల్లి జిల్లా గుల్లిపాడులో ప్రయాణికులు గమనించారు. వెంటనే గార్డ్‌కు సమాచారం అందించారు. దీంతో తుని స్టేషన్‌లో ఆర్పీఎఫ్, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. సాయంత్రం 4.40 గంటలకు తుని రాగానే మెయిల్‌ను నిలిపివేశారు. నిప్పురవ్వలతో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేశారు. లగేజ్ బోగీలో బరువు ఎక్కువగా ఉండడంతో ర్యాక్ నుంచి వేరు చేసి లూప్‌లైన్‌లో ఉంచారు. రాత్రి 7 గంటలకు మెయిల్ బయలుదేరి వెళ్లింది. సకాలంలో పొగలను గమనించడంతో ప్రమాదం తప్పిందని తుని రైల్వేస్టేషన్ మేనేజరు శర్మ తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లను రెండవ నంబరు ప్లాట్‌ఫాం నుంచి పంపించారు.

> ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు.
> ఆయనే జీవితాన్ని ప్రసాదించాడు. విడిచే ఒక బిందువు
> ద్వారా ఆడామగల జంటను ఆయనే సృష్టించాడు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, జనవరి, 6

ఐటీ పరిధిలో ఆట

ఆన్‌లైన్ గేమింగ్‌లో అతి పెద్ద మార్కెట్ అయిన మనం ఎట్టకేలకు కళ్ళు తెరిచి, కష్టనష్టాలను నియంత్రించే పనిలో పడ్డాం. ఆన్‌లైన్ గేమింగ్‌ను ఐటీ నిబంధనల కిందకు తెస్తూ, కొన్ని ముసాయిదా సవరణలను కేంద్ర ఐటీ శాఖ సోమవారం విడుదల చేసింది. ఆన్‌లైన్ గేమ్స్ అన్నీ భారత చట్టాలకు అనుగుణంగా ఉండేలా, వాడకందార్లకు హాని కలగకుండా కాపాడేందుకే ఈ చర్యలని సర్కారు మాట. ముసాయిదాలో స్వీయ నియంత్రణ వ్యవస్థను ప్రతిపాదించిన మంత్రి, భవిష్యత్తులో గేమింగ్ కంటెంట్‌ను సైతం నియంత్రించే అవకాశం ఉందని చెప్పడం గమనార్హం.

సాధారణంగా ఆన్‌లైన్ గేమింగ్ 3 రకాలు. ఒకటి – 1990లలో వీడియో పార్లర్లలోని ఆటల్లాగా ఇప్పుడు ఆన్‌లైన్‌లో వ్యవస్థీకృతంగా ఆడే 'ఇ–స్పోర్ట్స్'. రెండోది – వేర్వేరు జట్లలోని నిజజీవిత ఆటగాళ్ళను ఒక జట్టుగా ఎంచుకొని, పాయింట్ల కోసం ఆన్‌లైన్‌లో ఆడే 'ఫ్యాంటసీ గేమ్స్'. మూడోది – మానసిక, శారీరక నైపుణ్యంపై, లేదంటే పాచికలాట లాంటి సంభావ్యతపై ఆధారపడ్డ ఆన్‌లైన్ సరదా ఆటలు. సంభావ్యతపై ఆధారపడ్డ ఆటల్ని డబ్బులకు ఆడితే జూదం. ఇదీ స్థూలమైన లెక్క. తాజా ప్రతిపాదనల్లో 'ఆన్‌లైన్ ఆట'ను నిర్వచించడమే కాక, ఆపరేటర్లు నియమ నిబంధనలన్నీ వాడకందారుకు ముందే చెప్పాలంటూ పారదర్శకతకు ప్రయత్నించడం బాగుంది. అలాగే సమయం దాటి ఆడుతుంటే, అది ఓ వ్యసనంగా మారకుండా హెచ్చరిక సందేశాలు పంపాలనడమూ భేష్.

కేంద్ర చట్టం పరిధిలోకి ఆన్‌లైన్ ఆటల్ని తీసుకొస్తున్న పాలకుల చొరవను స్వాగతిస్తూనే, లోపాలనూ నిపుణులు వేలెత్తి చూపుతున్నారు. గతంలో ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ 'ఐటీ చట్టం–2000' పరిధిలోది కాదు. తాజాగా ఐటీ శాఖను ఆన్‌లైన్ గేమింగ్ చూసే కేంద్ర మంత్రిత్వ శాఖగా నియమించారు. అది జరిగిన వారానికే ఈ కొత్త ముసాయిదా సవరణలు తెచ్చారు. నిజానికి, ఆన్‌లైన్ గేమింగ్ ఏ శాఖ కిందకు వస్తుందనే పాలనాపరమైన స్పష్టత ఇవ్వడం వరకు ఓకే కానీ, ఆ అధికారాన్ని సదరు శాఖ వినియోగించాలంటే పార్లమెంట్‌లో చట్టం చేయాలి. ఆ పని చేయకుండానే ఐటీ చట్టం నియంత్రణ పరిధిలోకే ఆన్‌లైన్ గేమింగ్‌ను తెస్తూ, ఐటీ నిబంధనలు చెయ్యడం విడ్డూరం.

అలాగే, ఈ సరికొత్త ముసాయిదా సవరణలపై ఈ నెల 17 లోగా ప్రజలు సలహాలు, సూచనలివ్వాలని కోరారు. కానీ, ఈ సంప్రతింపుల ప్రక్రియలో వచ్చిన అభిప్రాయాలను ప్రజా క్షేత్రంలో ఉంచట్లేదు. ఇటీవల 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్ –2022'లోనూ ఐటీ శాఖ ఇదే పని చేసింది. దీనివల్ల ఈ విధాన నిర్ణయంలో ప్రభుత్వ చర్యల పట్ల ప్రజల్లో ఏ మేరకు నమ్మకం ఉంటుందంటే సందేహమే. ముందుగా ఎలాంటి చర్చ, శ్వేతపత్రం లేకుండానే, కనీసం ప్రభుత్వ ఆలోచన ఏమిటో చెప్పకుండానే కొత్త ముసాయిదా సవరణల్ని కేంద్రం తేవడం కొంత వివాదాస్పదమైంది.

భౌతికంగా అన్ని రకాల జూదం, పందాలపై దేశంలో గోవా, సిక్కిమ్, కేంద్రపాలిత డామన్ మినహా మిగతా రాష్ట్రాల్లో నిషేధం ఉంది. బ్రిటీష్ కాలపు బహిరంగ జూద చట్టం 1867 సహా, వివిధ రాష్ట్రాల చట్టాలున్నాయి. కొన్నిచోట్ల నైపుణ్య ఆధారిత ఆటలకూ షరతులున్నాయి. పాపులర్ ఆన్‌లైన్ ఆట లూడోలోనూ జూదం సాగుతోందని వివాదమైంది. ఇప్పుడు ఆన్‌లైన్ ఆటల్ని సైతం ఒక కేంద్ర చట్టం కిందకు తేవడంతో విదేశాల నుంచి నడిచే చట్టవిరుద్ధ, దేశవిద్రోహ జూద వేదికల ముప్పును అరికట్టవచ్చు. అయితే, పరిమాణం, రిస్క్‌తో సంబంధం లేకుండా ఆన్‌లైన్ ఆటల్ని అందించే సైట్లు, మొబైల్ యాప్‌లు (ఇంటర్మీడియరీలు) అన్నిటినీ ఒకే గాట కట్టడంపై పునరాలోచించాలి. అంతర్జాతీయ సంస్థలు తమ సేవల్ని భారత్‌లో ఆరంభించడానికి ఇక్కడ ఆఫీసర్లను పెట్టుకోవడం ఎంత ఆచరణాత్మకమో చెప్పలేం. డబ్బుతో జూదంపై మరింత కఠిన నిబంధనలుండాలని తమిళనాడు కోరుతోంది. మరి రాష్ట్రాలు అదనపు షరతులు పెట్టవచ్చేమో స్పష్టత లేదు.

నిజానికి, కరోనాలో మనం వినోదాన్ని ఆస్వాదించే విధానం మారిపోయింది. ఓటీటీ ఛానల్స్ విస్తరణతో పాటు ఆన్‌లైన్ గేమింగ్ బాగా పెరిగింది. ఆన్‌లైన్ ఆటలపై వెచ్చించే సగటు సమయం కోవిడ్ ముందుతో పోలిస్తే, 65 శాతం హెచ్చింది. ఏకంగా 43 కోట్ల మందికి పైగా ఈ వర్చ్యువల్ గేమింగ్‌పై సమయం వెచ్చిస్తున్నారని లెక్క. కరోనాతో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టెక్నాలజీని వాడి, డిజిటల్ తెరను వీక్షించే వ్యవధి పెరగడం తిప్పలు తెచ్చింది. యువతరానికి ఆన్‌లైన్ ఆట ఓ వ్యసనమై, రోజూ 6 నుంచి 8 గంటలు వెచ్చిస్తున్నారు. చదువు, మానవ సంబంధాలు, చివరకు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. గతంలో పబ్‌జీ, బ్లూ వేల్ ఛాలెంజ్ లాంటి ఆన్‌లైన్ గేమ్స్ హింస, ఆత్మహత్యలను ప్రేరేపించేసరికి, వాటిని నిషేధించాల్సి వచ్చిన సంగతి మరిచిపోలేం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం గేమింగ్ వ్యసనాన్ని ఆరోగ్య సమస్యగా గుర్తించడం గమనార్హం. చైనా ఇప్పటికే ఈ ఆటల్ని 'మెదడుకు మత్తుమందు' అంటూ, 18 ఏళ్ళ లోపు పిల్లలు వారానికి 3 గంటలు మించి ఆడే వీల్లేకుండా చేసింది. భారత్‌లోనూ క్యాసినో లాగే ఆన్‌లైన్ ఆటల్లోనూ పిల్లలకు కనీస వయఃపరిమితి విధించవచ్చు. ముఖ్యంగా వీటి దుష్ఫలితాలపై తల్లితండ్రులు, అధ్యాపకులు పిల్లల్లో చైతన్యం తేవాలి. వచ్చే 2025 కల్లా 65.7 కోట్ల యూజర్లతో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ రూ. 29 వేల కోట్లకు పైగా ఆదాయం తెస్తుంది. 15 వేల ఉద్యోగాలొస్తాయట. 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దే క్రమంలో ఆర్థిక అవకాశాలెన్ని ఉన్నా, ఈ ఆటలపై అదుపు లేకుంటే సామాజిక నష్టమూ ఎక్కువే. కాబట్టి పట్టువిడుపులతో పాలకుల నియంత్రణ చర్యలే శరణ్యం.

గమనించాల్సిన సైన్సు పరిణామాలు

విశ్లేషణ



దినేశ్ సి.శర్మ


కొత్త ఏడాదిలో శాస్త్ర విజ్ఞాన పరంగా చాలా అంశాలు ఆసక్తిగా నిలుస్తున్నాయి. కోవిడ్‌కు ముక్కు ద్వారా వేసుకునే టీకాతో పాటు, అధిక ఉష్ణోగ్రతల్లోనూ స్థిరంగా ఉండే టీకా రానున్నాయి. మొత్తంగానే కోవిడ్ పీడ విరగడైందని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించే అవకాశం ఉంది. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు భారత్ తొలి ప్రయత్నంలో భాగంగా ఆదిత్య–ఎల్1ను ఈ ఏడాదే ప్రయోగించనున్నారు. 'ఇస్రో' ఈ ఏడాదిలోనే చంద్రయాన్–3ను కూడా ప్రయోగించనుంది. అణు విద్యుత్తు రంగంలో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు పని చేయనున్నాయి. డిజిటల్ పేమెంట్స్ పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టనున్న డిజిటల్ రూపాయి ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

కొత్త సంవత్సరంలో అప్పుడే నాలుగైదు రోజులు గడిచిపోయాయి. కాకపోతే ఫీలింగ్ మాత్రం గత ఏడాది జనవరి మాదిరిగానే ఉంది. ఒమిక్రాన్ వేరియంట్ ఆవిర్భావంతో కోవిడ్ ఇంకోసారి విజృంభిస్తుందేమో అన్న బెంగ గత ఏడాదిదైతే, కొత్త రూపాంతరంతో ఏం చిక్కు వస్తుందో అన్న భయం ఈసారి వెంటాడుతోంది. సమస్య కేవలం మనుషులకు మాత్రమే కాదు, ఆరోగ్య వ్యవస్థ మొత్తానికీ సవాలు విసరగలగటం ఆందోళనకరం. కాకపోతే దేశం ఇప్పటికే సంసిద్ధమై ఉన్న కారణంగా కొంచెం నింపాదిగా ఉండవచ్చు. అయితే ఈ ఏడాది ప్రశ్న కోవిడ్ ఇంకోసారి విజృంభిస్తుందా, లేదా? అన్నది కాదు. ఈ పీడ శాశ్వతంగా విరగడ అవుతుందా, కాదా? అన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రియాసస్ మాత్రం కొంత ఆశావహంగానే ఉన్నారు. ఈ ఏడాది ఏదో ఒక సమయంలో కోవిడ్ శని వదిలిందని ప్రకటించే అవకాశమున్నట్లు చెబుతున్నారు. జనవరిలోనే జరిగే డబ్ల్యూహెచ్ఓ అత్యవసర కమిటీ సమావేశాల్లోనే ఈ అంశంపై చర్చ జరగనుంది.

వేడిలోనూ పనిచేసే టీకా

కోవిడ్–19 ప్రపంచానికి ముప్పు అన్న హెచ్చరికను డబ్ల్యూహెచ్ఓ తొలగించినప్పటికీ వైరస్‌తో ప్రమాదం లేదని అర్థం కాదు. ఇప్పటికే ఉన్న అనేకానేక శ్వాసకోశ సంబంధిత వ్యాధుల జాబితాలోకి ఇది కూడా చేరిపోయి అప్పుడప్పుడూ అక్కడక్కడా వచ్చిపోతూ ఉంటుంది. ఆరోగ్య వ్యవస్థలు మాత్రం నిత్యం ముంగాళ్లపై ఉండాల్సిన పరిస్థితి. అదే సమయంలో శాస్త్రవేత్తలు కొత్త టీకాలు, చికిత్సలను కనుక్కునే ప్రయత్నాల్లో ఉంటారు. భారత దేశంలో భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన నాసల్ వ్యాక్సీన్ (ముక్కు ద్వారా తీసుకునేది) అందరి దృష్టిలో ఉంది. అత్యవసర పరిస్థితుల్లో, బూస్టర్ డోసుగా వాడేందుకు ఈ టీకాకు అనుమతులు లభించాయి. ఈ టీకా వేయడం మొదలుపెడితే విస్తృత సమాచారం అందుబాటులోకి వస్తుంది. తద్వారా టీకా సామర్థ్యం ఏమిటన్నదీ తెలిసిపోతుంది.

ఈ ఏడాది గమనించాల్సిన ఇంకో కోవిడ్ వ్యాక్సీన్ వేడిని కూడా తట్టుకునే రకానిది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరులోని స్టార్టప్ కంపెనీ మైన్‌వాక్స్ సంయుక్తంగా దీన్ని అభివృద్ధి చేస్తున్నాయి. ఇప్పటివరకూ జరిగిన అధ్యయనాల ప్రకారం... ఈ టీకా ఆల్ఫా, బీటా, గామా, డెల్టా రూపాంతరితాలను నాశనం చేయగల యాంటీబాడీలను తయారు చేయగలదని తేలింది. చండీగఢ్‌లోని సీఎస్ఐఆర్–ఐఎంటెక్‌తోపాటు, ఆస్ట్రేలియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రిపేర్డ్‌నెస్‌లలో ఈ టీకాను పరీక్షించారు. మానవ ప్రయోగాలు ఈ ఏడాది ప్రారంభం కావచ్చు. ఇప్పటివరకూ తయారైన టీకాలను రిఫ్రిజిరేటర్లలో భద్రపరచాల్సిన అవసరముండగా... కొత్త టీకా అధిక ఉష్ణోగ్రతల్లోనూ స్థిరంగా ఉంటుంది. దీనివల్ల ఎంతో ప్రయోజనముంటుందన్నది తెలిసిన విషయమే.



ఆదిత్యుడి పైకి చూపు

ఈ ఏడాది శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అందరూ ఎదురు చూస్తున్న ప్రయోగాల్లో ఆదిత్య–ఎల్1 ముఖ్యమైందని చెప్పాలి. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు భారత్ తొలి ప్రయత్నమిది. సుమారు 400 కిలోల బరువుండే ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో సిద్ధం చేసిన విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్‌ను ఏర్పాటు చేశారు. శ్రీహరికోట నుంచి ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే దీని ప్రయోగం జరిగే అవకాశం ఉంది. కరోనాగ్రాఫ్‌తోపాటు ఆదిత్య–ఎల్1లో ఇంకో ఆరు పేలోడ్స్ ఉంటాయి. భూమి, సూర్యుడి గురుత్వాకర్షణ శక్తులు శూన్యంగా ఉండే లగ్రాంగియన్ పాయింట్ (ఎల్1)లో ఉంటూ ఈ ఉపగ్రహం సూర్యుడిని పరిశీలిస్తుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిలోనే చంద్రయాన్–3ను కూడా ప్రయోగించనుంది. చంద్రుడి ఉపరితలం పైకి సురక్షితంగా దిగడాన్ని పరీక్షించేందుకు చంద్రయాన్–2 ఉపయోగపడగా, తాజాగా చంద్రయాన్–3లో ఒక లాండర్, ఓ రోవర్ రెండూ ఉంటాయి. జీఎస్ఎల్వీ మార్క్–3 రాకెట్ ద్వారా వీటిని జాబిల్లిపైకి చేర్చనున్నారు.

మళ్లీ గగన్‌యాన్ మిస్?

ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో గగన్‌యాన్ ఒకటి. అయితే అది ఈ ఏడాది కూడా డెడ్‌లైన్‌ను అందుకోకపోవచ్చు. 2018 ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ ''భరత మాత ముద్దుబిడ్డ ఒకరు 2022 లేదా అంతకంటే ముందుగానే భారతీయ రాకెట్‌లో అంతరిక్షంలోకి ఎగురుతారు'' అని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఇటీవల లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ, గగన్‌యాన్‌ను 2024 నాలుగో త్రైమాసికంలో ప్రయోగించే అవకాశం ఉన్నట్లు తెలపడం ప్రస్తావించాల్సిన అంశం. సిబ్బంది తప్పించుకునేందుకు అవసరమైన వ్యవస్థ, పారాషూట్ ఆధారంగా వేగాన్ని తగ్గించుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్ల విషయంలో జాప్యం జరగడం వల్ల గగన్‌యాన్ మరోసారి వాయిదా పడింది. ఈ ప్రయోగాలు ఈ ఏడాది చివరిలో జరగవచ్చు. 2024 రెండో త్రైమాసికంలో సిబ్బంది లేకుండా ఒక ప్రయోగాన్ని నిర్వహించి ఆ తరువాత అసలు ప్రయోగం చేపట్టవచ్చు. గగన్‌యాన్‌లో పాల్గొనే వ్యోమగాముల ఎంపిక ఇప్పటికే జరిగిపోయింది. వీరు రష్యాలో తొలిదశ శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం బెంగళూరులో ఇతర శిక్షణలు పొందుతున్నారు.

చిన్న అణు రియాక్టర్లకు సమయం?

ఈ ఏడాది దేశంలో అణు విద్యుత్తు రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లకు సంబంధించి కొంత కదలిక కనిపించవచ్చు. కాలుష్య రహిత విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఏర్పడటం వల్ల, పైగా ఉక్రెయిన్ యుద్ధం పుణ్యమా అని ప్రపంచస్థాయిలో విద్యుత్తు రంగం తీరుతెన్నులు మారిపోయాయి. భారీస్థాయి అణు రియాక్టర్ల మాదిరిగా కాకుండా, 300 మెగావాట్ల సామర్థ్యమున్న ఈ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లను ఫ్యాక్టరీల్లో తయారు చేసే సౌలభ్యం ఉంది. పెద్ద రియాక్టర్లనైతే విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసే స్థలంలోనే అమర్చాల్సి ఉంటుంది. దీనివల్ల నిర్మాణానికి చాలా సమయం పట్టేస్తుంది. ఈ నేపథ్యంలోనే స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల తయారీలో ప్రైవేట్ కంపెనీలకూ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది.

డిజిటల్ రూపాయి కూడా...

రిజర్వ్ బ్యాంక్ డిజిటల్ రూపాయిని అందుబాటులోకి తేనుండటం ఈ ఏడాది ఎదురు చూడాల్సిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానపరమైన అంశాల్లో ఒకటి. దీంతోపాటు జన్యుమార్పిడి ఆవాల పంట క్షేత్ర ప్రయోగాలు, జీ20 అధ్యక్ష స్థానంలో భాగంగా చేపట్టనున్న సైన్స్ డిప్లొమసీ, కృత్రిమ మేధ రంగాల్లోని మార్పులనూ నిశితంగా చూడాల్సి ఉంటుంది. డిజిటల్ పేమెంట్స్ పెరిగిపోతున్న నేపథ్యంలో డిజిటల్ రూపాయి ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది. భౌతిక రూపాయి కున్నంత భద్రత, ఫీచర్లు, నమ్మకం డిజిటల్ రూపాయికీ ఉంటాయని ఆర్బీఐ చెబుతోంది. గోప్యత ఎంత వరకన్నది ఒక సందేహమే.

ఈ ఏడాది జరగనున్న జీ20 సమావేశాలు భారతదేశంలో జరుగుతున్న సైన్స్, టెక్నాలజీ ఇన్నొవేషన్లను ప్రపంచానికి పరిచయం చేసేందుకు చక్కటి అవకాశాల్ని కల్పిస్తున్నాయి. జీ20 సభ్యదేశాలన్నింటికీ మరింత దగ్గరయ్యేందుకు సైన్స్ డిప్లొమసీని ఉపయోగించుకోవాలి. ఇందులో భాగంగానే కోయంబత్తూరు, లక్షద్వీప్, అగర్తలా, ఇండోర్, రాంచీ, సిమ్లా, డయ్యా, ఇటానగర్, దిబ్రూఘఢ్‌లలో శాటిలైట్ ఈవెంట్లు, సైన్స్ శాఖల మంత్రుల సమావేశాలు ఏర్పాటు చేశారు. అయితే... వీటిల్లో ఏ ఒక్కటీ సైన్సు, టెక్నాలజీలకు హబ్ అయిన బెంగళూరు, హైదరాబాద్, చెన్నై లేదా అహ్మదాబాద్‌లలో నిర్వహించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం!

వ్యాసకర్త సైన్సు అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదే పద్ధతి?



షారుఖ్ ఖాన్ నటించిన 'పఠాన్' సినిమాను వ్యతిరేకిస్తూ భజరంగ్ దళ్ కార్యకర్తలు అహ్మదాబాద్‌లోని ఒక మాల్‌లో పోస్టర్లు చించేశారని వార్త. మీకు ఒక సినిమా నచ్చకపోతే దాన్ని చూడటానికి వెళ్లకండి. కానీ ఇలాంటి గూండాగిరి ఏమాత్రం అంగీకార యోగ్యం కాదు.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

మానవీయ మాట



హల్ద్వానీ (ఉత్తరాఖండ్) అంశంలో సుప్రీంకోర్టు 'నివాసుల హక్కులను పరిశీలించకుండా అత్యధిక జనాభాను తమ మూలాల నుంచి పెకిలించకూడదు' అని చెప్పింది. ఇది ఇండియా చట్టబద్ధంగా నడుస్తోందనీ, మానవీయ కోణం దాని మూలవిలువ అనీ స్పష్టంగా చాటింది.

– జఫర్ సరేశ్‌వాలా, మాజీ ఛాన్సలర్

పట్టించుకోవద్దా?



ఇస్లాం పేరుమీద తాలిబన్లు అందరు స్త్రీలు, బాలికలను పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యోగాల నుంచి నిషేధించారు. ఎందుకు ఇండియన్ ముస్లిం పర్సనల్ బోర్డు, ఇంకా ఇతర ఇస్లామిక్ పండితులు దీన్ని ఖండించలేదు? ఎందుకు? వాళ్లు తాలిబన్లతో అంగీకరిస్తారా?

– జావేద్ అఖ్తర్, గీత రచయిత

మార్చుకోలేం



బట్టలు ఎక్కువ స్థలం ఆక్రమించకుండా వాటిని ఎలా మడతపెట్టాలి అన్న విషయం మీద మీరు భూమ్మీద ఉన్న 500 వీడియోలు చూడవచ్చు. అయినాకూడా మీకు పదిహేనేళ్లు ఉన్నప్పుడు వాటిని ఎలా మడతపెట్టాలని మీ అమ్మ చెప్పిందో అలాగే మడతపెడుతుంటారు.

– పర్మీందర్ సింగ్, ఆంట్రప్రెన్యూర్

గెలవాలి




మీ మనసు అనేది ఒక సాధనం. దానికి గురువు ఎలా కావాలో నేర్చుకోండి, అంతేగానీ దానికి బానిస కావొద్దు.

– ఆండ్రూ టెయిట్, కిక్‌బాక్సర్

ఆంధ్రా కురియన్‌కు నివాళి!

అనూహ్యమైన, అనితరసాధ్యమైన పాల ఉత్పత్తి రంగంలో విజయాలు సాధించిన ఆడారి తులసీరావు ఈనెల 4వ తేదీన మరణించారు. మూడున్నర దశాబ్దాలు విశాఖ డెయిరీ చైర్మన్‌గా వ్యవహరించి, రైతుల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. మూడు జిల్లాల పరిధిలోని ప్రతి ఒక్క రైతుతో ప్రత్యక్ష సంబంధాలు నెరపుతూ ఉండేవారు. డెయిరీకి పాలు సరఫరా చేసే వేలాదిమంది రైతుల పిల్లలకు అర్హతలను బట్టి ఉద్యోగాలు కల్పించారు. పాడి రైతులలో పేదవారి పిల్లలకు హాస్టలు వసతి కల్పించి, ఉచిత విద్యను బోధింపజేసిన సేవాదృక్పథం ఆయనది.

రైతాంగ యువత ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా ఆత్మ విశ్వాసంతో వ్యవసాయాన్నీ, పాడినీ అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఆత్మ గౌరవంతో జీవించడానికి ప్రయత్నించాలని తరచూ తన అనుభవాలు జోడించి ఉద్బోధించేవారు. పాలను సేకరించి, వినియోగదారులకు పాలు, పెరుగు, మజ్జిగ అమ్మడమే ప్రధానంగా కొనసాగిన విశాఖ డెయిరీ, అనంతర కాలంలో ఆ పాలతో అనేక ఇతర ఆహార ఉత్పత్తులు ప్రారంభించి రుచి, శుచిలో అగ్ర తాంబూలం అందుకునేలా చేసిన సవ్యసాచి ఆయన. ఆంధ్రా కురియన్‌గా కీర్తించబడినా కించిత్ గర్వం, అతిశయం దరిచేరనివ్వని వ్యక్తిత్వ శైలి ఆయనది.



ఆడారి తులసీరావు


ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో డెయిరీ కార్యకలాపాలను నిర్వహిస్తూనే, యలమంచిలి నియోజక వర్గం రాజకీయాలలో ఆరు దశాబ్దాలు క్రియాశీల పాత్ర పోషించారు. ఆనాటి విశాఖ జిల్లా బోర్డు సభ్యునిగా వ్యవహరించిన తన తాత స్వర్గీయ ఆడారి వీరు నాయుడు ఆయనకు స్ఫూర్తి. నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి పంచాయతీకి మూడుసార్లు సర్పంచ్‌గా ఎన్నికైనారు. యలమంచిలి పురపాలక సంఘంగా మారిన తర్వాత రెండుసార్లు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

2015 డిసెంబరులో భారత పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ తన 37వ జాతీయ సమావేశంలో తులసీరావు పోస్టల్ స్టాంపును విడుదల చేయడం, ఆడారి కీర్తి కిరీటంలో కలికితురాయి. లక్షలాదిమంది రైతులు, వేలాది మంది ఉద్యోగులు, కార్మికుల జీవితాలకు బతుకుదెరువు చూపించిన దార్శనికుడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా ఆడారి తులసీరావు అంత్యక్రియల్లో పాల్గొనడం ఆయన మృతికి గొప్ప నివాళి. ఆయన మరణించినా, పల్లెల్లో ఆయన నిర్మింపజేసిన వందలాది కట్టడాలు ఆయన సేవలను మరింత చిరస్మరణీయం చేస్తాయి. లక్షలాది కుటుంబాలు తరతరాలు ఆ మహనీయునికి రుణపడి ఉంటాయి.

– బి.వి. అప్పారావు, విశాఖపట్నం । 93470 39294

ఆ ఏడు పోతేమి... ఈ ఏడు వస్తేమి?

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

కొత్త యాడాదొచ్చింది. యాడాదే గాకుంట బొగ్గిరి కెల్లి మా యాద్గిరి మామ గుడ్క ఇంటికొచ్చిండు. ఎప్పుడు మాట్లాడినా రాజకీయాల గురించే మాట్లాడ్తుంటడు. రామాయనం, బారతం గూడ రాజకీయాలే అంటడు. రాముని‌కి కైక వెన్నుపోటు పొడ్వబట్కె పద్నాల్గేండ్లు అడ్విలల్ల దిర్గిండు. పార్టి ఫిరాయించ బట్కె విభీషనుడు లంకకు రాజైండు. వెన్నుపోటు, గోడదుంకుడు ఎప్పటి సందో ఉన్నయని జెప్తుంటడు. ఊరంత ఒక దిక్కైతె ఉసుకంట్లోడు ఒక దిక్కు. అందరు ఎడ్డెం అంటె గాయిన తెడ్డెం అంటడు.

''హ్యాపీ న్యూ ఇయర్ మామా'' అన్న. చిన్నగ నగిండు.

''కొత్త యాడాదిల సంతోసంతోని ఉండుమంటె ఎక్కిరిచ్చిన తీర్గ నవ్వుతవేందే?'' అని అడ్గిన.

''కొత్త క్యాలండర్ రాంగనే అంత యాడన్న కొత్తగైతదార! సూర్యుడేమన్న కొత్తగున్నడా? మొగులు మీది కెల్లి చెంద్రుడు కిందికి దిగొచ్చిండా?''

''శానమంది మందు గొట్టింద్రు. డాన్స్ జేసింద్రు. కేకులు గోసింద్రు. అందరు జోష్ మీదుంటె నువ్వు హోష్ గురించి మాట్లాడ్తవేంది?''

''కొత్త యాడాదిని మనాయించెతందుకు నడి నాత్రి దన్క పబ్‌లను, బార్లను తెర్సి ఉంటెతందుకు పర్మిసన్ ఇచ్చింద్రు. తెలంగాన 215 కోట్ల మందు గొడ్తె ఆంద్రల 142 కోట్ల రూపాయల మందు గొట్టింద్రు. సర్కార్ ఎవ్వలితోని నడుస్తున్నదో ఎర్కైనార? మందుతోని నడుస్తున్నది.''

''వహవ్వా! క్యా ఖూబ్''

''తొమ్మిదేండ్లు చెంద్రబాబు ముఖ్యమంత్రి కుర్సి మీద గూసున్నడు. ఏడేండ్లు అపొజిషన్ లీడర్ కుర్సి మీద గూసోని రికార్డ్ బిటాయించిండు. ఆక్రి మోక ఇయ్యుండ్రి. మల్ల ముఖ్యమంత్రిని జెయ్యుండ్రి అన్కుంట జెనంను బత్మిలాడుతున్నడు. గిదేం కర్మ రాష్ట్రంకు అన్కుంట మీటింగ్‌లు బెట్టి పల్ల పల్ల ఏడుస్తున్నడు. గానడ్మ కందుకూరుల సన్నటి బాటల మీటింగ్ బెట్టింద్రు. దాంతోని మెస్లెతందుకు గుడ్క జాగ లేక జెనం ఒగల మీద ఒగలు బడి తొమ్మిదిమంది సచ్చింద్రు. గిదే పెద్ద కర్మ రాష్ట్రంకు అయ్యింది. చెంద్రబాబు హన్మంతున్ని జెయ్యబోతె బోడ కోతి అయ్యింది. కొత్త యాడాది పస్టు తారీకు గుంటూర్ల టీడీపీ చెంద్రన్న కానుకలు పంచుడు ప్రోగ్రాం బెట్టింది. చెంద్రబాబు స్టేజి ఎక్కుతున్నప్పుడే గాదాని ఒక తంతె కూలింది. తంతెను బాగ జేసినంకనే గాయిన స్టేజ్ ఎక్కిండు. కానుకల కోసం ఆడోల్లు ఒగల నొగలు సూక్కున్నరు. కొందరు కింద బడ్డరు. కింద బడ్డోల్లను తొక్కుకుంట బోయింద్రు. దాంతోని ముగ్గురు ఆడోల్లు సచ్చింద్రు. పోయిన యాడాది ఆక్రిల చెంద్ర బాబు బెట్టిన మీటింగ్‌ల తొమ్మిది మంది సస్తె కొత్త యాడాదిల బెట్టిన మీటింగ్‌ల ముగ్గురు సచ్చింద్రు. గివన్ని జూస్తె పచ్చ మీటింగ్ల కర్మేంది రాష్ట్రంకు అని జెనం అన్కుంటున్నరు. కొత్త యాడాదొచ్చినా బాబు మారలే. గాయిన కర్మ మీటింగులు సుత మారలే''

''పప్పు లోకేశ్ సంగతేందే?''



''అందరు పాదయాత్ర జేస్తున్నరు. ఎన్కట మా నాయిన గుడ్క పాదయాత్ర జేసిండు. బారత్ జోడో అన్కుంట రాహుల్ గాంది గూడ పాదయాత్ర జేస్తున్నడు. ఇయ్యాల గాకున్నా రేపన్న ముఖ్యమంత్రిని గావాలంటె పాదయాత్ర జెయ్యాలె. నడిస్తినా అంటే తిన్నది అర్గుతది. బొర్ర రాకుంట ఉంటుంది అని లోకేశ్ అన్కుండు. అయ్యగారి తాన్కి బోయిండు. మంచి మూర్తం బెట్టిచ్చుకుండు. 27 తారీకున కుప్పం కెల్లి ఇచ్చాపురం దాన్క పాదయాత్ర జేస్తనని జెప్పిండు. యువ గలం పేరు మీద 400 దినాలు 4,000 కిలోమీటర్లు పాదయాత్ర జేస్తనన్నడు. యెంబడి పస్పు బస్తలు గూడ గొంచ బోతనని జెప్పిండు. జెనం మీద పస్పు సల్లుకుంట పాదయాత్ర జేస్తనన్నడు. పాదయాత్ర జేస్కుంట టీడీపీని 'బలవంతం' జేస్తడు, గిదేందని అడ్గకురా గాయిన 'బలవంతం' అంటె 'బలోపేతం' అని అనుకుంటడు.''

''మామా! సలికాలం గూడ ఉబ్బరిస్తున్నదెందుకే?''

''కొత్త యాడా దొచ్చిందని సలి గూడ మందు గొట్టి గరమైందిరా. రేల్ గాడి సైమమయింది వొస్తరా'' అన్కుంట యాద్గిరి మామ ఊరికి బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

దక్షిణాదిలో బలపడుతోంది

అభిప్రాయం



రఘురామ్ పురిఘళ్ళ

దక్షిణాది రాష్ట్రాలపై భారతీయ జనతాపార్టీ దృష్టి అని తరచుగా మనం వింటున్నాం, వార్తలను చదువుతున్నాం. భారతీయ జనతాపార్టీ దక్షిణాది రాష్ట్రాల్లో కేవలం కర్ణాటక, పాండిచ్చేరిలో మాత్రమే అధికారంలో ఉంది. అయితే పాండిచ్చేరి చాలా చిన్న రాష్ట్రం. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో బలం పెంచుకోవాలనీ, ఇక్కడ కూడా భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చెయ్యాలనీ అనేక సంవత్సరాలుగా భాజపా అనుకుంటోంది.

కేరళ విషయానికి వస్తే 2019 ఎన్నికల్లో భాజపా గణనీయమైన ఓటు బ్యాంకును సంపాదించింది. అయితే సీట్ల విషయంలో ఆశించిన ఫలితాలు రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఓట్ల శాతం పెంచుకోగలిగింది కానీ సీట్లు మాత్రం రాలేదు. ఇప్పుడు పట్టుదలగా 2024 ఎన్నికల కోసం గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. రెండు బలమైన కూటములైన యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య భాజపా ఈసారి తన సత్తా చాటాలని చూస్తోంది.



తమిళనాడు విషయానికి వస్తే 2019 పార్లమెంట్ ఎన్నికల్లో భంగపడినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకుని నాలుగు శాసనసభా స్థానాలను గెలుచుకొంది. ముగ్గురు మాజీ రాష్ట్ర అధ్యక్షులకు కేంద్రంలోనూ, ప్రభుత్వంలోనూ సముచిత స్థానం కల్పించింది. రాష్ట్ర పార్టీ పగ్గాలను ఐపీఎస్ అధికారీ, యువకుడూ అయిన అన్నామలైకు అప్పగించి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది కేంద్ర నాయకత్వం. జయలలిత మరణానంతరం ఏఐఏడీఎంకే బలహీనపడటం తెలిసిందే. ఆ విధంగా ఏఐఏడీఎంకే స్థానాన్ని భాజపా భర్తీ చెయ్యాలని చూస్తోంది. 5 దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేలు ఏలిన చోట జాతీయ పార్టీగా భాజపా... యువ రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో తమిళనాడులో దూసుకెళుతోంది.

ఆంధ్రప్రదేశ్ విషయంలో రెండు ప్రాంతీయ పార్టీలయిన – వైసీపీ, టీడీపీల మధ్య ఎలాగైనా ఈసారి ఎన్నికల్లో తన సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. తెలంగాణ విషయానికి వస్తే గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక స్థానాన్ని మాత్రమే గెలిచి నప్పటికీ 2019 పార్లమెంట్ ఎన్నికలలో టీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు షాక్ ఇచ్చి ఏకంగా 4 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకొంది. ఆ తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికలలో మరో రెండు శాసనసభ స్థానాలను గెలిచి మొన్న మునుగోడులో టీఆర్ఎస్‌కు గట్టి సవాల్ విసిరింది.

కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఒక వైపు, యువ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ తన పాదయాత్రతో మరోవైపు కేసీఆర్‌కు చెమటలు పట్టిస్తున్నారు. మరోవైపు డా॥ కే. లక్ష్మణ్‌ను రాజ్యసభ సభ్యుడిగానూ, ఓబీసీల జాతీయ అధ్యక్షుడిగానూ చేశారు. డీకే అరుణ, ఎంపీ అరవింద్, ఈటెల రాజేందర్ లాంటి వారు ఈసారి ఎలాగైనా తెలంగాణలో కాషాయ జెండా ఎగురవెయ్యాలని తీవ్రంగా పనిచేస్తున్నారు.

మొత్తం మీద దక్షిణ భారతదేశంలో భారతీయ జనతా పార్టీ స్థిరమైన వేగంతో ముందుకు సాగుతోంది.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు
raghuram.bjp@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** పౌర్ణమి రా.3.19 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.11.35 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.6.32 నుండి 8.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.30 వరకు తదుపరి ప.12.27 నుండి 1.11 వరకు, **అమృతఘడియలు:** ప.12.38 నుండి 2.23 వరకు; **రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు; **సూర్యోదయం** 6.36 ; **సూర్యాస్తమయం** 5.36.

క్లుప్తంగా...

వైవీయూ వీసీ పోస్టుకు నోటిఫికేషన్ జారీ



వైవీయూ ముఖద్వారం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) నూతన వైస్ చాన్సలర్ (వీసీ) నియామకం కోసం ఉన్నత విద్యా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3 వర్సిటీలకు నోటిఫికేషన్ జారీచేయగా, అందులో వైవీయూ ఒకటి. ప్రస్తుతం వీసీగా బాధ్యతలు నిర్వహిస్తోన్న ఆచార్య మునగల సూర్యకళావతి పదవీ కాలం ఈ నెల 7తో ముగియనుంది. దీంతో నూతన వీసీ నియామకానికి ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు నోటిఫికేషన్ ఇచ్చారు. అర్హులైన ఆచార్యులు 20 రోజుల్లోపు వీసీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కాగా, వీసీ నియామక ప్రక్రియకు సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో మాత్రు/పొరుగు వర్సిటీ వీసీని కొంతకాలం వైవీయూకు ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘటన



ఘటనా స్థలంలో సుబ్బయ్య మృతదేహం

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు సోయం సుబ్బయ్య (35) అనే గిరిజనుడిని హతమార్చిన ఘటన మండలంలోని బుర్కనకోటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడి భార్య గౌరమ్మ కథనం మేరకు వివరాలిలావున్నాయి.. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో మారణాయుధాలతో పదిమంది వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులకు సమీపంలోని బుర్కనకోటలో నివాసముంటున్న సుబ్బయ్య ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో పడుకుని ఉన్న సుబ్బయ్యను వారు బలవంతంగా సమీపంలోని మామిడిచెట్టు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం గొడ్డలితో తలపై నరకడంతో పాటు కర్రలతో తీవ్రంగా కొట్టి హతమార్చి మృతదేహాన్ని చెట్టు దగ్గరే పడేసి వారంతా అక్కడినుంచి వెళ్లిపోయారు. సుబ్బయ్యను హతమార్చిన మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లోని కుంట ఏరియా కమిటీ పేరుతో ఘటనా స్థలంలో లేఖను వదిలారు. సుబ్బయ్య పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, ఈ విషయంపై పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతోనే అతనిని హతమార్చినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు.

విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనండి



బండారు దత్తాత్రేయకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న స్వాత్మానందేంద్ర

సాక్షి, న్యూఢిల్లీ/సింహాచలం: ఈ నెల 27 నుంచి 31 వరకు జరుగనున్న విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనాలని హరియాణా, పంజాబ్ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, బన్వరిలాల్ పురోహిత్‌లను విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ ఆహ్వానించారు. గురువారం చండీగఢ్ వెళ్లిన స్వాత్మానందేంద్ర..ఆయా రాష్ట్రాల రాజ్‌భవన్‌లను సందర్శించి విశాఖ శ్రీ శారదాపీఠం వార్షిక మహోత్సవాల ఆహ్వాన పత్రికను, రాజశ్యామల అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే రాజశ్యామలా యాగంలో పాల్గొనాలని గవర్నర్లను కోరారు. విశాఖ శ్రీ శారదాపీఠం ఆధ్వర్యంలో హరియాణాలోని కురుక్షేత్ర వద్ద గుంతి ధామ్‌లో ఫిబ్రవరి 11 నుండి 26వ తేదీ వరకు లక్ష చండీ యాగాన్ని తలపెడుతున్నట్లు వివరించారు.

ముక్కంటి సేవలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్



గురుదక్షిణామూర్తి సన్నిధిలో రవిన్ ఖోస్లా

శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రవిన్ ఖోస్లా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణగోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తిసన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనమిచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈవో సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి అభయం



- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- 'కిల్‌కారీ' పేరిట వినూత్న కార్యక్రమానికి రూపకల్పన
- వాయిస్ కాల్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు
- ఎంతో ప్రయోజనకరం అంటున్న వైద్యులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు 'కిల్‌కారీ' పేరిట ఆడియో కార్యక్రమానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైల్‌కు డాక్టర్ అనిత అనే కల్పిత వైద్యురాలి వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ సందేశాలు గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వైద్యులు అంటున్నారు. వారిలో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా వాయిస్ సందేశం ఉంటుందని చెబుతున్నారు.

గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి..

మహిళ గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు.. బిడ్డకు ఏడాది వయసు వచ్చేవరకూ 72 సార్లు మొబైల్ సందేశాలు వచ్చేలా కిల్‌కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. ప్రతి ఒక్కరికీ 0124488000 నంబర్ నుంచి కాల్ వస్తుంది. ఒకసారి ఫోన్ ఎత్తకుండా మిస్ అయితే, ఐవీఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒకేరోజు మూడుసార్లు ఫోన్ వచ్చేలా చేస్తుంది. ఆ తర్వాత మూడు రోజులకు రెండుసార్లు కాల్ చేయడానికి ప్రయత్నిస్తుంది. గర్భిణులు, బాలింత కిల్‌కారీ నుంచి కాల్ పొందలేకపోయినా, ఆ వారాల సందేశాన్ని తిరిగి వినాలనుకున్నా ఆమె దానిని మళ్లీ వినడానికి 14423కు డయల్ చేయవచ్చు. బాలింత ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే ఏ విధమైన ఆహారం తీసుకోవాలనే దానితోపాటు వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను వివరిస్తారు.

కిల్‌కారీపై విస్తృత అవగాహన



గర్భిణులు, పాలిచ్చే తల్లుల కోసం ప్రవేశ పెట్టిన కిల్‌కారీ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. ఏఎన్‌ఎంలు ప్రతి గర్భిణి, పాలిచ్చే తల్లులను నమోదు చేస్తుండగా, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని వారు తప్పకుండా ఆ సందేశాలు వినేలా అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలి, పాలిచ్చే తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువు ఆరోగ్యం విషయంలో చేపట్టాల్సిన చర్యలు ఇలా సమగ్ర సమాచారాన్ని కల్పిత డాక్టర్ వాయిస్‌తో వారికి చేరవేస్తారు.

డాక్టర్ మాచర్ల సుహాసిని,
డీఎంహెచ్‌వో, ఎన్టీఆర్ జిల్లా

పోలీసులపై దాడి చేసిన టీడీపీ నేతలపై కేసులు

శాంతిపురం/చిత్తూరు అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా బుధవారం పోలీసులపై దాడులకు తెగబడిన టీడీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ మునస్వామి తెలిపిన వివరాల మేరకు పోలీసులపై దాడి చేసిన ఇతర జిల్లాలకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులతో పాటు కుప్పం నియోజకవర్గ పరిధిలోని పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఎస్.గొల్లపల్లి క్రాస్‌లో పోలీసులపై దాడి, చేయి చేసుకోవడం, తోసివేయడం, దౌర్జన్యం చేయడంపై పలమనేరు సీఐ అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విశ్వనాథనాయుడు, కేదార్‌నాథ్, ఆంజనేయరెడ్డి, చంద్రకళ, నాగరాజు, అనసుయ, ప్రవీణ్, సుగుణ, రమేశ్, జయపాల్ తదితరులను నిందితులుగా పేర్కొన్నారు. అనుమతి లేకుండా ప్రచార రథాలను వినియోగించినందుకు రామకుప్పం మండలం ననియాలకు చెందిన రాజశేఖర్, పశ్చిమ గోదావరి జిల్లా పెద్దవల్లమిల్లికి చెందిన నానిబాబు, గుంటూరు జిల్లా ఫిరంగిపురానికి చెందిన రాజుపై కేసులు నమోదు చేశారు. 121 పెద్దూరులో కృష్ణమూర్తి ఇంటి మేడపై ఉన్న పోలీసులపై దాడికి సంబంధించి గంగవరం ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మంజునాథ్, అరుణ్‌కుమార్ తదితరులపై కేసులు నమోదయ్యాయి. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు..

ప్రతిపక్షనేత చంద్రబాబును పోలీసులు అరెస్టు చేస్తారంటూ వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కుప్పంలో పర్యటిస్తున్న చంద్రబాబును ఏక్షణమైనా పోలీసులు అరెస్టు చేయొచ్చంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. ఇలా తప్పుడు సమాచారంతో ప్రజల్ని తప్పుదారి పట్టించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాంబోడియావర్సిటీతో ఎస్వీయూ ఒప్పందం



ఎస్వీయూ వీసీ డాక్టర్ రాజారెడ్డికి ఒప్పంద పత్రాలను అందజేస్తున్న డాక్టర్ పద్మజ

తిరుచానూరు(తిరుపతి జిల్లా): విద్య, పరిశోధనలు, విద్యార్థుల పరస్పర మార్పిడిపై కాంబోడియా యూనివర్సిటీతో ఎస్వీ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. ఎస్వీయూలోని సెంటర్ ఫర్ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ అధ్యాపకురాలు డాక్టర్ ఎం.పద్మజ కాంబోడియా దేశంలోని అంకోర్‌వాట్‌లో ఉన్న విష్ణు దేవాలయానికి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి మధ్య గల సారూప్యతలపై రీసెర్చ్ స్కాలర్ రంగస్వామితో కలిసి పరిశోధనలు నిర్వహించారు. కాంబోడియాలో తాము పరిశోధన చేసిన సమయంలో విద్యార్థులు, పరిశోధకుల మార్పిడి కోసం అక్కడి యూనివర్సిటీలతో ఎస్వీయూ పరస్పర అంగీకార ఒప్పందం కుదుర్చుకున్నట్లు డాక్టర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు కాంబోడియా దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియా, చీఫ్ ఆఫ్ బ్యూరో క్లీన్ సిటీ టూరిజం డిపార్ట్‌మెంట్‌తో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డికి గురువారం అందజేసినట్లు ఆమె వివరించారు.



బటర్‌ఫ్లై భలే..భలే..!

అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరులో గురువారం రంగు రంగుల సీతాకోకచిలుకలు చూపరులను ఆకర్షించాయి. పసుపు, పచ్చ రంగుల్లో రెండు సీతాకోక చిలుకలు కనువిందు చేశాయి. వీటిని పలువురు ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు తీసుకున్నారు.

పోలీసుల గెటప్‌లో ఎర్రచందనం రవాణా

- అన్నాదమ్ముల అరెస్ట్.. 31 ఎర్రచందనం దుంగల స్వాధీనం
- నిందితులపై వివిధ స్టేషన్లలో 89 కేసులు
- టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి వెల్లడి



పట్టుబడ్డ ఎర్రదుంగలు, కారు, నిందితులను చూపుతున్న ఎస్పీ చక్రవర్తి

తిరుపతి అలిపిరి: వారిద్దరూ అన్నదమ్ములు. చిన్నతనం నుంచి కలిసి పెరిగారు. కొన్నేళ్లుగా ఎర్రచందనం స్మగ్లింగ్ కూడా కలిసే చేస్తున్నారు. వారిపై రెండుసార్లు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. అయినా ఏ మార్పులేదు. ఇటీవల ఏకంగా పోలీసుల వేషధారణలోనే ఎర్రచందనాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. చివరికి ఆ అన్నదమ్ములు పోలీసులకు చిక్కారు. ఈ కేసు వివరాలను తిరుపతిలో గురువారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి మీడియాకు వెల్లడించారు. 'వైఎస్సార్ జిల్లా చాపాడు మండలానికి చెందిన అన్నదమ్ములు షేక్ చెంపతి లాల్‌బాషా, షేక్ చెంపతి జాకీర్ కొన్నేళ్లుగా ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. వీరిద్దరూ పోలీసు యూనిఫాం వేసుకుని స్మగ్లింగ్ చేస్తున్నారు. పోలీసులమని నమ్మబలుకుతూ ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సైతం హైజాక్ చేసి సరుకును ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. వారిపై వివిధ జిల్లాల్లో 89 కేసులు ఉన్నాయి. వీరి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఈ క్రమంలో సీఐ రామకృష్ణ, ఆర్‌ఐ చిరంజీవులు బృందం ఏర్పేడు సమీపంలోని కృష్ణాపురం, మల్లెమడుగు, కరకంబాడి ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టింది. కరకంబాడి ఫారెస్ట్ బీట్ అమర్ రాజా ఫ్యాక్టరీ విన్నియో కంపెనీ వద్ద కారును ఆపి నిలబడి ఉన్న లాల్‌బాషా, జాకీర్‌ను గమనించి, వారి వద్దకు వెళుతుండగా... పారిపోవడానికి ప్రయత్నించారు. ఆర్‌ఎస్‌ఐ రాఘవేంద్ర, మరికొందరు పోలీసులు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. వారి నుంచి రూ.20లక్షల విలువైన 31ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. కారులో పోలీసు యూనిఫాం కూడా ఉంది.' అని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ వివరించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నవారికి ఆయన రివార్డులు ప్రకటించారు.

రోడ్‌షోలు, సభలపై నిషేధం కోరుతూ పాల్ పిటిషన్

- పిల్ కాకుండా పిటిషన్ వేయడంపై రిజిస్ట్రీ అభ్యంతరం
- తాను విచారించలేనన్న జస్టిస్ రఘునందన్‌రావు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రోడ్‌షోలు, బహిరంగ సభలపై నిషేధం విధించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) రూపంలో కాకుండా రిట్ పిటిషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేయడంపై అభ్యంతరం తెలిపింది. దీనిపై తగిన నిర్ణయం తీసుకునేందుకు ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి ముందుంచింది. రోస్టర్ ప్రకారం ఈ వ్యాజ్యం గురువారం న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు వద్దకు వచ్చింది. ఈ వ్యాజ్యాన్ని పిల్ రూపంలో దాఖలు చేయాలి కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. అయినా పిటిషనర్ గతంలో తన క్లయింట్ అయినందువల్ల ఈ వ్యాజ్యాన్ని తాను విచారించలేనని స్పష్టం చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు వచ్చేలా రిజిస్ట్రీకి ఆదేశాలివ్వాలని పాల్ న్యాయవాది ఎంవీ రాజారాం కోరగా.. ఆ పని తాను చేయలేనని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అత్యవసరం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది చెబుతున్నారంటూ ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

సౌమ్యనాథుడి గుడి.. రక్షణ కొరవడి

- ఎర్రరాతితో ఆలయ నిర్మాణం
- దశలవారీగా కూలిపోతున్న రక్షణ గోడలు
- పరిరక్షించాలంటున్న భక్తులు



రాతిగోడలపై ఉన్న ఇటుకల కట్టడం కూలిన దృశ్యం

రాజంపేట: సాక్షాత్తు కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని పోలిన మూలవిరాట్టు.. ఎర్రరాతితో ఆలయ నిర్మాణం...అదే నందలూరు గ్రామంలోని సౌమ్యనాథాలయం.. చోళ, మట్లిరాజుల కళానైపుణ్యానికి అద్దం పట్టే ఈ కోవెలకు ఇప్పుడు రక్షణ కరువైంది. ఈ ఆలయానికి చుట్టూ ఉన్న ప్రాచీన ప్రహరీ కూలిపోతోంది. సౌమ్యనాథాలయం కట్టడాలు, ఆలయ నిర్మాణం కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం ఆలయ భద్రతపై అనేక అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

ఆలయ నిర్మాణం ఇలా..

విశాలమైన ప్రాంగణంలో, నాలుగు రాజగోపురాల మధ్య ఉన్న ఈ ఆలయం పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ ఆలయంలో 108 స్తంభాలుఉంటే , అన్నింటిపైన భాగవతం రచించి ఉండటం కనిపిస్తుంది. ఆ ఆలయం శిథిలమైపోగా 11వ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు ఈ ఆలయ నిర్మాణానికి పూనుకున్నాడని , అలా పునఃప్రారంభమైన ఈ క్షేత్ర నిర్మాణంలో పాండ్య, కాకతీయ, విజయనగరాజులు సైతం పాల్గొన్నారని చరిత్ర చెబుతోంది.

ఎర్రరాతిని ఉపయోగించే రక్షణ గోడలు..

ఎర్రరాతిని ఉపయోగించే రక్షణ గోడలతో పాటు ఆలయ నిర్మాణం జరిగింది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలను కలుపుతూ పెద్దఎత్తున రక్షణ గోడను నిర్మించారు. ప్రాచీన శిల్పులు రక్షణగోడలో కొంతభాగం పెద్దపెద్ద బండరాళ్లను ఉపయోగించారు. పైగాభాగంలో నాణ్యమైన సున్నపు ఇటుకలను అమర్చారు. ఆలయం కూడా ఈ ప్రహరీ మధ్యలో కనిపించకుండా కేవలం గర్భాలయం గోపురం కనిపించేదని పూర్వీకులు చెబుతున్నారు. ఇప్పుడు అంతర్భాగంలోని ఆలయం కనిపిస్తోంది. దీన్ని బట్టి రక్షణ గోడలు ఏ మేరకు ఎంతవరకు కూలిపోతూ వచ్చాయో ఇట్టే అవగతమవుతోంది.

ఇటుకలు ఉన్నంత వరకు కూలిపోతూ..

ఆలయం ప్రహరీ పూర్తిగా దెబ్బతినింది. మరికొన్ని చోట్ల పై భాగంలో ఉన్న ఇటుకల నిర్మాణం కూలిపోవడంతో మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. ఆలయ రక్షణ గోడలను ఇంతవరకు ఎక్కడా కూడా పునరుద్ధరించిన దాఖలాలు కనపించడంలేదు. కేవలం గాలిగోపురాలకు మరమ్మతులు చేపట్టారు. ఆలయం చుట్టూ ఉన్న రక్షణగోడలు బలహీనంగా కనిపిస్తున్నాయి.

కేంద్ర పురావస్తుశాఖ అధికారి ఏమంటున్నారంటే..

సౌమ్యనాథాలయ రక్షణగా ఉన్న ప్రహరీలో కూలిన కొంతభాగం పునరుద్ధరించాలంటూ నివేదిక పంపామని కేంద్రపురావస్తుశాఖ సీఏ (కన్జర్వేటర్ అసిస్టెంట్) అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు.

సౌమ్యనాథాలయం నిర్మాణమే అపురూపం

జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో సౌమ్యనాథాలయం నిర్మాణమే అపురూపం. చోళులు, పాండ్య, కాకతీయ, విజయనగరాజులు నిర్మితం చేసిన ఆలయాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర పురావస్తుశాఖపై ఉంది.

–భూమన శంకర్‌రెడ్డి,
సంఘసేవకుడు, నందలూరు

డాక్టర్ యాదాల అశోక్ బాబుకు గిఫ్టెడ్ హ్యాండ్స్ అవార్డు



యాదాల అశోక్‌బాబు

ఒంగోలు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదాల అశోక్‌బాబుకు లండన్‌కు చెందిన లండన్ గ్యాస్ట్రో కేర్ సంస్థ అరుదైన గిఫ్టెడ్ హ్యాండ్స్ అవార్డును అందజేసింది. హైదరాబాద్‌లోని మై హోమ్స్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల్లో కరోనా సమయంలో ప్రజలకు వైద్యసేవలు అందించడంలో కృషి చేసిన ఐదుగురికి ఈ అవార్డులను ప్రదానం చేసింది. అందులో డాక్టర్ యాదాల అశోక్‌బాబు ఒకరు. ఉత్తరాఖండ్ వరదల సమయంలో వైఎస్సార్ వైద్య విభాగం తరఫున అక్కడ మెడికల్ క్యాంపులు నిర్వహించడంలోను, కరోన సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ వైద్య విభాగాన్ని సంయమనం చేసుకుంటూ పేద ప్రజలకు సేవలు అందించడంలోను కృషి చేసినందుకుగాను ఈ అవార్డు ఆయనకు లభించింది. లండన్ గ్యాస్ట్రోకేర్ అధినేత డాక్టర్ ఆల్బర్ట్ జాన్, హైదరాబాద్ ప్రతినిధి డాక్టర్ చంద్రశేఖర్ పులి గిఫ్టెడ్ హ్యాండ్స్ అవార్డును అందజేశారు. తన జీవితంలో ఇదో అరుదైన ఘటన అని, ఇటువంటి అవార్డు అందుకోవడం తన సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని యాదాల అశోక్‌బాబు చెప్పారు.

కరోనా బాధిత పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సహాయం

- అందజేసిన మ్యాన్ కైండ్ ఫార్మా

సాక్షి, అమరావతి: కరోనా తొలి వేవ్‌లో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు మ్యాన్ కైండ్ ఫార్మా రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఏపీలో తొలి వేవ్‌లో కరోనా బారిన పడి 214 మంది పోలీసులు మృతిచెందగా, వారిలో 193 కుటుంబాలకు మ్యాన్‌కైండ్‌ఫార్మా రూ.3 లక్షల చొప్పున రూ.5.79 కోట్లు ఇప్పటికే అందించింది. మిగిలిన 21 కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున రూ.63 లక్షలను మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం అందజేసింది. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆ చెక్కులను పోలీసు కుటుంబాలకు అందించారు. ఐజీ (వెల్ఫేర్) కాళిదాసు రంగారావు, మ్యాన్‌కైండ్ జోనల్ మేనేజర్ మునికృష్ణ, సీనియర్ ఏరియా మేనేజర్ గఫూర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వీసీల సమావేశానికి ఏయూ ఆతిథ్యం

- 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహణ

ఏయూక్యాంపస్: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) సౌత్ జోన్ విశ్వ విద్యాలయాల ఉపకులపతుల సమావేశానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనుంది. జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో ఏయూ వేదికగా ఈ సమావేశాలు జరుగనున్నాయి. గురువారం ఉదయం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో వైస్‌చాన్సలర్ల సమావేశ నిర్వహణపై ఏర్పాటు చేసిన వివిధ కమిటీలతో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమావేశమయ్యారు. జనవరి 31న ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఈ సదస్సుకు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి విశ్వవిద్యాలయాల ఉపకులపతులతోపాటు దేశ వ్యాప్తంగా 150 మందికిపైగా ఉపకులపతులు హాజరవుతారు. 'రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్‌మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' అంశంపై సదస్సును నిర్వహించనున్నారు. విభిన్న రంగాలకు చెందిన 15 మంది వరకు నిపుణులు, పలువురు విద్యారంగ నిపుణులు, వక్తలు సదస్సులో పాల్గొంటారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సదస్సు నిర్వహణ సమన్వయకర్తలు ఆచార్య కె.రాంజీ, ఆచార్య బి.మోహన వెంకట రామ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత పండితుడు మల్లంపల్లి కన్నుమూత



కాకినాడ కల్చరల్/నల్లజర్ల: ప్రవచన కర్త, సంస్కృత పండితుడు మల్లంపల్లి అమరేశ్వరప్రసాద్ (80) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొన్నేళ్లుగా సామర్లకోట మండలం అచ్చంపేటలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈయన స్వస్థలం ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల. ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఈయన శిష్యుడు. మల్లంపల్లి ఉద్యోగ రీత్యా కాకినాడలో స్థిర పడ్డారు. స్థానిక శ్రీనగర్‌లోని నవభారత్ ఎయిడెడ్ పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయన శ్రీనాథుని కాశీఖండంను తెలుగులో అనువదించారు. అపర్ణాదేవి వ్రత మహిమ పుస్తకాన్ని రచించారు. శ్రీమద్ ఆంధ్ర మహా భాగవతాన్ని తెలుగులోకి అనువదించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంపై మంచి పట్టు సాధించారు. స్థానిక వెంకట్‌నగర్‌లో మృణాళిని విద్యాలయాన్ని స్థాపించి ఉచితంగా సంస్కృతం భాష నేర్పించేవారు. ఉపాధ్యాయ పరీక్షలకు శిక్షణ ఇచ్చేవారు. నమశ్శివాయ పంచాక్షరి కోటిసార్లు పఠించి మఠాధిపతుల నుంచి పురస్కారాలు పొందారు. సినీ దర్శకులు కె.విశ్వనాథ్‌కు ఆత్మీయుడు. సూర్యకళామందిర్‌లో 2014లో కె.విశ్వనాథ్ చేతుల మీదుగా సన్మానం పొందారు. ఈయన శివభక్తుడు, శివుని ఆరాధన లేకుండా పచ్చి మంచినీళ్లు కూడా తాగేవారు కాదని ఆయన సన్నిహితులు తెలిపారు. సుబ్రహ్మణ్య కల్యాణం, అన్నపూర్ణా కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించేవారు. ఈయన మంచి ప్రవచన కర్త అని స్థానిక సాహితీవేత్తలు కారుప్రోలు గౌరినాయుడు, జానకీరామ్‌చౌదరి, పోచినపెద్ది సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు.

చంద్రబాబును తరిమికొడతాం

830వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: అమరావతిని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని చూస్తున్న బాబును తరిమికొడతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 830వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. తన హయాంలో చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు బాబు ప్రజల్లో తిరిగి రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నాడని మండిపడ్డారు. బహుజనుల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు.. మూడు పంటలు పండే భూములను లాక్కున్న కారణంగా పేదలకు కనీసం కూలి పనులు చేసుకునే పరిస్థితి లేక నేడు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సీపీఐ, సీపీఎం, జనసేన, బీజేపీలు బాబు ఇచ్చే ప్యాకేజీలకు ఆశపడుతూ పేదలను పూర్తిగా పక్కనబెట్టి బాబు స్క్రిప్టును చదువుతుండడం సిగ్గుచేటన్నారు. నేడు రాష్ట్రంలో పేదలకు సంక్షేమం నిండుగా అందుతుందనడంలో సందేహం లేదని, ప్రతి పేదవాడికి విద్యను అందించేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దాడన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

హల్ద్వానీ రైల్వే భూముల్లో ఆక్రమణల తొలగింపుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానీలోని రైల్వే శాఖకు చెందిన 29 ఎకరాల భూమిలోని ఆక్రమణల తొలగింపుపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ అంశాన్ని మానవీయ కోణంలో ఆలోచించాలని, 50 వేల మంది ప్రజలను ఒక్క రాత్రిలోనే ఖాళీ చేయించలేమని పేర్కొంది. సమస్యకు ఆచరణీయ పరిష్కారాన్ని కనుగొనాలని సూచించింది. సదరు భూమి తమదేనంటూ నివాసితులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకాల ధర్మాసనం గురువారం విచారించింది. రైల్వే శాఖ అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూనే ఆ భూమిలో ఉంటున్న వారి హక్కులను గుర్తించి, వారికి పునరావాసం కల్పించడానికి వీలుగా ఆచరణీయమైన ఏర్పాటు అవసరమని పేర్కొంది. ఆక్రమణలను వెంటనే తొలగించాలన్న ఉత్తరాఖండ్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ధర్మాసనం రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వివాదాస్పద భూమిలో రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖలకు ఎంత భూమి ఉందో స్పష్టం చేయాలంది. ఈ అంశంపై తదుపరి విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా వేసింది. హల్ద్వానీలోని బన్‌భూల్‌పురాలోని ఆక్రమిత రైల్వే జాగాలో ఉన్న నిర్మాణాలను వారం ముందుగా నోటీసులిచ్చి కూల్చివేయాలంటూ గత డిసెంబర్ 20వ తేదీన ఉత్తరాఖండ్ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. 1947లో దేశ విభజన సమయంలో పాక్‌కు వెళ్లిపోయిన వారి భూములను ప్రభుత్వం వేలం వేయగా తాము కొనుక్కున్నామంటూ నిర్వాసితులు వాదిస్తున్నారు. సదరు వివాదాస్పద భూమిలో ఉంటున్న 4,365 కుటుంబాల్లో 4 వేల ముస్లిం కుటుంబాలున్నాయని రైల్వే శాఖ అంటోంది.

వచ్చే జనవరి ఒకటికి రామ మందిరం సిద్ధం: షా

సబ్రూం(త్రిపుర): అయోధ్యలో శ్రీరామ మందిరం 2024 జనవరి ఒకటో తేదీ నాటికి సిద్ధమవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. త్రిపురలోని సబ్రూంలో గురువారం ఆయన బీజేపీ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు మందిరం అంశాన్ని కోర్టు పరిధిలోకి నెట్టివేశాయి. మోదీ ప్రధాని అయ్యాక సుప్రీం కోర్టు అనుమతించడంతో రామ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. 'రాహుల్ బాబా.. రామ మందిర నిర్మాణం 2024 జనవరి 1నాటికి సిద్ధమవుతుంది' అంటూ జోడో యాత్ర సాగిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌ని ఉద్దేశించి షా వ్యాఖ్యానించారు. 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ఢిల్లీ ఘటనలో మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు

న్యూఢిల్లీ: ఢిల్లీలో అంజలీ సింగ్ అనే యువతిని కారుతో ఢీకొట్టి, లాక్కెళ్లిన ఘటనలో నిందితులను కాపాడేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. సీసీటీవీ ఫుటేజీ, కాల్ రికార్డులను బట్టి అశుతోష్, అంకుశ్ ఖన్నా అనే వారి ఆచూకీ కోసం వెదుకుతున్నారు. నిందితుల్లో ఒకరైన అమిత్ ఖన్నా సోదరుడే అంకుశ్ ఖన్నా. అమిత్ ఖన్నాను ఈ కేసు నుంచి బయట పడేసేందుకు వీరిద్దరూ ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, అంజలికి, నిందితులకు, ప్రత్యక్ష సాక్షులకు పరిచయం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. కంజ్‌హౌలా ఘటనలో నిందితులపై హత్యాభియోగాలు మోపాలంటూ వస్తున్న డిమాండ్లపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. అయితే ముందుగా, వారు ఉద్దేశపూర్వకంగా హత్యకు పాల్పడినట్లు నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసుపై ఏర్పాటైన 18 బృందాలు, అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నాయని స్పెషల్ కమిషనర్ సాగర్ ప్రీత్ చెప్పారు.

విదేశీ ప్రయాణికుల్లో 11 రకాల ఒమిక్రాన్

న్యూఢిల్లీ: చైనాలో కోవిడ్ విజృంభణ నేపథ్యంలో అంతర్జాతీయ సర్వీసుల ద్వారా భారత్‌కు వస్తున్న విమాన, నౌకా ప్రయాణికులకు కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. అయితే డిసెంబర్ 24 నుంచి జనవరి మూడోతేదీ వరకు 19,227 మంది అంతర్జాతీయ ప్రయాణికుల నుంచి సేకరించిన శాంపిళ్లలో 124 శాంపిళ్లు కరోనా పాజిటివ్‌గా ఫలితాలొచ్చాయి. వీటిని జన్యుక్రమ విశ్లేషణకు పంపగా 40 శాంపిళ్ల ఫలితాలొచ్చాయి. వీటిలో 14 శాంపిళ్లలో ఎక్స్‌బీబీ రకం, మరోటి బీఎఫ్ 7.4.1 వేరియంట్ కరోనా వైరస్ బయటపడింది. ఇవి 11 రకాల ఒమిక్రాన్ ఉపవేరియంట్లు అని, భారత్‌లో గతంలోనూ వెలుగుచూశాయని, భయపడాల్సిన పనిలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 24 నుంచి భారత సర్కార్ ప్రతీ అంతర్జాతీయ విమానంలో ర్యాండమ్‌గా 2 శాతం చొప్పున ప్రయాణికులకు ఆర్‌టీ-పీసీఆర్ టెస్ట్ చేస్తోంది. ఈ కాలంలో 124 మందికి పాజిటివ్ వచ్చింది.

ఒకే ఇంట్లో 8 మంది మృతి.. అందరికీ బుల్లెట్ గాయాలు

సాల్ట్‌లేక్ సిటీ: అమెరికాలోని ఉటాహ్ రాష్ట్రం ఈనాక్ పట్టణంలోని ఓ ఇంట్లో ఐదుగురు మైనర్లు సహా మొత్తం 8 మంది బుల్లెట్ గాయాలతో చనిపోయారు. వెల్ఫేర్ చెకింగ్ సందర్భంగా ఈ ఘోరం వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు. వారిని ఎవరు చంపారు? ఎందుకు చంపారు? వంటి వివరాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై సాధారణ ప్రజానీకం ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా వ్యక్తులు కొన్ని రోజులపాటు కనిపించకుండా ఉన్న సందర్భాల్లో పోలీసులు సంబంధిత ఇళ్లలో వెల్ఫేర్ చెక్ చేపడతారు.

జన భాగస్వామ్యంతోనే జల సంరక్షణ

కేవలం ప్రభుత్వ చర్యలే సరిపోవు

- ప్రజల్లో అవగాహన పెంచండి
- నీటి పంపకాలపై రాష్ట్రాలు దృష్టి పెట్టాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- భోపాల్‌లో రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల తొలి జాతీయ సదస్సు



న్యూఢిల్లీ: దేశంలో జల సంరక్షణ విషయంలో కేవలం ప్రభుత్వం తీసుకొనే చర్యలే సరిపోవని, ప్రజలందరి భాగసామ్యంతోనే అది సాధ్యమవుతుందని, ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. జల సంరక్షణ ఉద్యమంతో అనుసంధానమైతేనే ప్రజలకు ఇందులోని తీవ్రత, ప్రాధాన్యం తెలుస్తుందని అన్నారు. కార్యక్రమ ఉద్దేశం అర్థమైతే వారు దాన్ని సొంతం చేసుకుంటారని తెలిపారు. గురువారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించిన రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల తొలి జాతీయ సదస్సును ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, భాగస్వామ్యానికి నీరు ఒక కీలకాంశం కావాలని చెప్పారు. దేశంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో నీటి పంపకాలపై ముందుగానే దృష్టి పెట్టాలని సూచించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల మధ్య నడుమ దశాబ్దాలుగా జల వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'వాటర్ విజన్-2047'

మన రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం జలం అనేది రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. మనం నిర్దేశించుకున్న సమ్మిళిత లక్ష్యాల సాధనకు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే 25 ఏళ్లలో సాగించబోయే 'అమృతకాల' ప్రయాణంలో 'వాటర్ విజన్-2047' అనేది అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎక్కువ శాతం పనులు జల సంరక్షణ దిశగానే జరగాలని చెప్పారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మంత్రులకు సూచించారు. ప్రజలతోపాటు సామాజిక సంస్థలు, పౌర సంస్థలు సైతం జల సంరక్షణ ఉద్యమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం అంటే దాని అర్థం ప్రభుత్వపరంగా పారదర్శకత తగ్గించడం కాదన్నారు. అలాగే మొత్తం బాధ్యతను ప్రజలపై మోపడం కాదని తేల్చిచెప్పారు. జల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడానికి స్థానికంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ప్రతి జిల్లాలో అమృత సరోవరాలు

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లాలో 75 అమృత సరోవరాలు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని నరేంద్ర మోదీ తెలియజేశారు. ఇప్పటికే 25,000 సరోవరాలు నిర్మించినట్లు చెప్పారు. ప్రతి సరోవరం కనీసం ఎకరం వైశాల్యంలో ఉంటుందని, ఇందులో 10,000 క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేయొచ్చని అన్నారు. జల సంరక్షణకు జియో-సెన్సింగ్, జియో-మ్యాపింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు వాడుకోవాలని సూచించారు. టెక్నాలజీ-పరిశ్రమలు-స్టార్టప్‌లను అనుసంధానిస్తే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. నమామి గంగా మిషన్ తరహాలో నదుల ప్రక్షాళనకు రాష్ట్రాలు సైతం నడుం బిగించాలని ప్రధానమంత్రి విన్నవించారు. నదుల, జల వనరులను కాపాడుకోవాలన్నారు. ప్రతి రాష్ట్రంలో చెత్త నిర్మూలన, మురుగునీటి శుద్ధి కోసం నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తాజా నీటిని సంరక్షించుకోవడం, మురుగునీటిని శుద్ధి చేసి మళ్లీ వాడుకోవడం పర్యావరణానికి చాలా మేలు చేస్తుందని వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ అగ్రికల్చర్ ఇరిగేషన్ స్కీమ్' కింద 70 లక్షల హెక్టార్లకుపైగా భూమిని సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకొచ్చామని ప్రధాని మోదీ తెలిపారు.

కాలర్ పట్టుకొని తోశారు

- మేఘన్ విషయంలో ప్రిన్స్ విలియం నాపై చేయిచేసుకున్నారు
- ఆత్మకథ స్పేర్‌లో ప్రిన్స్ హ్యారీ సంచలన విషయాలు



లండన్: భార్య మేఘన్ ప్రేమ కోసం బ్రిటన్ రాచరిక భోగాలనే వదులుకున్న ప్రిన్స్ హ్యారీ త్వరలో విడుదల కానున్న తన ఆటోబయోగ్రఫీ ''స్పేర్'' పుస్తకంలో సంచలన విషయాలు వెల్లడించారు. భార్య మేఘన్ విషయంలో సోదరుడు ప్రిన్స్ విలియం తనపై చేయి చేసుకున్నారని చెప్పారు. 2019లో లండన్‌లో తమ నివాసంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణను తన ఆత్మకథలో వివరంగా రాసుకొచ్చారు. మేఘన్‌కు మద్దతుగా ఉన్నందుకు విలియమ్స్ తన కాలర్ పట్టుకొని కిందకి తోసేశారని, దీంతో తనకు గాయాలయ్యాయని హ్యారీ ఆ పుస్తకంలో రాసినట్టుగా అంతర్జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. అమెరికా నటి మేఘన్ మార్కెల్‌ను ప్రిన్స్ హ్యారీ ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో రాచకుటుంబంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. 'మేఘన్‌కు సభ్యత సంస్కారం లేవని, చాలా కఠినంగా వ్యవహరిస్తుందని విలియం మాటలు తూటాల్లా విసిరారు. దీంతో నేను కూడా విలియంపై అరిచాను. రెచ్చిపోయిన విలియం మెరుపు వేగంతో నా మీదకి వచ్చారు. నా కాలర్ పట్టుకొని తోశారు. నా మెడ గట్టిగా పట్టుకొని నేల మీదకి విసిరికొట్టారు. శునకాలకి ఆహారం పెట్టే ఒక గిన్నెపై నేను వెళ్లి పడ్డాను. దీంతో నా వీపు మీద గాయాలయ్యాయి'' అని రాసుకొచ్చారు. మేఘన్ రాకతో వచ్చిన విభేదాలకు, ఘర్షణలకు సంబంధించి విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ నెల 10న పుస్తకం విడుదల కానుంది. పుస్తకం విడుదలైతే రాచకుటుంబంలో ఈ పుస్తకం ఇంకెన్ని ప్రకంపనలు సృష్టిస్తుందా అన్న అనుమానాలున్నాయి.

మరో విమాన ప్రయాణికుడి అమానవీయ ఘటన

న్యూఢిల్లీ: నవంబర్ 26న విమానంలో వృద్ధ మహిళా ప్రయాణికురాలిపై ఓ తాగుబోతు మూత్ర విసర్జన చేసిన ఘటన మరువకముందే అదే తరహా మరో ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనలో మహిళా ప్రయాణికురాలి బ్లాంకెట్‌పై తాగుబోతు ప్రయాణికుడు మూత్ర విసర్జన చేశాడు. డిసెంబర్ ఆరో తేదీన పారిస్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానం(ఫ్లైట్ నంబర్ 142) మార్గమధ్యంలో ఉండగా ఈ అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. విషయం తెల్సుకున్న విమాన పైలట్ వెంటనే ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయ ఏటీసీకి ఫిర్యాదుచేశారు. విమానం ఉదయం ల్యాండ్‌కాగానే అతడిని కేంద్ర పారిశ్రామిక భద్రతా (సీఐఎస్ఎఫ్)బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అయితే, అతను వెంటనే లిఖితపూర్వకంగా మహిళా ప్రయాణికురాలికి క్షమాపణలు చెప్పడంతో అతడిని వదిలేశారు. ఇద్దరు ప్రయాణికుల మధ్య రాజీ కుదరడంతో ఈ వివాదం అంతటితో ముగిసిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు.



ఇది బ్లూఫిన్ టూనా చేప. బరువు 212 కిలోలు. గురువారం జపాన్ రాజధాని టోక్యోలోని టొయొసు మార్కెట్‌లో జరిగిన ఈ సీజన్ ప్రారంభ వేలంలో రూ.2.25 కోట్లు పలికింది.

విదేశీ వర్సిటీలకు మరింత స్వేచ్ఛ

- భారత్‌లో క్యాంపస్ ఏర్పాటుకు తొలిసారిగా అనుమతి
- ప్రవేశాలు, ఫీజులు, నిధులు స్వదేశానికి తరలింపునకూ ఓకే
- ముసాయిదా నిబంధనలను వెల్లడించిన యూజీసీ



సాక్షి, హైదరాబాద్: విదేశీ విశ్వవిద్యాలయాలకు భారత ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. తొలిసారిగా అవి భారత్‌లో సొంతంగా క్యాంపస్‌లు నెలకొల్పేందుకు, అడ్మిషన్ల విధానం, ఫీజుల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది. నిధులను సొంత దేశాలకు బదిలీచేసేందుకు తదితర నిబంధనలకు సంబంధించిన ముసాయిదా ప్రతిని యూజీసీ విడుదలచేసింది. అయితే ఆ వర్సిటీలో భారతీయ క్యాంపస్‌లలో కోర్సులకు సంబంధించి ప్రత్యక్ష తరగతులను నిర్వహించాలి. ఆన్‌లైన్, దూర విద్యా కోర్సులకు అనుమతి ఇవ్వబోమని యూజీసీ చైర్‌పర్సన్ జగదీశ్ చెప్పారు. విదేశీ వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థ(హెచ్ఈఐ)లు ఇక్కడ క్యాంపస్‌ల ఏర్పాటు అనుమతులను యూజీసీ నుంచి తీసుకోవాలి. సంబంధిత వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాక ఈ నెల చివరికల్లా తుది నిబంధనలను రూపొందిస్తారు. ముసాయిదా ప్రకారం విదేశీ వర్సిటీలు తమ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు, ఫీజులపై స్వీయనియంత్రణ కల్గిఉంటాయి.

నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా..

'నూతన జాతీయ విద్యావిధానంలో పేర్కొన్నట్లు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల స్థాయి విద్యాబోధన భారతీయ విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. విదేశీ వర్సిటీలతో అనువైన ఫీజుల్లోనే అంతర్జాతీయ విద్యార్హతలు మన విద్యార్థులకు దఖలు పడతాయి. వర్సిటీలు స్వదేశానికి పంపే నిధులకు ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్(ఫెమా) చట్టం ,1999 వర్తిస్తుంది. ఇవి తమ వార్షిక ఆడిట్ యూజీసీకి సమర్పిస్తారు' అని జగదీశ్ అన్నారు.

ర్యాంక్‌లు పొందిన వాటికే..

అత్యున్నత ర్యాంక్ పొందిన వర్సిటీలకే భారత్‌లో క్యాంపస్‌ల ఏర్పాటుకు అవకాశమిస్తారు. అంటే ప్రపంచం మొత్తంలో 500 లోపు ర్యాంక్ లేదా సబ్జెక్ట్ వారీగా ర్యాంక్ లేదా స్వదేశంలో దిగ్గజ వర్సిటీలకే భారత్‌లో అవకాశం దక్కనుంది. తర్వాత వాటి దరఖాస్తుల పరిశీలనకు యూజీసీ స్థాయీ సంఘాన్ని ఏర్పాటుచేయనుంది. దేశంలో న్యాక్ గ్రేడ్ పొందిన దేశీ వర్సిటీల సమన్వయంతో ఈ వర్సిటీలు పనిచేసే వీలుంది. దరఖాస్తు చేసిన 45 రోజుల్లో అనుమతులు లభిస్తాయి. కమిషన్ సూచించిన సమయంలో క్యాంపస్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజులు తదితర వివరాలను ప్రవేశాలకు 60 రోజుల ముందే వెల్లడించాలి. సరైన సంస్కరణలతో దేశీయ వర్సిటీలను బలోపేతం చేయాల్సిందిపోయి విదేశీ వర్సిటీలు తేవడం ఏంటని కొందరు విద్యావేత్తలు పెదవివిరిచారు. 'ప్రభుత్వ నూతన విద్యా విధానం ప్రకారం యూజీసీకే చరమగీతం పాడనున్నారు. అలాంటి యూజీసీ నేతృత్వంలో సంస్కరణలు తేవడం ఏంటి ?. గతంలో విదేశీ వర్సిటీల బిల్లును 2012-13 కాలంలో యూపీఏ సర్కార్ తెచ్చేందుకు సిద్ధమైంది. కానీ ఆనాడు దీనిని బీజేపీ, వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రాజ్యసభ స్థాయీ సంఘం కూడా తప్పుబట్టింది. ఇప్పుడు అదే బీజేపీ ఇప్పుడు ఇలా విరుద్ధంగా వ్యవహరిస్తోంది' అని విద్యావేత్త, ఢిల్లీ యూనివర్సిటీ మహిళా ప్రొఫెసర్ అభా దేవ్ అన్నారు.

కేన్సర్‌ను 'కత్తి'లా పసిగట్టేస్తుంది..!

లండన్: బ్రిటన్ శాస్త్రవేత్తలు కొత్తగా అభివృద్ధి చేసిన ఇంటెలిజెంట్ సర్జికల్ నైఫ్ (ఐనైఫ్) గర్భాశయ కేన్సర్‌ను సెకండ్లలో పసిగట్టేస్తోంది. కేన్సర్ చికిత్సలను త్వరితగతిని అందించి ఎందరో మహిళల ప్రాణాలను కాపాడే అవకాశం ఐనైఫ్ ద్వారా వచ్చిందని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో వైద్య నిపుణులు చెప్పారు. సాధారణంగా మహిళల్లో వచ్చే ఎండోమెట్రియల్ కేన్సర్‌ను గుర్తించడం ఆలస్యం అవడం వల్ల దుష్ప్రభావాలు అధికం. అయితే ఈ ఐనైఫ్‌తో సెకండ్లలో కేన్సర్‌ను గుర్తించగలుగుతున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. వివరాలను జర్నల్ కేన్సర్స్‌లో ప్రచురించారు. గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతున్నట్టు అనుమానం ఉన్న 150 మంది మహిళల టిష్యూ శాంపిల్స్‌ను సర్జికల్ కత్తితో పరీక్షిస్తే సెకండ్లలోనే ఫలితాలు వచ్చాయి. ఇప్పటివరకు అనుసరిస్తున్న సాధారణ పద్ధతిలో చేసిన ఫలితాలతో పోల్చి చూస్తే 86% ఫలితాలు సరిగ్గా ఉన్నాయని ఆ అధ్యయనం వివరించింది.

రష్యా కాల్పుల విరమణ

కీవ్: ఉక్రెయిన్‌లో ఈ వారాంతంలో 36 గంటలపాటు కాల్పుల విరమణ పాటించాలని రష్యా అధినేత పుతిన్ తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. ఉక్రెయిన్ భూభాగంలో ఎలాంటి దాడులు చేయొద్దని గురువారం పేర్కొన్నారు. రష్యాలో ఆర్థోడాక్స్ క్రిస్మస్ సెలవు నేపథ్యంలో పుతిన్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ప్రాచీన జూలియన్ క్యాలెండర్ ప్రకారం రష్యన్ ఆర్థోడాక్స్ చర్చి ఆధ్వర్యంలో ప్రతిఏటా జనవరి 7వ తేదీన క్రిస్మస్ వేడుకలు జరుగుతాయి. ఉక్రెయిన్‌లోని కొందరు ఇదే రోజు క్రిస్మస్ జరుపుకుంటారు. కాగా, ఉక్రెయిన్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పుతిన్ పునరుద్ఘాటించారు. కానీ, చర్చలు జరగాలంటే ఒక షరతు విధించారు. ఉక్రెయిన్ నుంచి తాము స్వాధీనం చేసుకున్న భూభాగాలను రష్యాకు చెందిన భూభాగాలుగానే జెలెన్‌స్కీ ప్రభుత్వం అంగీకరించాలని తేల్చిచెప్పారు. ఈ ఒక్క షరతుకు ఒప్పుకుంటే ఉక్రెయిన్‌తో చర్చలకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టంచేశారు. తూర్పు, దక్షిణ ఉక్రెయిన్‌లోని పలు కీలక ప్రాంతాలను రష్యా బలప్రయోగంతో ఆక్రమించుకున్న సంగతి తెలిసిందే. డొనెట్స్క్, లుహాన్స్క్, జపొరిఝూజియా, ఖేర్సన్‌లలో రష్యా సైన్యం పాగా వేసింది.

డిజిటల్ ఇండియా విజన్‌కు సహకరిస్తాం

- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల హామీ
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ

న్యూఢిల్లీ: 'డిజిటల్ ఇండియా విజన్' సాకారం కావడానికి తమ వంతు సహకారం అందిస్తామని మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల హామీ ఇచ్చారు. గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీతో ఆయన సమావేశమయ్యారు. పలు కీలక అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారు. ప్రధాని మోదీతో తన భేటీ చక్కగా జరిగిందని సత్య నాదెళ్ల వెల్లడించారు. డిజిటల్ ఇండియా విజన్ మొత్తం ప్రపంచానికి వెలుగును చూపుతుందని ఉద్ఘాటించారు. తర్వాత మోదీ ట్వీట్ చేశారు. దేశ యువత నూతన ఆలోచనలు భూగోళాన్ని ప్రభావితం చేయగలవని వివరించారు.

డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు

బెంగళూరు: భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నామని నాదెళ్ల తెలిపారు. తమ దారిలోనే ఇతర కంపెనీలు సైతం నడుస్తాయని, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో 'ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ సదస్సు'లో సత్య నాదెళ్ల పాల్గొన్నారు. అనంతరం మీడియాతో భారతదేశ టెక్నాలజీ స్టోరీ విస్తరించడానికి సహకరిస్తామని వ్యాఖ్యానించారు. టెక్నాలజీలో భారత్ అద్భుత విజయాలు సాధిస్తోందని ప్రశంసించారు. ఇది రాయాల్సిన, మాట్లాడుకోవాల్సిన చరిత్ర అని చెప్పారు.

బిర్యానీ.. సౌతిండియా 'టిఫిన్' కాదు: సత్య నాదెళ్ల

ఆధునిక కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే చాట్ రోబో 'చాట్‌జీపీటీ'లో తనకు ఎదురైన అనుభవాన్ని సత్య నాదెళ్ల వివరించారు. దక్షిణ భారతదేశంలో బాగా పేరున్న టిఫిన్ల గురించి తాను అడగ్గా.. ఇడ్లీ, దోశ, వడతోపాటు బిర్యానీ అంటూ చాట్‌జీపీటీ బదులిచ్చిందని అన్నారు. తాను హైదరాబాదీనని, తన పరిజ్ఞానాన్ని తక్కువ అంచనా వేయొద్దని, బిర్యానీ అనేది టిఫిన్ కాదను తాను గట్టిగా చెప్పడంతో చాట్‌జీపీటీ క్షమాపణ కోరిందని వెల్లడించారు.

హెచ్1బీ వీసా ఫీజుల బాదుడు !

కొత్త ప్రతిపాదనలు ముందుకు తెచ్చిన అమెరికా



వాషింగ్టన్: హెచ్-1బీ వీసా దరఖాస్తు సహా అన్ని ఇమిగ్రేషన్ ఫీజుల మోత మోగించేందుకు అమెరికా సిద్ధమైంది. సంబంధిత ప్రతిపాదనలను అమెరికా ఇమిగ్రేషన్ విభాగం ప్రచురించింది. 460 డాలర్లుగా ఉన్న హెచ్-1బీ వీసా దరఖాస్తు ధరను ఏకంగా 780 డాలర్లకు పెంచాలని ప్రతిపాదించారు. వలసేతర వీసాల్లో భారతీయులు అధికంగా పొందే హెచ్-1బీ వీసా దరఖాస్తు ధరను భారీగా పెంచడంపై విమర్శలొస్తున్నాయి. మిగతా ఫీజులూ దాదాపు ఇలాగే భారీగా ఉన్నాయి. ఓ-1 దరఖాస్తు ధర 460 డాలర్ల నుంచి 1,055 డాలర్లకు పెంచనున్నారు. అంటే ఒక్కసారిగా 229 శాతం పెంపు అన్నమాట. ఎల్-1 ధరను 460 డాలర్ల నుంచి ఏకంగా 1,385 డాలర్లకు పెంచేయనున్నారు. అంటే ఏకంగా 332 శాతం పెరుగుదల. హెచ్-2బీ దరఖాస్తుల ధర 460 డాలర్ల నుంచి ఒకేసారి 1,080 డాలర్లకు చేరుకోనుంది. అయితే, ఇవి ప్రతిపాదనలు మాత్రమేనని మార్చి ఏడో తేదీలోపు వచ్చే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ధరలు మారుస్తామని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వివరణ ఇచ్చింది. ఒకవేళ ఈ ఫీజులు అమలైతే అదనంగా తీసుకునే బయోమెట్రిక్ సేవల ఫీజును రద్దుచేస్తామని ప్రతిపాదించింది. 2016 ఏడాది నుంచి ఇప్పటివరకు ఫీజులు పెంచలేదని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వాదిస్తోంది.

వీసా ఎదురుచూపులు తగ్గించేందుకు కృషి

భారత్‌లో వీసా దరఖాస్తు దారులు ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా చేస్తామని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి నెడ్ ప్రైస్ చెప్పారు. సుదీర్ఘ కాలం వీసా కోసం ఎదురుచూస్తున్న వారి ఆందోళనను తాము అర్థం చేసుకుంటామన్నారు. వీసా దరఖాస్తుల పరిశీలనను చకచకా పూర్తి చేసేందుకుగాను విదేశాంగ శాఖ సిబ్బంది పెంచామన్నారు.

టోక్యోకు టాటా..!

- రాజధాని వీడే ప్రజలకి జపాన్ ప్రభుత్వం భారీ తాయిలాలు
- జనాభా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తేనే అభివృద్ధి అంటున్న కిషిదా సర్కార్

రాజధాని పొమ్మంటోంది. తట్టాబుట్టా సర్దుకొని వెళ్లిపొమ్మంటోంది. జన ప్రభంజనం ఒక్కచోటే ఉంటే ఆ ఊరు తట్టుకోవడం కష్టం. అందుకే జపాన్ ప్రభుత్వం టోక్యోకు టాటా చెప్పేవారికి భారీగా తాయిలాలు ఆశ చూపిస్తోంది. జపాన్ రాజధాని టోక్యోకు ఎందుకీ పరిస్థితి వచ్చింది...? డబ్బులిచ్చి మరీ జనాన్ని వెళ్లిపొమ్మని చెప్పడానికి కారణాలేంటి ?

జపాన్ రాజధాని విడిచి పెట్టి వెళ్లిపోవడానికి అక్కడ ప్రభుత్వం భారీ తాయిలాలు ప్రకటించింది. కుటుంబంలోని పిల్లలకి ఒక్కొక్కరికి 10 లక్షల యెన్ అంటే భారత్ కరెన్సీలో రూ. 6 లక్షలు ఇస్తామని ఆశ చూపిస్తోంది. జపాన్‌లో జనాభా దేశవ్యాప్తంగా సమానంగా విస్తరించలేదు. అక్కడ నగరాలు, పట్టణాలు జనంతో కిక్కిరిసిపోతూ ఉంటే గ్రామీణ ప్రాంతాలు, చిన్న పల్లెలు ఖాళీ అయిపోతున్నాయి. టోక్యో, ఒసాకా వంటి నగరాల్లో జనాభా అంతకంతకూ పెరిగిపోతోంది.అందుకే కుటుంబంలో ఒక్కో పిల్లకి 10 లక్షల యెన్‌లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జపాన్‌కు ఇదేమీ కొత్త కాదు. మూడేళ్ల క్రితం కూడా టోక్యోకి టాటా చెప్పండంటూ 3 లక్షల యెన్‌లు ప్రకటించించింది. జనాలెవరూ రాజధాని వీడి వెళ్లడానికి ఇష్టపడ లేదు. దీంతో ఈ సారి ఇన్సెంటివ్‌ను భారీగా పెంచి 10 లక్షల యెన్‌లు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వెళ్లేవారికి ఈ ఇన్సెంటివ్ లభిస్తుంది.



టోక్యో ఉక్కిరిబిక్కిరి

జపాన్‌లో నానాటికి జనాభా తగ్గిపోతోంది. 1973 నుంచి ఆ దేశంలో జననాల రేటు తగ్గుతూ వస్తోంది. 2020-21 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 6,44,000 మంది తగ్గిపోయారు. 2022 సంవత్సరం జనవరి-సెప్టెంబర్ మధ్య జపాన్‌లో కొత్తగా 5,99,636 మంది జన్మించారు. ప్రస్తుతం జపాన్ జనాభా 12.50 కోట్లు కాగా టోక్యో జనాభా 1.5 కోట్లు. దేశంలో మొత్తం జనాభాలో ఇంచుమించు 10శాతం మంది రాజధానిలోనే నివసిస్తున్నారు. ఈ నగరంలో జన సాంద్రత (చదరపు కి.మీ. నివసించేవారి సంఖ్య) 6,158గా ఉంది. జపాన్‌లో జనాభా తగ్గుతూ వస్తూ ఉంటే టోక్యోలో జనాభా గత దశాబ్దంలో 16% పెరిగింది. యువతీ యువకులు ఉపాధి అవకాశాల కోసం రాజధాని బాట పడుతున్నారు. దీంతో ఇసుక వేస్తే రాలనంత జనాభాతో టోక్యో ఊపిరి పీల్చుకోలేకపోతోంది. 2020 నాటికి జపాన్‌లో జనాభాలో 52% మంది మూడు అతి పెద్ద మెట్రోపాలిటన్ ప్రాంతాలైన టోక్యో, ఒసాకో, నగో యాలో నివసిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో 48% మంది ఉన్నారు.2050 నాటికి ఈ మూడు నగరాల్లోనే 57% మంది నివసిస్తారని, మిగిలిన ప్రాంతాల్లో 43% మంది ఉంటారని అంచనాలున్నాయి. దేశ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కార్యకలాపాలన్నింటికీ టోక్యో కేంద్ర బిందువుగా ఉంది. దీంతో ఈ ప్రాంతంలో భూకంపం వచ్చే ముప్పు పెరిగిపోయిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే జనాభా అన్ని ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తాయా ?

దేశంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలంటే జనాభా వికేంద్రీకరణ కూడా జరగాలని జపాన్ అధ్యక్షుడు ఫ్యూమియో కిషిదా భావిస్తున్నారు. అందుకే పల్లెలకు, ఇతర పట్టణాలకు కూడా ప్రజలు వెళ్లి స్థిరపడేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పల్లెల్లో కాలుష్యం లేని జీవనంపై ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేస్తూ జనాన్ని ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తోంది. ప్రతీ ఒక్కరూ రాజధానిలో మకాం ఉంటే జరిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తోంది. పిల్లల సంరక్షణ, విద్య, ఆరోగ్యంతో పాటు నగరాల్లో ఉంటే సదుపాయాలన్నీ పల్లెల్లో కల్పిస్తోంది. ఏ ప్రాంతంలోనైనా జనం ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. కరోనా తర్వాత ఉద్యోగాలన్నీ వర్క్ ఫ్రమ్ హోమ్ ఎక్కువ కావడంతో టోక్యోలో ఉండాల్సిన పని లేదని, ఇతర చోట్లకు వెళ్లాలంది. 2019లో 71 కుటుంబాలు టోక్యోని వీడి వెళితే, 2021లో 1184 కుటుంబాలు ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 2027 నాటికి ఏడాది 10 వేల కుటుంబాలు మకాం మారుస్తాయని అంచనాలు వేస్తోంది.

బీజింగ్‌లో కోవిడ్ బీభత్సం

బీజింగ్: కరోనా చైనాను చిదిమేస్తోంది. బీజింగ్‌లో కోవిడ్ రోగులు వెల్లువలా ఆస్పత్రులకు తరలివస్తున్నారు. నగరంలోని చుయాంగ్‌లియూ ఆస్పత్రిలో పరిస్థితే అక్కడి ఆరోగ్య అత్యవసర పరిస్థితికి దర్పణం పడుతోంది. ఆస్పత్రిలోని బెడ్లు అన్నీ కోవిడ్ వృద్ధ రోగులతో నిండిపోయాయి. అయినా రోగులు వస్తుండటంతో బంధువులు వేచి ఉండే గదుల్లో, కారిడార్‌లలో వైద్యం చేస్తున్నారు. ఉన్న అన్ని వీల్‌చైర్లలో రోగులు కూర్చొనే ఆక్సిజన్ వెంటిలేషన్‌తో శ్వాసిస్తున్నారు. మరింత అత్యవసర వైద్యసేవలు అవసరమైన రోగులకు చికిత్సచేయడంలో వైద్యులు, నర్సులు మునిగిపోయారు. జీరో కోవిడ్ పాలసీతో కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు శతథా ప్రయత్నించి చైనా చేతులెత్తేయడంతో దేశంలో వైద్యారోగ్య పరిస్థితి దయనీయంగా తయారైంది. అత్యవసరమైతే తప్ప సొంతూర్లకు రావొద్దని అక్కడి హునాన్‌ప్రావిన్స్‌లోని షావోయాంగ్ కౌంటీ, అన్‌హుయా ప్రావిన్స్‌లోని షాయూగ్జియాన్ కౌంటీలతోపాటు గన్సు ప్రావిన్స్‌లోని క్వింగ్‌యాంగ్ తదితర నగర పాలనాయంత్రాంగాలు ప్రజలను హెచ్చరించాయి. చైనాలో వైద్య అత్యయిక స్థితిపై వాస్తవిక సమాచారం అందితే ఇతర దేశాలు సరైన విధంగా సమాయత్తం అయ్యేందుకు వీలుంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) అధ్యక్షుడు టెడ్రోస్ బుధవారం హితవుపలికారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం | 6 | జనవరి | 2023



నేత్రపర్వం

కొప్పళ గవిమఠంలో గురువారం రాత్రి స్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించిన దృశ్యం. సిద్ధేశ్వర స్వామి తెప్పలో విహరించారు

న్యూస్‌రీల్

రిపబ్లిక్ డే నాడు వివాహ వేడుక



సచ్చిదానంద స్వామితో నటీనటులు హరిప్రియ, వశిష్ఠ సింహ

మైసూరు: శ్యాండల్‌వుడ్ నటి హరిప్రియా, నటుడు వశిష్ఠ సింహ ఇద్దరు ఈ నెల 26వ గణతంత్ర దినోత్సవం రోజున మైసూరులోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నిరాడంబరంగా పెళ్లి చేసుకోనున్నారు. గురువారం హరిప్రియా, వశిష్ఠ సింహ తమ కుటుంబ సభ్యులతో కలిసి గణపతి సచ్చిదానంద స్వామిని కలిశారు. ఆశ్రమంలో పెళ్లి వేడుకకు స్వామీజీ అనుమతించారు. ఇటీవలే ఈ జంట నిశ్చితార్థం జరగడం తెలిసిందే.

ఎస్ఐ పోస్టుల స్కాంలో 26 మందికి బెయిల్

బనశంకరి: పోలీస్ సబ్‌ఇన్స్‌పెక్టర్ల నియామక పరీక్ష కుంభకోణంలో జైలుపాలైన 26 మందికి గురువారం కలబుర్గి జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కింగ్‌పిన్ కింగ్‌పిన్ దివ్యా హగరగి, మంజునాథ్ మేళకుంది, కాశీనాథ్, డీవైఎస్పీ మల్లికార్జున సాలితో పాటు 26 మందికి బెయిల్ లభించింది. న్యాయమూర్తి కేబీ.పాటిల్ అందరికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో పీఎస్ఐ అక్రమాల కేసులో జైలుకెళ్లిన 36 మందికి బెయిల్ వచ్చేసింది.

తాగుబోతు భర్తకు గుణపాఠం

- చైన్లతో కట్టేసిన భార్య



కట్టివేయబడిన రంగనాథ్

దొడ్డబళ్లాపురం: తాగుడుకి బానిసై నిత్యం వేధిస్తున్న భర్తతో విసిగిపోయిన భార్య అతడ్ని చైన్లతో కట్టేసిన సంఘటన చిత్రదుర్గలోని హొసహళ్లి గ్రామంలో వెలుగు చూసింది. హిరియూరు తాలూకా పర్తికోట గ్రామానికి చెందిన రంగనాథ్‌కు హొసహళ్లికి చెందిన అమృత అనే యువతితో వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన రంగనాథ్ నిత్యం తాగివచ్చి భార్యను హింసించేవాడు. తాగుడు వల్ల అతని ఆరోగ్యం కూడా క్షీణించింది. దీంతో అమృత తన భర్తను ఎలాగైనా కాపాడుకోవాలని కాళ్లకు గొలుసు వేసి తాళం వేసింది. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని అతన్ని బంధ విముక్తున్ని చేశారు. భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా భార్య సాహసాన్ని ఇరుగుపొరుగు అభినందించారు.

రాజ్యాంగం సాక్షిగా మూడుముళ్లు



రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తున్న సోమశేఖర్- పూజ

దొడ్డబళ్లాపురం: పెళ్లి అంటే అనేక సంప్రదాయాలు, మంత్రాలు, చివరగా మూడు ముళ్లు. అయితే ఇవేవీ లేకుండా ఒక జంట అభ్యుదయ రీతిలో ఒక్కటయింది. గదగ్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో సోమశేఖర్, పూజ అనే జంట వినూత్నంగా కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. భారత రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రమాణం చేయడం ద్వారా పెళ్లి చేసుకున్నారు. సామాజిక ఉద్యమ నాయకురాలు కే.నీలా ఈ నవ దంపతుల చేత పెళ్లి ప్రమాణం చేయించారు. వివాహానికి వచ్చిన అతిథులు వచన సాహిత్య పుస్తకాలను బహుమతులుగా ఇచ్చారు. జ్యోతి బాపూలే చిత్రపటానికి పుష్పార్చన చేశారు. ఈ సందర్భంగా బుద్ధుడు, బసవన్న, అంబేడ్కర్ గురించి చెప్పుకున్నారు.

నేటి నుంచి ఎస్సీ మోర్చా భేటీ

మైసూరు: మైసూరులో హోటల్ లలిత మహల్‌లో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు మూడురోజులు బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సమావేశం జరగనుంది. రాష్ట్ర,జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటారని మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి తెలిపారు. పార్టీ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు తెలిపారు.

మొక్కు తీరకుండానే మృత్యుఒడికి

రేణుకా యల్లమ్మా.. నీ దర్శనానికి వస్తున్నామమ్మా అని స్మరిస్తూ పాదయాత్రగా బయల్దేరారు. కానీ మధ్యలో మృత్యుశకటంలా బొలెరో వాహనం వచ్చింది. త్వరగా వెళ్లొచ్చు కదా అని అందులో బయల్దేరారు. విధి చిన్న చూపు చూసింది. యల్లమ్మ దర్శనానికి నోచుకోలేకపోయారు. బొలెరో ప్రమాదంలో ఆరు మంది భక్తులు అసువులు బాశారు. మరెంతో మంది గాయాలపాలయ్యారు. మృతుల్లో ఎక్కువమంది మహిళలే. కుటుంబీకుల శోకాలతో ఆ ప్రాంతం విషాద సంద్రమైంది.

- చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం
- ఆరుగురు భక్తులు మృతి, 16 మందికి గాయాలు
- బెళగావి జిల్లాలో ఘోర సంఘటన

సాక్షి, బెంగళూరు: బెళగావి జిల్లాలో సవదత్తి రేణుకా యల్లమ్మ దర్శనానికి వెళ్తున్న భక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గురువారం తెల్లవారుజామున రామదుర్గ తాలూకా హులకుంద గ్రామంలో ఈ దుర్ఘటన జరగ్గా, ఆరుమంది మరణించారు. మృతుల్లో ఇద్దరు బాలికలు, ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు.



చెట్టును ఢీకొని ధ్వంసమైన బొలెరో వాహనం

బొలెరో ఎక్కిన కొంత సేపటికే

- రామదుర్గ తాలూకా హులకుందకు చెందిన కొందరు భక్తులు తెల్లవారుజామున నడుచుకుంటూ యల్లమ్మ దేవి దేవస్థానికి బయల్దేరారు.
- మార్గమధ్యలో బొలేరో గూడ్స్ వాహనం డ్రైవర్ వాహనం ఆపి సవదత్తిలో వదులుతానని చెప్పడంతో అందరూ ఎక్కారు.
- మొత్తం వాహనంలో 23 మందిని ఎక్కించుకుని డ్రైవర్ బయలుదేరాడు. ఐదు నిమిషాలు ప్రయాణించిందో లేదో రామదుర్గ తాలూకా చుంచనూర వద్ద విఠల్ రుక్మిణి గుడి వద్ద పెద్ద చెట్టుకు గుద్దుకుంది.
- వాహనం ధ్వంసం కాగా అందరూ తలోదిక్కుకు పడిపోయారు. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో మరొకరు మరణించారు.
- హనుమవ్వ మెగాడి (25), దీపా (31), సవిత (12), సుప్రిత (11), మారుతి (43), ఇంద్రవ్వ (28)లను మృతులుగా గుర్తించారు.
- మరో 16 మంది గాయపడగా వారిని గోకాక్, ఇతర్రత్రా ఆస్పత్రులకు తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

మితిమీరిన వేగమే కారణం

అతి వేగం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమైంది. వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అందులో తీసుకుని వెళ్తున్న పెద్ద పెద్ద ఇనుప పైపుల వల్ల ప్రమాద తీవ్ర ఇంకా పెరిగింది. ఇదే మార్గంలో దేవస్థానానికి వెళుతున్న ఇతర వాహనాల ప్రయాణికులు, గ్రామస్తులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. కడకోళ పోలీసులు అంబులెన్స్ ద్వారా గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. సంఘటన స్థలానికి ఎస్పీ సంజీవ పాటిల్ వచ్చి పరిశీలించారు. ప్రమాదంపై సీఎం బసవరాజు బొమ్మై సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాకుల చెరో రూ. 5 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. గాయపడిన వారి చికిత్సకు అవసరమైన ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు.



ఘటనాస్థలిలో మృతదేహాలు



సహాయక చర్యల దృశ్యం

ఫిబ్రవరిలో బెంగళూరు-మైసూరు వేగమార్గం ప్రారంభం



ఎక్స్‌ప్రెస్ వేని పరిశీలించడానికి హెలికాప్టర్లలో వచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

శివాజీనగర: ఎన్నో రోజులుగా ఎదురుస్తున్న బెంగళూరు–మైసూరు మధ్య నిర్మించిన పది లేన్ల ఎక్స్‌ప్రెస్ వేను ఫిబ్రవరి లోకార్పణం చేయనున్నట్లు కేంద్ర భూ ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. గురువారం బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ వే రహదారిని హెలికాప్టర్లో ఏరియల్ సర్వే జరిపిన తరువాత మాట్లాడిన ఆయన, ఈ రహదారిని రాష్ట్రపతి, లేదా ప్రధాని ప్రారంభించనున్నారు. త్వరలోనే తేదీ నిర్ధారిస్తామన్నారు. బెంగళూరు–మైసూరు మధ్య ఈ రహదారిలో కేవలం గంట 10 నిమిషాల్లో గమ్యం చేరుకోవచ్చు. దీని ద్వారా సమయం, మానవశక్తి పొదుపు అవుతుందని అన్నారు. బెంగళూరు ట్రాఫిక్‌ను తగ్గించేందుకు సబర్బన్ రోడ్డు నిర్మించి నగర శివార్లలోని హొసకోట, రామనగర, దొడ్డబళ్లాపుర, దేవనహళ్లి, ఆనేకల్‌లకు అనుసంధానం కల్పిస్తామన్నారు. ఈ రహదారి నిర్మాణానికి మొత్తం రూ.5,100 కోట్లు వ్యయం అయినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంపీ డీకే సురేశ్, మంత్రి అశ్వత్థ నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఓటర్లు.. 5.05 కోట్లు

- మహిళా ఓటర్ల సంఖ్యలో వృద్ధి
- తుది పరిష్కార జాబితా వెల్లడి

శివాజీనగర: రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 5.05 కోట్ల మంది ఉన్నారు. 2023 సంవత్సరపు ఓటర్ల ఫైనల్ పరిష్కార జాబితా విడుదల కాగా, 12.31 లక్షల కొత్త పేర్లను చేర్చారు. గురువారం నగరంలో సమాచార శాఖ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి (సీఈఓ) మనోజ్‌కుమార్ మీనా విలేకరులతో మాట్లాడారు. పరిష్కార సమయంలో 18 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

2.54 కోట్ల పురుషులు, 2.50 కోట్ల స్త్రీలు

- ఓటర్ల తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో 5,05,48,555 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తాజా సవరణల్లో 12,31,540 పేర్లను చేర్చినట్లు, 6,18,965 పేర్లను తొలగించినట్లు తెలిపారు.
- మొత్తం ఓటర్లలో 2,54,03,511 మంది పురుషులు, 2,50,92,726 మంది స్త్రీలు ఉన్నారు, ఇక హిజ్రా ఓటర్లు 4502 మంది ఉండడం విశేషం.
- ఓటర్లలో పురుష, మహిళా నిష్పత్తి 1000–988 గా ఉంది. గతంలో 1000– 983గా ఉండేది. ఈసారి మహిళా ఓటర్ల నిష్పత్తి 5 పాయింట్లు పెరిగింది.



గతం కంటే ఈసారి మహిళా ఓటర్లలో వృద్ధి నమోదైంది

- రాష్ట్రంలో 7 లక్షల మంది యువ ఓటర్లు కొత్తగా చేరారు.
- కేసులు ఉన్నందు వల్ల చిక్కపేటె, శివాజీనగర, మహాదేవపుర ఓటర్ల జాబితాను జనవరి 15న ప్రకటిస్తామని తెలిపారు.
- రాష్ట్రంలో బెంగళూరు దక్షిణ శాసనసభా నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు 6,50,532 మంది ఉండగా, చిక్కమగళూరు జిల్లా శృంగేరి శాసనసభా నియోజకవర్గంలో అత్యల్పంగా 1,66,521 మంది ఓటర్లే ఉన్నారు.

ఎక్కడి నుంచి పోటీ ఇప్పడే చెప్పలేను: సిద్దు

దొడ్డబళ్లాపురం: రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలేది ఇంకా ఆలోచించలేదని, అలాగని తాను వలస నేతను కానని సీఎల్పీ నేత సిద్ధరామయ్య అన్నారు. గురువారం మంగళూరులో కుద్రోళిలోని గోకర్ణ క్షేత్రంలో మీడియాతో మాట్లాడారు. మంగళూరు జిల్లా ఉళ్లాల నియోజకవర్గం నుండి పోటీ చేస్తారనే వార్త పై స్పందించిన ఆయన కోలారు నుండి కూడా పోటీ చేయాలని, బాదామి నుంచి పోటీ చేయాలని అక్కడి పార్టీ కార్యకర్తలు డిమాండు చేస్తున్నారన్నారు. అంతిమంగా హైకమాండ్ నిర్ణయాన్నే గౌరవిస్తానన్నారు. ముఖ్యమంత్రి బొమ్మైని కుక్కపిల్లతో పోల్చలేదని, రాష్ట్రానికి నిధులు తీసుకురావడంతో ముఖ్యమంత్రి విఫలమయయ్యారని మాత్రమే అన్నానన్నారు. లవ్ జిహాద్ గురించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు జోకర్ ను గుర్తు చేస్తున్నాయన్నారు. విధానసౌధలో అక్రమ డబ్బు లభించడంపై స్పందించిన ఆయన ఇలాంటి సంఘటనలు చాలా ఉన్నాయని, అందుకే తాను ఈ ప్రభుత్వాన్ని 40 శాతం కమిషన్ ప్రభుత్వంగా చెబుతున్నానన్నారు.



కన్నడ సమ్మేళనానికి మద్దతుగా గురువారం హావేరిలో విద్యార్థుల ర్యాలీ

మిన్నంటే సాహితీ సంరంభం

- నేటి నుంచి హావేరిలో కన్నడ సాహిత్య సమ్మేళనం

దొడ్డబళ్లాపురం: సాహితీ, సంస్కృతీ చర్చలు, గోష్టులు మూడురోజుల పాటు సాహితీప్రియులకు విందు చేయనున్నాయి. శుక్రవారం నుంచి హావేరిలో అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరగనుంది. 128 ఎకరాల విస్తీర్ణంలో సమ్మేళనం ఏర్పాట్లు చేసారు. కనకదాస కోటను పోలిన 100 అడుగుల పొడవు గల ప్రధాన వేదికను నిర్మించారు. ఈసారి కన్నడ సాహిత్య సమ్మేళనానికి పద్మశ్రీ దొడ్డరంగేగౌడ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రధాన వేదిక ముందు భాగంలో 30 వేలమంది కూర్చునేందుకు కుర్చీలు వేసారు. దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ స్మరణ కార్యక్రమం ఏర్పాటుచేశామని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్ జోషి తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు సమ్మేళనం ఆరంభమవుతుంది. రథాన్ని పోలిన వాహనంలో దొడ్డరంగేగౌడను ఊరేగిస్తారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి బొమ్మై సమ్మేళనాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇక వేలాది మంది వస్తున్నందున అదేస్థాయిలో వంటకాలను సిద్ధం చేశారు. కాగా, సమ్మేళనం విజయవంతం కావాలని హావేరిలో విద్యార్థులు పెద్ద ప్రదర్శన నిర్వహించారు.



సమ్మేళనంలో ప్రధాన వేదిక

శబరిమల నుంచి తిరిగొచ్చిన పావురం !

దొడ్డబళ్లాపురం: సమాచారాన్ని చేరవేసుకోవడానికి ఇప్పుడయితే మొబైళ్లు, ఈ మెయిళ్లు ఉన్నాయి. కొన్నేళ్లక్రితం ఉత్తరాలు, టెలిగ్రాంలు ఉండేవి. అయితే అంతకంటే ముందు మహారాజుల కాలంలో ఇవేవీ ఉండేవి కావు. అందుకే పావురాళ్లను ఉత్తరాలు చేరవేసే పోస్టుమ్యాన్లుగా ఉపయోగించేవారు. కాలం మారినా పావురాళ్ల తెలివిలో తేడా రాలేదు. ఇందుకు చక్కటి ఉదాహరణగా చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా మేగలహట్టి గ్రామంలో జరిగిన ఒక సంఘటన చెప్పుకోవచ్చు. మేళగట్టి గ్రామానికి చెందిన వెంకటేశ్ ఇటీవలే అయ్యప్ప మాల ధరించి అయ్యప్ప దర్శనం చేసుకుని వచ్చాడు. దర్శనం తరువాత తనతో పాటు తీసుకువచ్చిన పావురాన్ని గత డిసెంబరు 30న శబరిమలెలో వదిలేశాడు. ఆశ్చర్యంగా పావురం గురువారం గ్రామాన్ని చేరుకుని యజమాని వెంకటేశ్ ఒడిలో వాలిపోయింది. పెంచిన రుణాన్ని మర్చిపోలేని పావురం ఇలా గ్రామానికి తిరిగి రావడం పట్ల గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



పావురంతో వెంకటేశ్

ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్ఐఏ దర్యాప్తు

- మంగళూరు కుక్కర్ బాంబ్ కేసు...



యశవంతపుర: మంగళూరు నగరంలో జరిగిన కుక్కర్ బాంబ్ పేలుడు కేసులో విచారణను ఎన్ఐఎ వేగవంతం చేసింది. మంగళూరు శివార్లలోని కొనాజె వద్దనున్న పీఎ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం దాడులు నిర్వహించారు. నిందితుడు షారిఖ్ ఇచ్చిన సమాచారం మేరకు కాలేజీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో చాలా ముఖ్యమైన సమాచారం లభించినట్లు తెలిసింది. బాంబు తయారీకి– కాలేజీలోని కొందరికి సంబంధం ఉందని అనుమానాలున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా తనిఖీలు చేసి అనేక ఫైల్స్‌ను సీజ్ చేసినట్లు తెలిసింది.

బాంబు పేలుళ్లకు పాల్పడతామని లేఖ

ఉత్తర కన్నడ జిల్లా సముద్రతీర ప్రాంతంలో బాంబ్‌ను పేల్చుతామంటూ బెదిరింపు లేఖలు భట్కళ పోలీసులకు అందినట్లు తెలిసింది. డిసెంబర్ 17న పోలీసులకు అందాయి. అర్థంకానీ ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఈ లేఖలను రాశారు. భట్కళ, తమిళనాడు పులియంతోఫ్ పోలీసులకు, మరొక లేఖ ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయానికి చేరినట్లు తెలిసింది. చెన్నైకి చెందిన వ్యక్తి ఈ లేఖలను రాసినట్లు భటక్కళ పోలీసులు కనుగొన్నారు. నిందితుడు ధర్మస్థళ, సుళ్య, సుబ్రమణ్య ప్రాంతాలలో తిరిగాడు. సుళ్యకు చెందిన తేజుకుమార్ పేరున సిమ్‌కార్డును కొన్నాడు. నిందితుని కోసం గాలింపు సాగుతోంది.

జాతరలో అంగళ్లపై నిషేధం

దక్షిణకన్నడ జిల్లా సుళ్యలో జాతర్లలో అంగళ్ల గొడవ మళ్లీ మొదలైంది. చెన్నకేశవ దేవస్థానం జాతర సందర్భంగా ఒక వర్గానికి చెందిన వ్యాపారులు అంగళ్లు వేయరాదని ఆయల కమిటీ ప్రకటించింది. ఈ నెల 12 వరకు జాతర మహోత్సవం జరుగనుంది. ఆ వర్గం వారు తప్ప అందరూ వ్యాపారం చేసుకోవచ్చని తెలిపారు.

దిష్టిబొమ్మల ఊరేగింపు



మండ్య: మాజీ సీఎం సిద్దరామయ్య, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం ఇబ్రహీంలు బీజేపీని కించపరిచేలా మాట్లాడారని కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. జేసీ సర్కిల్ వద్దకు చేరుకున్న కార్యకర్తలు వారిద్దరి దిష్టిబొమ్మలకు చెప్పుల దండను వేసి ర్యాలీ సాగించారు. బీజేపీ నాయకుడు హెచ్‌ఆర్ అరవింద్ మాట్లాడుతూ వారిద్దరూ స్థాయిని మరిచి ముఖ్యమంత్రి బొమ్మైని కుక్క అని సంబోధించారని దుయ్యబట్టారు. నిజాయతీ, నమ్మకం అనేవి కుక్క గొప్ప లక్షణాలని, అటువంటివి సిద్దరామయ్యకు లేవని మండి పడ్డారు.

విధానసౌధలోకి రూ.10 లక్షల తరలింపు

- ప్రజాపనుల ఏఈ అరెస్టు

శివాజీనగర: బెంగళూరు విధానసౌధలోకి రూ.10.5 లక్షలు నగదును తరలిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు సౌధ పడమటి ద్వారం గుండా మండ్య జిల్లా ప్రజా పనుల శాఖ ఏఈ జగదీశ్ ఎలాంటి అనుమతి లేకుండా డబ్బును తీసుకెళ్తున్నాడు. గేట్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్లు బయటపడింది. దీనిపై పోలీసులు ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అతన్ని విధానసౌధ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో నగదును విధానసౌధలోకి ఎందుకు తీసుకొని వెళుతున్నారనేది నిర్ధారణ కాలేదు. డబ్బు అతనిదా, లేక ఎవరికైనా ఇవ్వడానికి తరలిస్తున్నాడా.. అనేది విచారణ సాగుతోంది. 2016లో ఇదేమాదిరిగా రూ.2.5 కోట్లు నగదును తరలిస్తున్న కారును విధానసౌధలో పడమటి ద్వారం వద్దే పోలీసులు పట్టుకున్నారు. అలాగే అప్పటి మంత్రి సీ పుట్టరంగశెట్టి కార్యాలయం సిబ్బంది వద్ద రూ.25.76 లక్షలు నగదు బయటపడింది.

దోబీఘాట్లకు ఆధునిక యంత్రాలు

బనశంకరి: రాష్ట్రంలోని అన్ని దోబీఘాట్లలో ఆధునిక యంత్రాలను అమర్చడానికి బడ్జెట్‌లో పథకం ప్రవేశపెడతామని, మడివాళ మాచిదేవ అభివృద్ధి మండలికి అధిక నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై హామీ ఇచ్చారు. గురువారం చిత్రదుర్గలో మాచిదేవ మహాసంస్థాన మఠం 14వ శంకుస్థాపన, బసవమాచిదేవ స్వామీజీ 24వ జంగమదీక్ష, పట్టాభిషేక మహోత్సవంలో బొమ్మై మాట్లాడారు. బెంగళూరు నగరంలో 8 దోబిఘాట్లలో ఆధునిక యంత్రాలను అమర్చామని, వీటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. మడివాళ మఠానికి రూ.3 కోట్లు అందించడం శ్లాఘనీయమని కాగినెలె గురుపీఠం నిరంజనానందపురి స్వామీజీ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సీఎం యడియూరప్ప, సిద్దరామేశ్వరస్వామీజీ, పురుషోత్తమానందపురి స్వామీజీ, ఎమ్మెల్యేలు తిప్పారెడ్డి, కే.పూర్ణిమా, అరుణ్‌పూజార్, ఎం.చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

తుమకూరు నుంచే ఎన్నికల సంగ్రామం

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

తుమకూరు: తుమకూరులో ఉన్న పవిత్రమైన క్షేత్రాలు ఎక్కడా లేవు, ఇక్కడి యడియూరు సిద్ధలింగేశ్వర, గొరవనహళ్లి మహాలక్ష్మి దేవి అమ్మవారి ఆలయం, తుమకూరు సిద్ధగంగా మఠం ఎంతో పవిత్రమైన స్థలాలు అని, ఇక్కడి నుంచే కర్ణాటక ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రధాని మోదీ నిర్ణయించారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. గురువారం తుమకూరు జిల్లాలో ఆయన పర్యటించారు. నగరంలోని సిద్ధ వినాయక సముదాయ భవనంలో బీజేపీ శక్తి కేంద్ర సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

మా రిపోర్టు కార్డు చూపిస్తాం

దేశంలో జాతి, కుటుంబ రాజకీయాలను చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రిపోర్టు కార్డు రాజకీయం ప్రారంభించారన్నారు. కర్ణాటకలో మా రిపోర్టు కార్డు ఎలా ఉంటుందో ఎన్నికల్లో చూపిస్తామని చెప్పారు. కర్ణాటకలో బీజేపి పెద్ద శక్తిగా మారుతుందని, అన్ని మతాలను, కులాలను కలుపుకొని వెళతామన్నారు. కరోనా ఆపత్కాలంలో మనమే మొదట వ్యాక్సిన్‌ను కనిపెట్టామని, అదే కాంగ్రెస్ అధికారంలో ఉంటే వ్యాక్సిన్ వచ్చేదే కాదన్నారు. ఈ సందర్భంగా ఆయన సిద్ధగంగా మఠంలో శివకుమార స్వామి సమాధికి పూజ చేసి సిద్ధలింగస్వామిజీని కలిశారు.


బీజేపీ చీఫ్ జేపీ నడ్డాకు జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం


నివాళి అర్పిస్తున్న జేపీ నడ్డా

అభివృద్ధి పనుల నత్తనడకపై కన్నెర్ర

- గ్రామాల్లో పర్యటించని అధికారులపై మండిపాటు
- మార్చి నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశం

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు చేయకుండా కాలయాపన చేయడంపై జెడ్పీ సీఈఓ శశిధర్ మండిపడ్డారు. గురువారం జెడ్పీ సభాభవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేయాలని జిల్లా స్థాయి అధికారులు స్పందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. 850 అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు, 715 చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో నెలకొన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శశిధర్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేతో భేటీ


పాపారెడ్డితో మాట్లాడుతున్న సుమా గస్తీ

రాయచూరురూరల్: బీజేపీ సీనియర్ నేత, నగర మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డితో మాజీ రాజ్యసభ సభ్యుడు అశోక్ గస్తీ భార్య సుమా గస్తీ భేటీ అయ్యారు. గురువారం నగరంలోని పాపారెడ్డి నివాసంలో ఆమె గంటసేపు చర్చ జరిపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నగరం నుంచి తన పోటీపై పార్టీ అధినాయకత్వంతో చర్చించాలని కోరారు. పార్టీకి తన భర్త చేసిన సేవలను గుర్తించి రాజ్యసభకు ఎంపిక చేశారని, అయితే ఆయన ఆరు నెలలకే కోవిడ్ సోకి మరణించారని గుర్తు చేశారు. ఆయన సేవలను కొనసాగించే సదాశయం కోసం తనకు అవకాశమిచ్చేలా చూడాలని కోరారు.

మహనీయుల ఆదర్శాలను పాటించాలి

గౌరిబిదనూరు: ఉత్తమమైన వ్యక్తిత్వ నిర్మాణానికి రామకృష్ణ పరమహంస, వివేకానందుల ఆదర్శాలను పాటించాలని పొన్నంపేట రామకృష్ణా సేవాశ్రమం భరత్‌రాజ్ తెలిపారు. తాలూకాలోని హాశేహళ్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకై ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రామకృష్ణ, వివేకానందుల వారి ఆలోచనలు, మార్గదర్శకాలను ఆయన వివరించారు. బాలలకు వివేకానందుల బోధనల పుస్తకాలను వితరణ చేశారు. సాహితీవేత్త హెచ్ఎన్ కిరణ్‌కుమార్, ప్రతిమ, జిఎస్ గంగాధరప్ప పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట


పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయచూరురూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తామని గ్రామీణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం దిన్నిలో అంబేడ్కర్ విగ్రహానికి గ్రామీణ కాంగ్రెస్ కార్యకర్త, ఎమ్మెల్యే టికెట్ ఆకాంక్షి అభ్యర్థి చంద్రశేఖర్ నాయక్ పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. ఈ ఏడాది మే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ టికెట్‌ను స్థానిక అభ్యర్థులకు ఇవ్వాలని హైకమాండ్‌ను కోరామన్నారు. గత 20 ఏళ్ల నుంచి స్థానికేతర అభ్యర్థులకు అవకాశం ఇచ్చినా అభివృద్ధి పనులు చేపట్టకుండా తమ స్వార్థం చూసుకున్నారన్నారు. ప్రాణేష్ నాయక్, శివరాజ్, శాంతమూర్తి, శంషుద్దీన్, శేఖర్ నాయక్, చెన్నకేశవులు, శివలున్నారు.

బొమ్మనహళ్లి కాంగ్రెస్ టికెట్ నాదే


బ్రౌచర్‌ను ప్రదర్శిస్తున్న కవితారెడ్డి, ఆమె మద్దతుదారులు

బొమ్మనహళ్లి: వచ్చే ఎన్నికల్లో బొమ్మనహళ్లి నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ తనకేనని, కేపీసీసీ అధ్యక్షుడు డి.కే.శివకుమార్ అనుమతి ఇచ్చారని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి కవితారెడ్డి అన్నారు. గురువారం హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో ఉన్న కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 2018లోనే తాను ఇక్కడి నుంచి టికెట్‌ను కోరానని, కానీ చివరి క్షణంలో డీ.కే.శివకుమార్ సూచన వల్ల తప్పుకున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డిపై పోరాటాలు చేసి ఎదురుదెబ్బలు కూడా తిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, స్కారియా జాన్ పాల్గొన్నారు.

పోలీసు శునకం రామ్ కన్నుమూత


రామ్(ఫైల్)

దొడ్డబళ్లాపురం: రామనగర జిల్లా పోలీసులకు 250 పైగా క్రిమినల్ కేసులు ఛేదించడానికి సహకరించిన పోలీస్ శునకం రామ్ గుండెపోటుతో మృతిచెందింది. 2017లో జిల్లా పోలీస్ శాఖలో చేరిన రామ్ 6 ఏళ్లపాటు సేవలందించింది. జిల్లా పోలీసులు డీఏఆర్ మైదానంలో ప్రభుత్వ గౌరవ లాంఛనాలతో రామ్‌కు అంత్యక్రియలు నిర్వహించారు.

వాల్మీకి గురుపీఠానికి 100 క్వింటాళ్ల బియ్యం అందజేత

గంగావతి రూరల్: రాజనహళ్లి మహర్షి వాల్మీకి గురుపీఠంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నిర్వహించే 5వ వాల్మీకి జాతర దాసోహానికి 100 క్వింటాళ్ల బియ్యాన్ని బుధవారం నగరంలోని వాల్మీకి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి పాల్గొని గురుపీఠాధిపతి ప్రసన్నానందపురి స్వామీజీకి అందించారు. ఈ సందర్భంగా వాల్మీకి సముదాయ నాయకులు ఆయనను సన్మానించారు. తాలూకా వాల్మీకి సంఘం అధ్యక్షులు వీరభద్రప్ప నాయక, కృష్ణప్ప నాయక, నగరసభ ప్రాధికార మాజీ అధ్యక్షులు మల్లేశప్ప నాయక, జోగద నారాయణప్ప నాయక, నగరసభ సభ్యులు చౌడికి రమేష్, అర్జున్ నాయక, పంపణ్ణ నాయక, రామణ్ణ నాయక పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గాలి' ముమ్మర ప్రచారం


గ్రామస్తులతో మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: తాలూకాలోని క్యాంపుల్లో గాలి జనార్దన్ రెడ్డి ముమ్మర ప్రచారం చేపట్టారు. ఆయన గురువారం జంగమరకల్లుడి గ్రామానికి ఉదయాన్నే వెళ్లి రామాలయాన్ని సందర్శించారు. ఆలయం బయట గుమిగూడిన క్యాంప్ వాసులతో ముచ్చటించి అక్కడి నుంచి గౌరేబాళకు వెళ్లారు. గ్రామంలోని అంబాభవాని మఠానికి, చెన్నబసవతాత మఠానికి వెళ్లి దర్శనం చేసుకొన్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తమ పార్టీ విధివిధానాల గురించి వివరించి వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. గౌరేబాళ నుంచి ఫీడర్ క్యాంప్, సత్యవతి క్యాంప్, రంగాపుర క్యాంపులకు వెళ్లి అక్కడ సమావేశాలు జరిపి తన రాజకీయ పునః ప్రవేశం, ఏర్పాటు చేసిన కొత్త పార్టీ గురించి వివరించారు. త్వరలో తమ పార్టీ ఎన్నికల ప్రణాళికను విడుదల చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ

సాక్షి,బళ్లారి: అయ్యప్ప స్వామి మండల పూజను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. గురువారం నగరంలోని రేడియోపార్కులోని కార్పొరేటర్ గోవిందరాజులు ఇంట్లో పూజను వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించారు. గత 30 ఏళ్ల నుంచి అయ్యప్ప మాల ధరించి తమ ఇంట్లో పూజను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్.సురేష్‌బాబు, మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌గోపాల్, పలువురు నగర కార్పొరేటర్లు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాల ధరించిన భక్తులను ప్రతి ఒక్కరిని ఘనంగా సన్మానించారు.


పూజలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

ఆటల పోటీలు ప్రారంభం

బొమ్మనహళ్లి: విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు కె.నరేష్ అన్నారు. గురువారం బొమ్మనహళ్లి కూడ్లులో చిన్మయా విద్యాసంస్థల క్రీడా వార్షికోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆటల్లో రాణించాలంటే ప్రోత్సాహంతో పాటు కఠిన శ్రమ కూడా అవసరమని అన్నారు. కే.వాసుదేవ, అమరావతి, రంజిత్ .ఎస్.వి. సౌమ్యా పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ క్రీడాకారుడిని సత్కరిస్తున్న దృశ్యం

నేటి నుంచి భవన నిర్మాణ పరికరాల ప్రదర్శన

బళ్లారి రూరల్ : బళ్లారి అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ అండ్ ఆర్కిటెక్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నగరంలోని కమ్మభవన్‌లో భవన నిర్మాణ పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ గౌరవాధ్యక్షుడు సంజీవప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రదర్శనలో 55 కంపెనీలు పాల్గొంటాయని, ఆధునిక భవన నిర్మాణ సామగ్రిని ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శనను జిల్లాధికారి పవన్ కుమార్ ప్రారంభిస్తారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సి.శ్రీనివాసరావు, వక్తగా చెన్నైకి చెందిన వి.శేషాద్రి పాల్గొంటారన్నారు. మూడు రోజుల పాటు సాగే ఈ ప్రదర్శన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. సుమారు 20 వేల మంది ప్రజలు పాల్గొంటారని, 8వ తేదీన 5 కి.మీ.పొడవున మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఈశ్వరగౌడ, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

మైసూరు: మైసూరు నగరంలోని బోగాదిలో ఉన్న ఎస్‌బీఎం లేఔట్‌లో ముడా ఉద్యానవనంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వెలసిన కట్టడాన్ని అధికారులు కూల్చి వేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. పార్కులోపల నాలుగైదు మంది కలిసి ఎవరి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా భవనాన్ని నిర్మించారు. స్థానికులు ముడా కమిషనర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పరిశీలించి కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో గురువారం కట్టడాన్ని పడగొట్టారు.

దళిత సీఎంను బీజేపీ ఎందుకు ప్రకటించదు?

సాక్షి,బళ్లారి: ఎస్సీ, ఎస్టీలకు బీజేపీ చేసిందేమీ లేదని కేపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి డా.పరమేశ్వర్ పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని రాయల్ ఫోర్ట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు తాము ఇచ్చిన బడ్జెట్‌లో సగం కూడా బీజేపీ ఇవ్వలేకపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు చేసిన మేలు మరే పార్టీ చేయడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తే దళితులకు సీఎం కుర్చీ ఇస్తామని ఎందుకు ప్రకటన చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వస్తే సీఎల్‌పీ అభిప్రాయం తీసుకుని సీఎం పేరు ప్రకటిస్తారన్నారు.మాజీ మంత్రులు మహాదేవప్ప, తుకారాం, శివరాజ తంగడిగి, ఎమ్మెల్యేలు నాగేంద్ర, గణేష్, పరమేశ్వర నాయక్, భీమానాయక్, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, మేయర్ ఎం.రాజేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

హొసపేటె: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని మాజీ డీసీఎం డాక్టర్ జి.పరమేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ ఐక్యతా మొందస్తు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు సిరాజ్ షేక్, చంద్రప్ప, డీసీసీ రూరల్ అధ్యక్షులు బీవీ.శివయోగి, రాజశేఖర్ హిట్నాల్ పాల్గొన్నారు.

కలబుర్గి డీఐజీగా అనుపమ్ అగర్వాల్



రాయచూరురూరల్: కలబుర్గి డీఐజీగా అనుపమ్ అగర్వాల్ బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఐజీగా విధులు నిర్వహించిన మనీషా ఖర్బిక్ ఏడీజీపీగా పదోన్నతి పొందారు. ఆ స్థానంలో 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అనుపమ్ అగర్వాల్ నియమితులయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పెరిగిన చలి పులి

- ఉదయం 7 గంటలైనా బయటకు రాని జనం


ఓపీడీ బస్టాండ్ వద్ద చలి కాచుకొంటున్న దృశ్యం

బళ్లారి రూరల్ : జిల్లాలో చలితీవ్రత పెరుగుతోంది. పగటిపూట ఎండ కాసినా రాత్రిపూట చలి ఉంటోంది. గతవారం రోజులుగా చలి కొద్దికొద్దిగా తీవ్రమవుతోంది. గురువారం తెల్లవారు జామున అత్యల్పంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా పగటిపూట 29 డిగ్రీలుగా నమోదైంది. దీనికి తోడు రాత్రి పూట మంచు కమ్ముకుంటోంది. తెల్లవారు జామున చలి తీవ్రతను తట్టుకోలేక నగరవాసులు చలి మంటలు వేసుకొంటున్నారు. చలికి భయపడి ఉదయం 7 గంటలైనా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ముందు ముందు అత్యల్పంగా 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ సూచిస్తోంది.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం పంపిణీ


బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: హేమగుడ్డ గ్రామంలో ఇటీవల మృతి చెందిన హనుమంత నాయక్ నివాసానికి వెళ్లి వారి కుటుంబానికి ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందించాల్సి సౌకర్యాలను కల్పించి అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీ నేత చెన్నప్ప మళిగి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.


ప్రమాద బీమా చెక్ అందజేత

కంప్లి: డ్రైవర్లు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ పొందేందుకు ఆసక్తి చూపాలని హొసపేటె యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ విభాగీయ వ్యవస్థాపకులు కే.సంజీవ్ కుమార్ తెలిపారు. ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెంది డ్రైవర్ పర్నికి ద్రాక్షాయణి కంపెనీ శాఖ కార్యాలయంలో రూ.15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా చెక్‌ను ఆయన అందించారు. అనంతరం మాట్లాడుతూ కుటుంబ సభ్యుల భద్రతకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని పొందాలన్నారు. కంపెనీ లెక్కాధికారి బీ.భార్గవ్, శాఖ ఇన్‌చార్జి టీ.ప్రభాకర్, ప్రతినిధి పాండురంగప్ప, ప్రముఖులు టీ.విజయకుమార్, న్యాయవాది విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల దూషణ.. ఇద్దరి అరెస్ట్

హొసపేటె: స్థానిక మల్లిగె హోటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బళ్లారి, విజయనగర జిల్లా కాంగ్రెస్ టికెట్ ఆశావహుల సమావేశంలో ఇద్దరు మహిళల మధ్య జరిగిన గొడవకు సంబంధించి ఇద్దరిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు..ఈ నెల 3న మల్లిగె హోటల్‌లో ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు, కేపీసీసీ కార్యదర్శి ఈశ్వరఖండ్రే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళ్యాణ కర్ణాటక సంఘం కార్యదర్శి శిల్పాను హొసపేటె బ్లాక్ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు యోగలక్ష్మీతో పాటు సందీప్ అవాచ్య శబ్దాలతో కులం పేరుతో దూషించిన విషయంపై శిల్ప టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు యోగలక్ష్మీతో పాటు సందీప్‌ను బంధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినులకు ప్రత్యేక కళాశాలలు భేష్


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్ తదితరులు

కంప్లి: విద్యార్థినులకు ప్రత్యేక కళాశాలలు ప్రారంభించడం శ్లాఘనీయమని ఎమ్మెల్యే జేఎన్.గణేష్ తెలిపారు. ఆయన గురువారం మహావిద్యాలయ ఆవరణలో విద్యార్థినులకు నూతన కళా, వాణిజ్య మహిళా డిగ్రీ మహావిద్యాలయం, మదర్ థెరిసా కామర్స్, బీఏ డిగ్రీ, పీయూసీ కళాశాలలను నిర్మించి ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో వీవీఎస్ఎన్ ట్రస్ట్ అధ్యక్షురాలు రాజమ్మ, తహసీల్దార్ గౌసియాబేగం, ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు నాగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు కళాకారులు, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

కంప్లి: విభజిత బళ్లారి, విజయనగర జిల్లాల్లో ఎక్కువగా ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ క్షేత్రాలకు గాను హొసపేటె, బళ్లారి నగర అసెంబ్లీ క్షేత్రాల్లో అధిష్ఠానం ముస్లిం అభ్యర్థులకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని మున్సిపల్ కౌన్సిలర్ కేఎస్.చాంద్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అతిథి గృహంలో 19వ వార్డు మాజీ మున్సిపల్ అధ్యక్షురాలు హుస్సేన్ బీ కుమారుడు అక్కి జిలాన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ముస్లిం సమాజం నిర్వర్తిస్తున్న పాత్ర మహత్తరమన్నారు. అందువల్ల ముస్లిం సమాజం వారికి కాంగ్రెస్ టికెట్ అందిస్తే ఐకమత్యంగా గెలిపిస్తామన్నారు. ఒక వేళ తమ సమాజానికి టికెట్ ఇవ్వకుంటే ముందు ముందు తమ తీర్మానం వేరుగా ఉంటుందన్నారు. అనంతరం యువ ప్రముఖుడు అక్కి జిలాన్ మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ముస్లిం ముస్లిం సమాజం వారికే టికెట్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ లడ్డు హొన్నూర్‌వలీ, ప్రముఖులు అబ్దుల్ వాహిద్, ఎం.మెహమూద్, టీ.జాఫర్ సాదిఖ్, ఎం.మస్తాన్ ఖాజా, రియాజ్ బీ.నబి, ఎస్.యూనిస్, రియాజ్ బాషా, ఫయాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ చాంద్‌బాషా

కోలారు వార్తలు...

వడ్డీలేని రుణాల పరిమితిని పెంచుతాం

- ఎమ్మెల్యే రమేష్‌కుమార్

శ్రీనివాసపురం : ప్రస్తుతం స్త్రీశక్తి సంఘాల సభ్యులకు డీసీసీ బ్యాంకు నుంచి తలా రూ.50 వేల వరకు అందిస్తున్న వడ్డీ లేని రుణాల పరిమితిని భవిష్యత్తులో రూ.లక్షకు పెంచుతామని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని మారుతి సభాంగణంలో పట్టు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 73 స్త్రీశక్తి సంఘాలకు రూ.3.60 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మహిళలు తీసుకున్న రుణాలతో పిల్లల విద్యాభ్యాసం, కుటుంబ ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. మధ్యవర్తుల బెడద లేకుండా అర్హులైన ప్రతివారికి నేరుగా పార్టీల కతీతంగా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. బ్యాంకు డైరెక్టర్ వెంకటరెడ్డి, టీపీ మాజీ అధ్యక్షుడు ఎస్ వి సుధాకర్, సంజయ్‌రెడ్డి, అయ్యప్ప, శబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


రుణ మంజూరు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌కుమార్

కార్మికులకు వంచన

కోలారు : కార్మిక శాఖ అధికారులు కట్టడ కార్మికులకు, వారి పిల్లలకు, కుటుంబాలకు ఇవ్వాల్సిన సౌకర్యాలను అందించకుండా వంచన చేస్తున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘాల సమన్వయ సమితి కార్యాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 1.20 లక్షల మంది కార్మికులు శాఖలో నమోదు చేసుకున్నా వారి కుటుంబాలకు కార్మిక శాఖ నుంచి సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. అందువల్లే పోరుబాట పట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కె ఎస్ బాబు, ఉపాధ్యక్షుడు బి గోవిందప్ప, కార్మిక సంఘాల పదాధికారులు ప్రభాకర్, పర్వీన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

మహిళా సబలీకరణకు శ్రమించండి

కోలారు : ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారుల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సబలీకరణకు శ్రమించాలని అధికారులకు పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ఉమా మహదేవన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సభాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అన్ని శాఖల ప్రగతి పరిశీలన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాల్లో మహిళా లబ్ధిదారుల సంఖ్యను పెంచాలని, ఇందుకు అధికారుల సహకారం అవసరమన్నారు. జిల్లాలో మార్చి నెలాఖరులోగా 100 శాతం అభివృద్ధిని సాధించాలన్నారు. జిల్లాలోని కోలారు, ముళబాగిలు, మాలూరు తాలూకాల్లో కొత్తగా శిశుపాలనా కేంద్రాల స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కట్టడాలకు అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో సీఈఓ యుకేష్, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ స్నేహ తదితరులు పాల్గొన్నారు.

10న బృహత్ నిరసన

కోలారు : న్యాయమూర్తి సదాశివ కమిషన్ నివేదికపై రహస్యంగా కేంద్రానికి సిఫార్సు చేయాలని చూస్తున్న ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఈ నెల 10న బెంగళూరులోని ఫ్రీడం పార్కులో నిర్వహించే బృహత్ నిరసనను జయప్రదం చేయాలని చిత్రదుర్గ ఇమ్మడి మఠం సిద్దరామేశ్వర స్వామీజీ పిలుపునిచ్చారు. గురువారం నగరంలో పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అశాస్త్రీయ అంశాలతో కూడిన సదాశివ కమిషన్ నివేదికను ప్రజల ముందు ఉంచి చర్చించకుండా ఏకపక్షంగా కేంద్రానికి సమర్పించడంలో అర్థం లేదన్నారు. దీనిని ఖండిస్తూ బెంగళూరులో నిరసనకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఇద్దరు చొప్పున ఆందోళనకు తరలి రావాలన్నారు. జెడ్పీ మాజీ అధ్యక్షురాలు మంగమ్మ మునిస్వామి, భోవి ప్రముఖుడు ఎల్ జి మునిరాజు, ఎస్ వి లోకేష్, వరదేనహళ్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : క్రీడలు శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని అరాబికొత్తనూరు పంచాయతీ అధ్యక్షుడు రాజణ్ణ తెలిపారు. గురువారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేడు గ్రామీణ క్రీడలు కనుమరుగు అవుతున్నాయి. గ్రామీణ ప్రాంత యువకులు కూడా మొబైల్‌కు బానిసలు అవుతున్నారు. దీనిని తప్పించడానికి గ్రామీణ క్రీడా పోటీలను విరివిగా నిర్వహించాలన్నారు. యువత మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జీపీ అభివృద్ధి అధికారిణి శాలిని, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రేరకల నియామకానికి వినతి


జెడ్పీ సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మాలూరు : జిల్లాలోని జీపీ లోకశిక్షణా కేంద్రాల్లో పనిచేస్తున్న సాక్షరతా ప్రేరకలు, సంయోజకులను ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సి, డి గ్రూపు పోస్టులలో నియమించాలని డిమాండ్ చేస్తూ జిల్లా లోకశిక్షణా సాక్షరతా ప్రేరకలు జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గురువారం నగరంలోని జెడ్పీ ప్రాంగణంలో సాక్షరతా ప్రేరకలు తమ డిమాండ్లను నెరవేర్చాలని ఒత్తిడి చేశారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆర్ ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రేరకల సాక్షరతా కార్యక్రమాలతో ఎంతోమంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు చౌడప్ప, ఉపాధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి వసంతమ్మ, కోశాధికారి రామచంద్రప్ప, శుభా, సమన్వయ సంచాలకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధికారంలోకి వస్తే 10 కిలోల బియ్యం ఉచితం



తుమకూరు: వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 10 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తామని. నీటి పారుదల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి కోట్లు కేటాయిస్తామని మాజీ సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. గురువారం తుమకూరు జిల్లాలోని తురువెకెరె పట్టణంలోని గురుభవనం ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కేపీసీసీ అధ్యక్షుడు డి.కే.శివకుమార్‌తో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ...రాష్ట్రంలో పేదలు, వెనుకబడిన వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్రాన్ని అవినీతి నుంచి కాపాడుకుంటామని. డీకే శివకుమార్‌తో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వస్తామన్నారు.

ధార్మిక కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆలయాన్ని శుభ్రపరుస్తున్న అయ్యప్ప స్వాములు

గౌరిబిదనూరు: నగరంలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో వున్న కరిమారియమ్మ దేవాలయాన్ని గురువారం సాయంత్రం అయ్యప్ప స్వాములు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాజం సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మంజునాథ్ మాట్లాడుతూ... దేవుని భక్తితో పాటు దేవాలయాల ఆవరణలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీపీ వేణుగోపాలస్వామి, నారాయణస్వామి, పవన్ స్వామి, నరేశ్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ



కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హోసకోటె పరిధిలోని వెంకటాపుర గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ గురువారం భూమిపూజ చేశారు. స్థానిక నాయకులతో పాటు అధికారులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీలో యువకుడి మృతి

బనశంకరి: పోలీస్ కస్టడీలో ఉన్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం కాటన్‌పేటె పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు...వినోద్ (23) అనే వ్యక్తిని కాటన్‌పేటె పోలీసులు 2017లో నమోదైన కేసులో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ ఉంది. గురువారం కోర్టు హాజరుపరచడానికి ఏర్పాట్లు చేస్తుండగా స్టేషన్‌లోనే మృతి చెందాడు. అతని మృతికి కారణాలు తెలియడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

25 వేల కొబ్బరి కాయలు దగ్ధం



తుమకూరు: తుమకూరు జిల్లా తావరెకెరె సమీపంలో నిల్వ ఉంచిన 25 వేల కొబ్బరి కాయలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. స్థానికంగా ఉంటున్న గంగాధరయ్య అనే వ్యక్తికి చెందిన స్థలంలో కొబ్బరి కాయలు నిల్వ ఉంచారు. వాటికి ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో మొత్తం కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు మొత్తం సరుకు కాలిపోయింది. దాదాపు రూ. 4 లక్షలు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధ్యక్షురాలిగా సుగుణమ్మ

బాగేపల్లి: బాగేపల్లి తాలూకా దేవరగుడిపల్లి కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు గురువారం ఉత్కంఠంగా సాగాయి. బీజేపీ మద్దతుదారులు విజయం సాధించారు. వివరాలు...మొత్తం 12 మంది ఉన్న సంఘంలో వెంకటశివారెడ్డి ప్యానెల్‌కు చెందిన సుగుణమ్మ అధ్యక్షురాలిగా, ఉపాధ్యక్షుడిగా డీఎస్ జయరాం నామినేషన్ దాఖలు చేశారు. మరో ప్యానెల్ నుంచి అధ్యక్షుడిగా నారాయణ స్వామి, ఉపాధ్యక్ష స్థానానికి లక్ష్మీ నరసమ్మ పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఓటింగ్‌లో సుగుణమ్మ, జయరాం ఇద్దరు చెరో ఏడు ఓట్లను సాధించారు. దీంతో అధ్యక్షురాలిగా సుగుణమ్మ, ఉపాధ్యక్షుడిగా జయరామ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇదిలా ఉంటే ఎన్నికపై స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వాన్ని నడిరోడ్డుపై అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు.

వేడుకగా జాతర మహోత్సవాలు



హోమ పూజల్లో కమిటీ అధ్యక్షుడు బసవరాజ్, ఈఓ తదితరులు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, నైవేద్యాలు

- నేడు బనశంకరీదేవి రథోత్సవం

బనశంకరి: బనశంకరీదేవి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పుష్య శుద్ద చతుర్దశి గురువారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. యాగశాలలో ఆలయ అర్చకులు బృందం నవచండికా హోమం చేపట్టి మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. నవచండికా హోమం సందర్భంగా దుర్గాదేవి ఆకృతి గీశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బృందం దేవస్థాన అభివృద్ధి సమితి అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, కమిటీ సభ్యులు, ఈఓ కే.పద్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం..

బనశంకరీదేవి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 12.50 నుంచి 1.30 శుభ మేష లగ్నంలో రథోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు శాకంబరీదేవి దూళోత్సవం, 6 గంటలకు శాకంబరీదేవికి ముత్యాల పల్లకీ ఉత్సవం జరుగుతుంది.

ఆన్‌లైన్‌లో రూ. 23 లక్షలు స్వాహా

బనశంకరి: ఐటీ సిటీలో సైబర్ కేటుగాళ్లు పెట్రేగిపోతున్నారు. తాజాగా ఇద్దరు యువతులు రూ. 23 లక్షలు మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు... నగరానికి చెందిన బాధిత యువతి దమ్మలూరు వాసి. ఈమె వాట్సాప్, టెలిగ్రామ్‌లో లింక్ వచ్చింది. లింక్‌పై క్లిక్ చేయగానే ఆమెజాన్ యాప్ ఓపెన్ అయింది. కొనుగోలు, విక్రయం స్కీమ్ ఇది ఇందులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని సందేశం ఉంది. దీంతో ఆమె డిసెంబర్ 21 నుంచి 29 వరకు దశల వారీగా రూ. 9.49 లక్షలు పెట్టుబడి పెట్టింది. దీనికి కొద్దిమేర లాభం ఇచ్చి నమ్మించారు. పెట్టుబడులు కొనసాగించాలని సూచించారు. ఇలా మొత్తం రూ. 20.48 లక్షలు పెట్టుబడి పెట్టింది. ఈసారి లాభాలు రాలేదు. దీంతో ఫోన్‌లో ప్రయత్నించగా సాధ్యం కాలేదు. చివరికి మోసపోయినట్లు గుర్తించి తూర్పు సీఈఎన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే విధంగా మరో కేసులో ఓ మహిళ ఇలానే మోసోయింది. ఆన్‌లైన్ రూ. 2.34 లక్షలు పెట్టుబడి పెట్టింది. లాభాలు చూపకపోవడంతో బాధితురాలు పలుమార్లు ఫోన్లు చేసినా స్పందన లేదు. దీంతో మోసపోయానని గుర్తించి సీఈఎన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

జక్కసంద్ర వరకు రూ. 40 కోట్లతో అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్లి: సెంట్రల్ సిల్క్‌బోర్డు నుంచి హెచ్ఎస్ఆర్ లేఔట్ మీదుగా జక్కసంద్ర వరకు అభివృద్ధి పనులు చేపడుతామని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తెలిపారు. గురువారం సిల్క్‌బోర్డు సమీపంలోని హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో 7వ సెక్టార్‌లో వద్ద రూ. 40 కోట్లతో రాజ కాలువ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అగర చెరువు నుంచి జక్కసంద్ర వరకు ఉన్న రాజ కాలువను మరింత వెడల్పు చేయడంతో పాటు ఇరువైపుల ఫుట్‌పాత్‌ను అభివృద్ధి చేసి పాదచారులకు అనుకూలం చేస్తామన్నారు. ప్రస్తుతం సెంట్రల్ సిల్క్‌బోర్డు నుంచి కృష్ణరాజపురం వరకు జరుగుతున్న నమ్మ మెట్రో పనులు శర వేగంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బీ.ఎం. రమేష్, బొమ్మనహళ్లి బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, విజయలక్ష్మి ఆనంద్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

అడవి కుక్కలకు చిక్కి.. పులికి ఆహారంగా మారి

- వైరల్‌గా మారిన పర్యాటకుల వీడియో

మైసూరు: మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా కబిని వెనక ఉన్న నాగరహోళె అటవీ ప్రాంతానికి గురువారం ఉదయం సఫారీని చూడటానికి పర్యాటకులు వెళ్లారు. వారంతా ఉత్కంఠగా అడవిని పరిశీలిస్తుండగా అడవి కుక్కలు ఓ జింక పిల్లను వేటాడుతూ రోడ్డుపైకి వచ్చాయి. ఇదే సమయంలో ఓ చిరుత వాయు వేగంతో పొదల్లో నుంచి వచ్చి జింక పిల్లను నోట కరుచుకునిపోయింది. వీడియో తీస్తున్న పర్యాటకులు ఒక్కసారిగా హడలిపోయారు. వీడియోను వారు సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సావర్కర్ ఫొటో ?

బనశంకరి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సావర్కర్ ఫొటో పెట్టే యత్నాలు జరుగుతున్నాయి. దీనిపై విద్యాశాఖ మంత్రి బీసీ నాగేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో దేశభక్తుల ఫొటోలు పెడితే తప్పేముందని వాఖ్యానించారు. ఈ క్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వీర సావర్కర్ ఫొటో పెట్టాలని తీర్మానించినట్లు సమాచారం. ఈ విషయంపై ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించే అవకాశం ఉంది.

మాట తప్పిన సీఎం

- అధికార బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడ ధ్వజం

యశవంతపుర: పంచమసాలి సముదాయానికి 2డిలో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం బొమ్మై నేటికి ఎలాంటి సమాధానం చెప్పలేదని అధికార బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడ పాటీల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీఎం మాట వినడంతోనే తమ పంచమసాలి సముదాయానికి అన్యాయం జరిగిందని అసహనం వ్యక్తం చేశారు. బసవరాజ బొమ్మై సీఎం అయినప్పటి నుంచి తప్పుదోవ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. పంచమసాలి సముదాయానికి రిజర్వేషన్లు కల్పిస్తామని తల్లిపై ప్రమాణం చేసి మాట తప్పారని మండిపడ్డారు. 24 గంటల్లో రిజర్వేషన్లపై ప్రకటన రాకపోతే సీఎం క్షేత్రం శిగ్గాం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తామని హెచ్చరించారు.

మైసూరు రోడ్డుకు దేవెగౌడ పేరు పెట్టాలి

యశవంతపుర: మైసూరు-బెంగళూరు దశపథ రోడ్డుకు మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ పేరును పెట్టాలని ఎమ్మెల్సీ టి శరవణ డిమాండ్ చేశారు. హైవే రోడ్డును విమానంలో సమీక్షంచటానికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి విజ్ఞప్తి చేశారు. రైతు బిడ్డ దేవెగౌడ పేరును అభిమానంతో పెట్టాలని కోరారు.

కేఎస్ ఆర్టీసీ బస్సు దగ్ధం

యశవంతపుర: బెళగావి సమీపంలోని హత్తరకి టోల్‌గేట్ వద్ద కేఎస్ఆర్‌టీసీ బస్సులో మంటలు ఏర్పడి నడిరోడ్డుపై పూర్తిగా కాలిపోయింది. సంకేశ్వర డిపోకు చెందిన బస్సు బెళగావి వెళ్తుండగా జాతీయ రహదారి 4 హత్తరకి వద్ద అకస్మాతుగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన ఆపేసి ప్రయాణికులను దించేశాడు. కొన్ని క్షణాల్లోనే అన్ని వైపుల నుంచి మంటలు వ్యాపించాయి. యమకనమరడి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఏ-జట్టు



ట్రోఫీతో విజేత జట్టు

మండ్య: సమర్థనం దివ్యాంగుల సంస్థ, రాష్ట్ర అంధుల క్రికెట్ మండలి ఆధ్వర్యంలో మండ్య నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో కర్ణాటక- ఎ జట్టు చాంపియన్‌గా నిలిచింది. సి జట్టు రన్నరప్‌గా నిలచింది. పీఈటీ క్రీడా మైదానంలో మూడురోజులు టోర్నీ సాగింది. విజేతలకు జిల్లా జడ్జి ఎంఎ నళిని కుమారి బహుమతులను అందజేశారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొన్న ట్రక్కు

మైసూరు: వేగంగా వచ్చిన ట్రక్ అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బసరకట్టె వద్ద చోటు చేసుకుంది. కేరళ నుంచి బెంగళూరు నగరానికి ఐరన్‌షీట్లను తీసుకుని వేగంగా వస్తున్న ట్రక్ అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో డ్రైవర్ చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. బిళకెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రిటైర్డు ఉద్యోగులకు సన్మానం



క్రిష్ణగిరి: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ రిటైరైన ఉద్యోగులకు సూళగిరి యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు గురువారం సన్మానించారు. సూళగిరి బీడీవో కార్యాలయంలో గ్రామ సంక్షేమ శాఖాధికారిగా పనిచేస్తూ రిటైరైన కమలమ్మ, మధ్యాహ్న భోజన ఉద్యోగులు పద్మ, పాపణ్ణలకు వీడ్కోలు సమావేశం జరిగింది. లావణ్యమధు ముగ్గురిని ఘనంగా సన్మానించారు.

వజ్ర బస్ చార్జీలు పెంపు

శివాజీనగర: కొత్త ఏడాది సిలికాన్ సిటీ బస్ ప్రయాణికులకు మహానగర రవాణా సంస్థ భారీ షాక్ ఇచ్చింది. బీఎంటీసీ వజ్ర బస్ చార్జీలను భారీగా పెంచేశారు. మహానగర రవాణా సంస్థ ఆర్థిక హిత దృష్టితో జనవరి ఒకటి నుంచి ఏసీ బస్సు రోజు, నెల పాస్‌ల చార్జీ పెంచారు. ఈ నేపథ్యంలో ఈనెల 5 నుంచి దూర ప్రయాణికుల చార్జీల కూడా పెరిగే అవకాశం ఉంది. బీఎంటీసీ వజ్ర బస్ చార్జీ 20 కి.మీ కంటే దూరం ప్రయాణం చార్జీ పెరిగే అవకాశముంది. 20 కి.మీ. వయో వృద్ధుల ప్రయాణానికి ఇంతకు ముందు రూ.45 ఉండేది. గురువారం నుండి రూ. 55లు అయ్యింది. రోజు తిరిగే ప్రయాణికులకు ఇది పెనుభారంగా మారనుంది.

నలుగురు దొంగలు అరెస్ట్

బనశంకరి: తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురిని గురువారం కోణణకుంటె పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.15.95 లక్షల విలువైన బంగారు నగలు, కారు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆనేకల్ తాలూకా చందాపుర సూర్యసిటీ నివాసి గణేశ్, చిక్కబాణవార లోహిత్, గంగొండనహళ్లి షేక్‌సల్మాన్, షేక్ ఇస్మాయిల్‌గా గుర్తించారు. కొణణకుంటే పరిధిలో నివాసం ఉంటున్న దినేశ్ అనే వ్యక్తి గతనెల 14న కుటుంబ సమేతంగా చెన్నై వెళ్లారు. 17 తిరిగి రాగా ఇంటిలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేసి నలుగురు దొంగలను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

హోసూరు వార్తలు..

బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు

హోసూరు: ఇంటి నుంచి బయటకెళ్లిన తన కూతురుని ఓ యువకుడు కిడ్నాప్ చేశాడని ఆమె తండ్రి ఊత్తంగేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని హనుమతీర్థం గ్రామానికి చెందిన 17 ఏళ్ల అమ్మాయి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ధర్మపురి జిల్లా కోటంబట్టి గ్రామానికి చెందిన రాజేష్ కన్నా (21) కిడ్నాప్ చేసినట్లు పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

ఇసుక లారీలు స్వాధీనం..

బుధవారం రాత్రి తహసీల్దార్ గవాస్కర్, అధికారులు సీతారామ్‌మేడు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న పలు లారీలను అడ్డుకొని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పచ్చకొలనులో పడి మహిళ మృతి

హోసూరు: హోసూరు తేరుపేటలోని పచ్చకొలనులపడి మహిళ మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు ఆవలపల్లి రోడ్డులోని మునిదేవినగర్‌కు చెందిన వెంకటాచలం భార్య విజయ (40) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చింది. బుధవారం సాయంత్రం తేరుపేటలోని పచ్చకొళను వద్ద గట్టుపై కూర్చొని ఉండగా జారి కొలనులో పడింది. విషయం గమనించిన స్థానికులు వెంటనే ఆమెను బయటకు తీసి చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందింది. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

కొబ్బరి రైతుల్ని ప్రోత్సహించాలి



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: రాష్ట్రంలో కొబ్బరి రైతులను ప్రోత్సహించాలని, అలాగే రేషన్‌కార్డు దారులకు కొబ్బరిని సరఫరా చేయాలని గురువారం హోసూరు పట్టణంలోని రామ్‌నగర్ అన్నావిగ్రహం వద్ద బీజేపీ వ్యవసాయ విభాగం నాయకులు ఆందోళన చేశారు. నేతలు ఎం. నాగరాజ్, నరసింహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల హెక్టార్ల లో కొబ్బరి సాగు చేస్తున్నారని, ప్రభుత్వం రైతుల నుంచి కొబ్బరిని కొనుగోలు చేసి కార్డుదారులకు అందజేయాలని కోరారు.

కిడ్నాప్ కథ సుఖాంతం

యశవంతపుర: సినీ ఫక్కీలో అపహరణకు గురైన బాలుడిని కలబురిగి పోలీసులు రక్షించారు. కలబురిగి వర్సిటీ స్టేషన్ సీఐ అరుణ్‌కుమార్ మురగుడి సింగం స్టైల్‌లో బాలుడిని రక్షించారు. వివరాలు.. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో పట్టణంలోని సిద్ధేశ్వర కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గురునాథ్ రాథోడ్ కుమారుడు సుదర్శన్ (10)ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. రోజు మాదరిలో బుధవారం ఉదయం సుదర్శన్‌లో ఆటోలో పాఠశాలకు బయలుదేరారు. మార్గం మధ్యలో నిందితులు సుదర్శన్‌ను అపహరించి గురునాథ్‌కు గంట తరువాత ఫోన్ చేశారు. మీ కొడుకు బతకాలంటే రూ. 10 లక్షలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులకు చెబితే సుదర్శన్‌ను చంపేస్తామని బెదిరించారు. ఇదే విషయాన్ని గురునాథ్ వర్సిటీ పోలీసులకు విషయం చెప్పాడు. సీఐ అరుణ్‌కుమార్ ఒక బృందాన్ని ఏర్పాటు చేసి బాలుడి కోసం గాలింపు చేపట్టారు. పోలీసులు గాలిస్తున్నట్లు తెలుసుకున్న కిడ్నాపర్లు సాయంత్రం నాలుగు గంటలకు కలబురిగి తాలూకా పాళ గ్రామం వద్ద సుదర్శన్‌ను వదలిపెట్టి పరారయ్యారు. బాలుడిని రక్షించిన పోలీసులు నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

ఆలయానికి స్థలం ఇవ్వలేదని గ్రామ బహిష్కరణ



బహిష్కరణకు గురైన మజనప్ప కుటుంబం

యశవంతపుర: ఆలయానికి స్థలం ఇవ్వలేదనే కారణంతో ఓ కుటుంబాన్ని ఐదేళ్ల క్రితం గ్రామం నుంచి బహిష్కరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కారవార జిల్లా హళియాళ సమీపంలోని నీరలగికి చెందిన యల్లారి మజనప్పకు ఎకరా భూమి ఉంది. 2017లో కొంత భూమిని ఆలయానికి ఇవ్వాలని గ్రామస్తులు ఒత్తిడి చేశారు. ఆయన నిరాకరించారు. తనకు ఇదే జీవనాధారమని చెప్పినా గ్రామస్తులు వినలేదని, పెద్దల మాటను ధిక్కరించినందుకు మజనప్ప, ఆయన భార్య యళవ్వ, కొడుకులు మహేశ్, మంజునాథ్‌ను గ్రామం నుంచి బహిష్కరించారు. ఇంతవరకు ఈ విషయం పోలీసుల దృష్టికి రాలేదు. కేసు నమోదు కాలేదని తెలిసింది.

సున్నా వడ్డీకి రుణాలివ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజేంద్ర

మైసూరు: మైసూరు, చామరాజనగర జిల్లాలకు చెందిన రైతులకు 2023-24వ ఏడాదికి సున్నా వడ్డీలకు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ రాజేంద్ర అన్నారు. గురువారం కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ... అన్ని ధరలు పెరిగిన దృష్ట్యా రైతులను రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు.

ఎక్కువ మార్కులు సాధిస్తే ఇల్లు బహుమానం

మైసూరు: ఈ ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమానంగా ఇంటిని నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే ఎస్.ఎ.రామదాసు అన్నారు. గురువారం విద్యాశాఖ, దక్షిణ విభాగం విద్యాశాఖ అధికారులు, కేఆర్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు బాగా చదువుకోవాలని, ఎక్కువ మార్కులు సాధించిన వారికి ఇల్లు బహుమానంగా ఇస్తామన్నారు.

పాడిరంగాన్ని పాడు చేయొద్దు

బనశంకరి: కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్) ను ఇతర సంస్థల్లో విలీనం చేయాలనుకోవడం ఎంత మాత్రం తగదని, దీని వల్ల రాష్ట్రంలో పాడి రైతుల జీవితం దుర్భరంగా మారుతుందని బమూల్ మాజీ అధ్యక్షుడు ఆర్‌కే రమేశ్ అన్నారు. నగరంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 15 పాల సమాఖ్యలు ఉండగా, 26 లక్షల మంది రైతులు పాడిరంగంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యావంతులు ఉద్యోగాలు లేక పాడిరంగం ద్వారా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. రైతులకు లీటరు పాలకు రూ.29 ఇచ్చి, ప్రజలకు రూ. 45కు అమ్ముతున్నారని అన్నారు. ఈ లాభంలో కొంత రైతులకు పంచాలని, అలాగే పాల ధరను తగ్గించాలని కోరారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండ పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద బెంగళూరు హైవే-44లో బైక్ రేస్‌లు నిర్వహించిన వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాబయ్య దర్గా ఉరుసు సందర్భంగా గురువారం పలు ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చారు. పలువురు యువకులు బైక్‌లతో రేస్ నిర్వహించారు. వారిలో ఒక బైక్ అదుపు తప్పి కిందపడగా కర్ణాటక రాష్ట్రం శిడ్లఘట్టకు చెందిన సల్మాన్, దావూద్ అనే యువకులు గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉరుసులో ఇలా యువకుల ఆగడాల వల్ల ఇబ్బందులు తలెత్తున్నాయని పలువురు భక్తులు వాపోయారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వందనాకార్గ్

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి నియోజకవర్గంలో గరువారం అదనపు కలెక్టర్ వందనా కార్గ్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న ప్రధాన మంత్రి అవాజ్ యోజన పథక పనులు, ఆదిద్రావిడ గృహవసతి, ప్లేవర్ బ్లాక్ అమర్చే పనులు, చెత్త విభజన కేంద్ర పనులు, మురికి నీటి కాల్వల ఏర్పాటు తదితర వాటిని పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట బీడీవో విమల్ రవికుమార్, పంచాయతీ అధ్యక్షులు, ఇంజనీర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మీద ఏనుగుల హల్‌చల్



రోడ్డును దాటుకుని వెళ్తున్న ఏనుగుల గుంపు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో ఏనుగుల మంద రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కర్ణాటకలోని బన్నేరుగట్ట అటవీ ప్రాంతం నుంచి జవుళగిరి అటవీ ప్రాంతానికి చేరుకొన్న ఏనుగుల మంద గుంపులు గుంంపులుగా విడిపోయి జవుళగిరి, డెంకణీకోట, నగనూరు, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు తదితర అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. డెంకణీకోట అటవీ ప్రాంతంలో మకాం వేసిన 70 ఏనుగుల మంద గురువారం ఉదయం డెంకణీకోట-అంచెట్టి రోడ్డుపైకి రావడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు అటవీశాఖాధికార్లకు సమాచారం అందించారు. అటవీశాఖ సిబ్బంది చేరుకొని ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించారు.

సోమేశ్వరునికి ప్రదోష పూజలు



విశేష అలంకరణతో శ్రీసోమేశ్వరస్వామి మూలవిరాట్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ రామ్‌నగర్‌లో వెలసిన ప్రసిద్ధ శ్రీ స్వర్ణాంబిక సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రదోష పూజలు నిర్వహించారు. సోమేశ్వరస్వామి మూలవిరాట్‌ను పాలు, పెరుగు, వెన్న, కొబ్బరి నీటితో అభిషేకించారు. అనంతరం పసుపు, పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. హోసూరు, చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.

చాక్‌పీస్‌పై సిద్ధేశ్వర స్వామీజీ



గౌరిబిదనూరు: ఇటీవల కన్నుమూసిన విజయపురకు చెందిన సిద్దేశ్వర స్వామీజీ ముఖాకృతిని చాక్‌పీస్‌పై సృజనాత్మకంగా రూపుదిద్దాడు సూక్ష్మకళలో ప్రావీణ్యం సాధించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సచిన్ సంఘె. తాలూకాలోని ముదగెరె గ్రామానికి చెందిన సచిన్ సూక్ష్మకళలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. తాజాగా మూడుగంటల పాటు చాక్‌పీస్‌పై సిద్దేశ్వరస్వామిని చెక్కి నివాళులర్పించారు.


చిత్తూరు జిల్లా పెనుమూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, మంత్రి నారాయణ స్వామి


తిరుపతి జిల్లా పుత్తూరులో కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ఆర్కే రోజా


విజయవాడలోని లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, నేతలు


ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా మనుబోలులో దివ్యాంగుడికి పింఛను సొమ్ము అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పామర్రులో లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ


అనంతపురం జిల్లా శెట్టూరులో నూతన లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్


పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో కొత్తగా మంజూరైన పెన్షన్లు అందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు




గుంటూరు కేవీపీ కాలనీలో ముత్యాలమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు స్వర్ణలత


విజయవాడ బ్రహ్మంగారిమఠం ప్రాంతానికి చెందిన ఎ.సువర్ణమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ పావని

క్లుప్తంగా...

జగన్ మరో 30 ఏళ్లు సీఎంగా ఉండాలి..

- పింఛన్ రావడంపై టీడీపీ మండల మాజీ అధ్యక్షుడి ఆనందం


రత్నయ్యకు కొత్త పింఛన్ అందిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

పెళ్లకూరు(తిరుపతి జిల్లా): పార్టీలకు అతీతంగా పారదర్శకమైన పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మరో 30 ఏళ్ల పాటు కొనసాగాలని పెళ్లకూరు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బత్తిన రత్నయ్యనాయుడు ఆకాంక్షించారు. ఆయన 1985లో టీడీపీ పెళ్లకూరు మండల అధ్యక్షుడిగా పని చేశారు. ఇటీవల స్వగ్రామానికి చేరుకుని ఇంటి వద్ద ఉంటున్నారు. గ్రామ వలంటీర్, సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి పలకరించడంతో ఆయన తన వయస్సు 70 ఏళ్లు అని చెప్పడం, దానికి సంబంధించిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వెంటనే కొత్తగా పింఛన్ మంజూరైంది. పెళ్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బత్తిన రత్నయ్య నాయుడు కూడా పింఛన్ అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సీఎం జగన్ పారదర్శకమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు.

బాబు వ్యాఖ్యలు దారుణం

- ఆయనపై చర్యలు తీసుకోండి
- సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు


వాసిరెడ్డి పద్మకు వినతిపత్రం అందిస్తున్న మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

సాక్షి, అమరావతి: మహిళా పోలీసులు వస్తే తలుపులు వేసేయాలని, వారు ఇంటింటికి తిరిగి భార్యభర్తల అక్రమ సంబంధాలపై సర్వే చేస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు దారుణంగా అవమానించారని గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తంచేసింది. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. 40 ఏళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకునే వ్యక్తి.. ఈ విధంగా మహిళలను కించపరచడం దారుణమని పేర్కొంది. చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని గురువారం మంగళగిరిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.మహాలక్ష్మి, జనరల్ సెక్రటరీ డి.మధులత, గుంటూరు జిల్లా అధ్యక్షురాలు ఎంవీఎస్ దుర్గా, గౌసియా బేగం, గీత తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై మహిళా కమిషన్ తగిన చర్యలు తీసుకుంటుందని వాసిరెడ్డి పద్మ చెప్పారు.

కొనసాగుతున్న బాబు షో

- కుప్పంలో కార్యకర్తలకు పరామర్శ పేరుతో డ్రామా
- అప్పటికప్పుడు చేతులకు కట్లతో ప్రైవేట్ ఆస్పత్రిలో కార్యకర్తలు
- బాబు వెళ్లగానే కట్లు విప్పేసి, ఇళ్లకు వెళ్లిపోయిన వైనం

ఒక షో ఫ్లాప్ అయితే.. మరో షో.. అది పోతే ఇంకొకటి.. అన్నట్లు ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. పట్టు తప్పుతున్న కుప్పంలో నిలదొక్కుకునేందుకు సరికొత్త 'షో'లకు తెరతీస్తున్నారు. ప్రభుత్వ జీవో, 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘిస్తూ కుప్పంలో రోడ్ షో పేరిట బుధవారం బాబు చేసిన రాద్ధాంతం అందరికీ తెలిసిందే. అయితే వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదన్నట్టుగా ఆయన రోడ్లపై చేసిన హైడ్రామా కూడా బెడిసికొట్టింది. అయినాసరే గురువారం మరో షోకు తెరతీశారు. బుధవారం పోలీసుల లాఠీచార్జిలో తమ కార్యకర్తలు గాయపడ్డారంటూ వారిని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పారు. అంతే.. కుప్పంలోని కేసీ ఆస్పత్రిలో అందుకు వేదిక సిద్ధమైపోయింది. కొందరు టీడీపీ కార్యకర్తలు అప్పటికప్పుడు ఆస్పత్రికి వచ్చి అక్కడ మంచాలపై కూర్చున్నారు. వారి చేతులకు ఎలాంటి బ్యాండేజ్ కట్లూ లేవు. కులాసాగానే కబుర్లు చెప్పుకున్నారు. చంద్రబాబు కాసేపట్లో వస్తారనగా వారి చేతులకు హఠాత్తుగా బ్యాండేజ్ కట్లు కట్టారు. సాయంత్రం 6.45 గంటలకు చంద్రబాబు ఆ ఆస్పత్రికి చేరుకున్నారు. చేతికి కట్లతో మంచాలపై ఉన్న కార్యకర్తలను పరామర్శించారు. ఇక తన వెంట తీసుకువచ్చిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జీ చేశారని, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుతామని ఊగిపోయారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. చంద్రబాబు అలా వెళ్లారో... లేదో... ఆస్పత్రిలో కట్లతో ఉన్న కార్యకర్తలు తమ చేతులకు ఉన్న బ్యాండేజ్ కట్లు తీసివేసి, ఇళ్లకు వెళ్లిపోయారు. ఆస్పత్రి సిబ్బంది, అక్కడ ఉన్న వారు ఇదంతా నవ్వుతూ చూస్తూండిపోయారు.

– సాక్షి, అమరావతి


సీన్ 1: చంద్రబాబు రాక కోసం ఆసుపత్రి బెడ్‌లపై ఎదురుచూస్తున్న టీడీపీ కార్యకర్తలు




సీన్ 2: యాక్షన్ షురూ!.. బాబు వచ్చారు.. పరామర్శ డ్రామా మొదలైంది


సీన్ 3: బాబు వెళ్లిపోయారు. కార్యకర్తలు కూడా జంప్. 'షో' ముగిసింది. బయట బాబు మాత్రం.. తమ కార్యకర్తలను ఇంతలా గాయపరుస్తారా.. అంటూ పోలీసులపై ఆవేశంతో ఊగిపోయారు.

కొత్త జీవోపై ప్రజా పోరాటం

- ప్రజలకు ఇబ్బందులు కలిగించే జీవోలను ఎదుర్కొంటాం
- ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీ కంటే దారుణం
- చంద్రబాబు మండిపాటు

సాక్షి, చిత్తూరు/కుప్పం: ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 1 నల్ల చట్టమని, దానిని ప్రజాపోరాటం ద్వారానే సమర్థవంతంగా ఎదుర్కొంటామని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం ఆయన కుప్పంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద, సాయంత్రం కార్యకర్తలతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కందుకూరు, గుంటూరు ఘటనలు ప్రభుత్వ కుట్రలో భాగమే అని ఆరోపించారు. తనను బయట తిరగనీయకుండా చేయడం కోసమే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి నల్ల చట్టాల ద్వారానే గతంలో ఎన్టీఆర్‌ను సీఎం పదవి నుంచి డిస్మిస్ చేశారని, ఆ సమయంలో ప్రజా పోరాటం ద్వారానే తిరిగి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్నారని చెప్పారు.

ఉద్దేశ పూర్వకంగా అనుమతుల నిరాకరణ

'పోలీసులు ఉద్దేశ పూర్వకంగానే కుప్పంలో అనుమతులు ఇవ్వలేదు. పైగా మాపై అక్రమ కేసులు పెట్టడం దారుణం. చైతన్య రథాన్ని (ప్రచార రథం) పోలీస్‌స్టేషన్‌లో ఎందుకు పెట్టారు? డ్రైవర్‌ను ఎందుకు తిట్టి, బెదిరించారు? ఇది ఉన్మాద రాజ్యమా? సైకో రాజ్యమా? ఎమర్జెన్సీ పరిస్థితుల కంటే దారుణంగా ఉంది. పోలీసు వ్యవస్థలో కొందరు ఓవరాక్షన్ చేస్తున్నారు. చిత్తూరు జిల్లా ఎస్పీ శాంతి భద్రతలను కాపాడడానికి వచ్చారా? లేక తెలుగుదేశం పార్టీపై కేసులు పెట్టడానికే వచ్చారా? అక్రమ కేసులు బనాయిస్తే మేము కూడా ప్రైవేట్ కేసులతో బోనెక్కిస్తాం. 40 ఏళ్లల్లో ఎవరూ నాపై కేసులు పెట్టలేదు. ఈ జగన్ రెడ్డి కేసులు పెట్టడమే పరమావధిగా పెట్టుకున్నారు. అసెంబ్లీ కౌరవసభలా కాకుండా గౌరవసభగా మారినప్పుడే నేను తిరిగి అక్కడ అడుగు పెడతా.

పెద్దిరెడ్డీ.. ఖబడ్దార్

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డీ ఖబడ్దార్.. ఏం తమాషాలు చేస్తున్నావా.. కుప్పంను రౌడీరాజ్యం చేస్తున్నావు. రౌడీలను అణచివేస్తాం. పుంగనూరు, తంబళ్లపల్లెలోనూ తడాఖా చూపిస్తాం. నేను తలచుకుని ఉంటే ఆ 14 ఏళ్లు నువ్వు స్వేచ్ఛగా బయట తిరిగేవాడివా? ఇది బిగినింగ్ మాత్రమే. బట్టలు విప్పించే రోజులు వస్తాయి. మైనింగ్ పేరుతో నీకు కప్పం కట్టాలా? కంపెనీలపై కోట్లాది రూపాయలు ఫైన్లు వేసి, తర్వాత బెదిరించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం' అని చంద్రబాబు మండిపడ్డారు.

కేసులకు భయపడొద్దు..

పోలీసులు బుధవారం తన ప్రచార రథాన్ని స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ గురువారం చంద్రబాబు ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి సుమారు 300 మీటర్ల దూరంలోని ఎంఎం కల్యాణ మండపానికి నడిచి వెళ్లారు. రామకుప్పం, గుడుపల్లి, శాంతిపురం, కుప్పం, కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని క్లస్టర్ల కార్యకర్తలు, నేతలతో విడివిడిగా సమావేశమై దిశా నిర్దేశం చేశారు. 'కేసులకు భయపడొద్దు.. వాటికి భయపడితే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు.. రానున్నది మన ప్రభుత్వమే.. వడ్డీతో చెల్లిస్తాం..' అని చెప్పారు.

అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా టీడీపీ నిరసన

శ్రీరంగరాజపురం: టీడీపీ నాయకులు పబ్లిసిటీ కోసం, చంద్రబాబు మెప్పు కోసం గురువారం నిరసన పేరుతో చిత్తూరు జిల్లా శ్రీ రంగరాజపురం మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. వాహనంలో ఓ వ్యక్తి ప్రాణాపాయస్థితిలో ఉన్నారని.. దారి వదలాలని సిబ్బంది, స్థానికులు ఎంత ప్రాధేయపడినా టీడీపీ నాయకులు వినిపించుకోలేదు.

ఎస్పీ, డీఎస్పీపై చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి : చిత్తూరు జిల్లా ఎస్పీ, పలమనేరు డీఎస్పీలు కుప్పంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చంద్రబాబు డీజీపీకి లేఖ రాశారు. తన పర్యటనకు ప్రత్యామ్నాయ ప్రదేశం చూపడంలో విఫలమయ్యారని చెప్పారు.

కుప్పంకి ప్రత్యేక చట్టాలుండవు బాబూ

- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: కుప్పం తన సొంత నియోజకవర్గమని, ఇక్కడి నుంచి ఏడు సార్లు గెలిచానంటూ పోలీసులపై చంద్రబాబు రుబాబు చేయడంపై వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి విస్మయం వ్యక్తంచేశారు. ఈ మేరకు తాడేపల్లిలో గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్ షోలు పెట్టవద్దని కుప్పంలో పోలీసులు సలహా ఇచ్చినప్పుడు, చంద్రబాబు వారిపై దురుసుగా ప్రవర్తించడాన్ని మీడియా ద్వారా రాష్ట్ర ప్రజలు చూశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఒకచోట నుంచి ఎన్నికైనప్పుడు అది తన సొంత స్థానం.. ఇక్కడ నుంచి అసెంబ్లీకి చాలాసార్లు ఎన్నికయ్యా? కుప్పంలో అంతా నా ఇష్టం? కుప్పంలో నేనే రాజు, నేనే మంత్రి అన్నట్లు మాట్లాడటం ఎంత వరకు సబబని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా, 13 ఏళ్లకు పైగా ప్రతిపక్ష నేతగా పనిచేసిన చంద్రబాబేనా ఇలా ప్రవర్తిస్తోంది అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అమలులో ఉన్న చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా ఎవరైనా నడుచుకోవాల్సిందేనని ఆయన స్పష్టంచేశారు. పోలీసు అధికారులు ఇలాంటి విషయాలు ఓ మాజీ సీఎంకి, సీనియర్ నేతకు చెప్పాల్సి రావడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఎంత గొప్ప రాజకీయ నాయకుడికైనా తాను పుట్టి, పెరిగిన సొంతూరులో గానీ, అత్యధికసార్లు గెలిచిన నియోజకవర్గంలో గానీ ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు ఉండవని స్పష్టంచేశారు. 73 ఏళ్ల చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఓ రకంగా, ప్రతిపక్ష నేతగా మరోలా వ్యవహరించడం ఆయన విజ్ఞతకు వదిలేయాల్సిందేనని పేర్కొన్నారు.

బాబు వాడుకున్నారు.. జనం ఆడుకున్నారు

సాక్షి, అమరావతి: జనాదరణ పోయింది. పిలిచినా సభలకు రావటం లేదు. దీంతో ఒకరోజు ఇరుకు సందుల్లోనే సభ పెట్టబోయారు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు. ఆ సాహసానికి.. పాపం 8 మంది అమాయకులు బలైపోయారు. జనం రద్దీ బాగా కనిపించే డ్రోన్‌షాట్ల కోసం ఇరుకు రోడ్లోకి వాహనాన్ని పోనిచ్చి... అక్కడ చంద్రబాబు మాట్లాడబోగా, అప్పటికే ఉన్న జనం వెనక్కివెళ్లే తొందర్లో ఒకరిపై ఒకరు పడి... పాపం ప్రాణాలు కోల్పోయారు. దీంతో జనాన్ని రప్పించడానికి వారికి కానుకల ఆశ చూపించారు చంద్రబాబు. విలువైన చీర, ఇతర సరుకులు ఇస్తామని నమ్మబలికి టోకెన్లు పంచి మరీ వేల మందిని రప్పించారు. కానీ చౌకబారు చీరలతో నాసిరకం కానుకలిచ్చారు. అది కూడా టోకెన్లున్న వారందరికీ ఇవ్వకపోవటంతో అక్కడా తోపులాట తప్పలేదు. పాపం.. మరో ముగ్గురు బలైపోయారు.

ఎలాగైనా తమకు జనాదరణ తగ్గలేదని చూపించడానికి చంద్రబాబు ముఠా ఎల్లో మీడియా, సోషల్ మీడియా వేదికగా మరో దుస్సాహసానికి దిగింది. చంద్రబాబును చూసేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చారంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను ఈ ముఠా వైరల్ చేసింది. 'కుప్పం గడ్డ.. ఇది చంద్రబాబు అడ్డా' అనే నినాదాలతో విపరీతంగా జనం కనిపిస్తున్న ఆ ఫొటోలను కొన్ని ఎల్లో చానళ్లు కూడా ప్రసారం చేశాయి. ఇక సోషల్ మీడియాలో అయితే టీడీపీ బ్యాచ్ మొత్తం ఈ ఫొటోలను షేర్ చేస్తూ శివాలెత్తిపోయింది. బాబును ప్రభుత్వం ఎంతలా అడ్డుకున్నా జనం ఆయన వెంటే ఉన్నారంటూ కామెంట్లు కూడా ఊదరగొట్టేశారు. కానీ నిజమేంటో తెలుసా? ఆ ఫొటోలు కుప్పంలోనివి కాదు. అసలు చంద్రబాబుకే కాదు... ఈ రాష్ట్రానికే సంబంధం లేని ఫొటోలు. కర్ణాటక రాష్ట్రంలో అత్యంత ప్రముఖుడిగా గుర్తింపు పొందిన సిద్ధేశ్వర స్వామి సోమవారం మరణించగా... ఆయన అంతిమ యాత్రకు దాదాపు 2 లక్షల మంది భక్తులు, సామాన్య ప్రజలు హాజరయ్యారు. లింగాయత్ సంప్రదాయానికి చెందిన సిద్ధేశ్వర స్వామి... దశాబ్దాల పాటు సమాజానికి విశేష సేవలు అందించి కర్ణాటక వ్యాప్తంగా విశేష గుర్తింపు పొందటంతో జనం తండోపతండాలుగా వచ్చారు. భక్తుల్లో చాలామంది పసుపు రంగు దుస్తులు ధరించి ఉండటం... వాహనానికి కూడా పసుపు రంగు ఉండటంతో ఇది తమకు సరిగ్గా మ్యాచ్ అవుతుందనుకున్న టీడీపీ వర్గాలు... ఆ ఫొటోలను, వీడియోలను డౌన్‌లోడ్ చేసి తమ బాబు సభకు వచ్చిన జనం అంటూ వైరల్ చేసేశాయి.

ఏకి పారేసిన నెటిజన్లు..

ఆ ఫొటోల లోగుట్టును నెటిజన్లు క్షణాల్లోనే పట్టేశారు. ఆ ఫొటోలు కుప్పంలో చంద్రబాబు పర్యటనవి కావంటూ నిజాన్ని నిగ్గు తేల్చారు. చుట్టుపక్కల పరిసరాలు, ఆ ఫొటోల్లో ఉన్న ప్రజల ఆహార్యాన్ని గుర్తించిన ప్రజలే.. ఇవి ఫేక్ అంటూ ఎండగట్టేసరికి పచ్చ గ్యాంగ్‌కు దిమ్మ తిరిగిపోయింది. 'బాబు మరీ ఇంత ఫేకా' అంటూ నెటిజన్లు ఏకిపారేశారు. నిజానికి 1989 నుంచీ చంద్రబాబు ఎమ్మెల్యేగా ఉన్న కుప్పం స్థానంలో ఇపుడు టీడీపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇటీవల జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ ఘోరంగా ఓడిపోయింది. మరో ఏడాదిన్నరలో ఎన్నికలున్న తరుణంలో మూడు రోజుల పర్యటనకు గాను చంద్రబాబు బుధవారం కుప్పంలో అడుగు పెట్టారు. బాబు వస్తున్నారని వారం పది రోజులుగా ఎంత ప్రచారం చేసినా, అక్కడి ప్రజల నుంచి ఏమాత్రం స్పందన కనిపించలేదు. దీంతో ఫొటోల మార్ఫింగ్‌కు దిగారు టీడీపీ ఘనులు. అయినా జనం వచ్చేది నాయకులు చేసే మంచిని చూసి. మరి చంద్రబాబు ఏం చేశారని వస్తారు?

సైకోలా చంద్రబాబు ప్రవర్తన

- ఎంపీ నందిగం సురేష్ ఫైర్



సాక్షి, అమరావతి: చంద్రబాబు పూర్తిగా సైకోలా మారిపోయారని.. నిరాశ నిస్పృహలో ఏంచేస్తున్నారో ఆయనకేమీ అర్థంకావడంలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ విమర్శించారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని బహిరంగంగా పోలీసులతో ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని రాష్ట్ర ప్రజలంతా చూశారని.. చంద్రబాబు, లోకేశ్ సైకోలుగా మారి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీఓ–1 విడుదలకు చంద్రబాబు వైఖరే కారణమని, ఏ ఒక్క పార్టీకి వ్యతిరేకంగా చేసింది కాదని స్పష్టంచేశారు. కుప్పంలో చంద్రబాబు ఉనికి కోల్పోయారు కాబట్టే అక్కడ అల్లకల్లోలం చేయాలని చూస్తున్నారని ఎంపీ ఆరోపించారు. దత్తపుత్రుడు పవన్‌కు పదకొండు మంది చనిపోయింది కనపడలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఎవరెన్ని చేసినా ప్రజలు సీఎం జగన్ వైపు ఉన్నారని స్పష్టంచేశారు.


రాజకీయ సైకో, ఉన్మాది చంద్రబాబే

చంద్రబాబు తీరుపై మంత్రులు, నేతల మండిపాటు

వచ్చే ఎన్నికల్లో గెలవలేనేమోననే నిరాశ, నిస్పృహలతోనే చంద్రబాబు పిచ్చిపట్టినట్లుగా సైకోలా మారిపోయారని పలువురు మంత్రులు, నేతలు వ్యాఖ్యానించారు. జీఓ–1 విడుదలకు ఆయన వైఖరే కారణమని స్పష్టంచేశారు. ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత సీఎంకు ఉండడం తప్పా అని వారు ప్రశ్నించారు. ఆ జీఓ అన్ని పార్టీలకు వర్తిస్తుందని వారు స్పష్టంచేశారు. సీఎం జగన్‌ను ఇష్టారాజ్యంగా దూషించడంపై వారు అభ్యంతరం వ్యక్తంచేశారు. వారు ఇంకా ఏమన్నారంటే..

నువ్వు గెలవలేవు.. నన్ను ఓడించలేవు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సదుం (చిత్తూరు జిల్లా): రానున్న ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు ముమ్మాటికీ గెలవలేరని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టంచేశారు. సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కుప్పంలో గెలవగల, పుంగనూరులో తనను ఓడించగల సత్తా చంద్రబాబుకులేదన్నారు. తనను పుంగనూరు పుడంగి అంటున్నారని, ఆయనకు పుడంగి అంటే అర్థం తెలుసా అని ప్రశ్నించారు. పుడంగి అంటే బలవంతుడని, తాను ఆయనకంటే బలవంతుడునని ఒప్పుకున్నారని చెప్పారు. ఇక 1993 నుంచి తాము పాల వ్యాపారం చేస్తున్నామని.. మీలా భాగస్వాములను మోసగించి షేర్లను స్వాధీనం చేసుకోలేదన్నారు. మీ అనుకూల మీడియాని పిలిచి తక్కువ ధర ఎవరు ఇస్తున్నారో నిరూపించమని పెద్దిరెడ్డి సవాల్‌చేశారు.

వీధిరౌడీలా చంద్రబాబు

- మంత్రి ఆర్కే రోజా



చంద్రగిరి (తిరుపతి జిల్లా): సభల పేరుతో వారం రోజులుగా చంద్రబాబు ఒక వీధి రౌడీలా, ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. తిరుచానూరులో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పబ్లిసిటీ కోసం చంద్రబాబు వరుసగా పేదల ప్రాణాల్ని తీశారని, ఇప్పుడు ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత సీఎం జగన్‌కు ఉండడం తప్పా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం జగన్ నాడు వైజాగ్ వస్తే ఎయిర్‌పోర్టులోనే ఆయన్ను నిర్బంధించింది నువ్వు కాదా? విద్యార్థులు ధర్నాలు చేస్తే వారిపై కేసులు పెట్టింది చంద్రబాబు కాదా?.. తుందూరులో మహిళలు ధర్నాచేస్తే నెలల తరబడి వాళ్లను జైల్లో పెట్టింది ఈ ఉన్మాది చంద్రబాబు కాదా అని ఆమె ప్రశ్నించారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్ గురించి ప్రశ్నిస్తే ఒక ఎమ్మెల్యేని ఏడాది పాటు సస్పెండ్ చేసిన సైకో ఉన్మాది చంద్రబాబు అన్నారు. ఇక బాబు తప్పు చేస్తే పవన్ నోటికి ప్లాస్టర్ వేసుకుంటాడని రోజా ఎద్దేవా చేశారు.

ప్రచార పిచ్చితో బాబు నరమేధం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: ప్రచార పిచ్చితో చంద్రబాబు నరమేధం సృష్టిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. గతంలో గోదావరి పుష్కరాల్లో ఈ పిచ్చితోనే 29 మంది ప్రాణాలను బలిగొన్నారని గుర్తుచేశారు. తాడేపల్లిగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కందుకూరు, గుంటూరులో అదే యావతో ప్రజల ప్రాణాలు బలితీసుకున్నాడన్నారు. సరైన అనుమతులు తీసుకోకుండా సభలు పెట్టడంవల్ల ప్రజలు చనిపోయారని చెప్పారు. ఇటువంటి ఘోరాలు జరగకుండా ఉండేందుకే ప్రభుత్వం జీఓ నం.1ను తీసుకొచ్చిందని వివరించారు.

ఆ జీఓ అందరికీ వర్తిస్తుంది

- మంత్రి మేరుగు నాగార్జున



మహారాణిపేట (విశాఖ దక్షిణ): నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో జరిగిన దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం జీఓ–1 తెచ్చిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఇది సీఎం వైఎస్ జగన్‌తో సహా అందరికీ వర్తిస్తుందని గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఈ జీఓ వచ్చిన తర్వాత సీఎం ఎక్కడా రోడ్‌షో చేయలేదన్నారు.

నిరాశ, నిస్పృహలతోనే..

- మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రాలేననే నిరాశ నిస్పృహలతోనే చంద్రబాబు పిచ్చివాడిలా సీఎంను దూషిస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. కుప్పంలో చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరుపై మంత్రి మండిపడ్డారు. సభలకు సరైన ఏర్పాట్లుచేయకుండా.. పేద ప్రజలను తీసుకొచ్చి, వారి మరణాలకు కారణమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు.

ఫ్యాషన్

ఉలెన్... ఉమన్






కొంచెం కూల్.. కొంచెం హాట్

అన్నట్టుగా ఉంటోంది ఈ వెదర్. దీంతో సందర్భాన్ని బట్టి స్పెషల్‌గా రెడీ అవడం కుదరడం లేదు అనుకునే వారికి బెస్ట్ ఆప్షన్ గా నిలుస్తున్నాయి ఈ ఉలెన్ కుర్తీలు. పార్టీలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి . చలికి స్వెట్టర్ అవసరం లేకుండా కాజువల్ వేర్ గానూ ఆకట్టుకుంటున్నాయి.

ఎనీ వేర్ ఎనీ టైం అన్నట్టుగా కుర్తీ అన్ని వయసుల వారి తప్పనిసరి డ్రెస్‌గా నిలిచిపోయింది. సీజన్‌కి తగిన విధంగా, స్టైలిష్ వేర్‌గా పేరొందిన కుర్తీ మరింత స్పెషల్ గా అట్రాక్ట్ చేస్తోంది.

బ్యూటిప్స్



ముఖం మీద వికారంగా కనిపించే మొటిమలను ఇంటి చిట్కాతో సులభంగా వదిలించుకోవచ్చు. నాలుగు వెల్లుల్లి రెబ్బలు తీసుకుని పొట్టుతీసి మెత్తగా పేస్టులా నూరుకోవాలి. తరువాత ఈ పేస్టును ముఖంపై ఉన్న మొటిమలపై రాయాలి. పేస్టు ఆరుతుంది అనుకున్నప్పుడు దానిపై బ్యాండేజ్ వేయాలి. ఈ బ్యాండేజీను రాత్రంతా ఉంచుకుని ఉదయం తీసేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయడం ద్వారా మొటిమలు తగ్గుముఖం పడతాయి.



జుట్టు నిగనిగల కోసం...

ఇనప మూకుడు తీసుకుని దానిలో టీకప్పు ఆవనూనె, మరోకప్పు కొబ్బరి నూనె, టేబుల్ స్పూన్ మెంతిపొడి లేదా మెంతులు, టేబుల్ స్పూన్ ఉసిరిపొడి, అరకప్పు గోరింటాకు పొడి వేసి బాగా కలపాలి. ఇప్పుడు సన్నని మంట మీద ఈ మూకుడు పెట్టి పదినిమిషాలపాటు మరగనివ్వాలి. ఆయిల్ రంగు మారిన తరువాత స్టవ్ ఆపేసి దించి పక్కనపెట్టుకోవాలి. చల్లారిన తర్వాత దీనిని ఒక శుభ్రమైన పొడి సీసాలో పోసుకుని ఒక పూటంతా పక్కన పెట్టాలి. దీనిని రోజూ తలకు రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకలు నల్లగా నిగనిగలాడతాయి. రోజూ వాడటం ఇష్టం లేనివాళ్లు వారానికి ఒకటి రెండుసార్లు తలకు పట్టించి రెండు మూడు గంటల తర్వాత తలస్నానం చేయాలి. ఈ ఆయిల్‌ను వాడటం వల్ల నల్లని ఒత్తైన కురులు మీ సొంతమవుతాయి.

ఇంటిప్స్

అరటిపండు, యాపిల్ వంటి పండ్లు కోసిన తరువాత రంగు మారకుండా ఉండాలంటే నిమ్మరసం రాసి ఉంచితే సరి.



నిమ్మరసం కొద్ది చుక్కలు మాత్రమే అవసరమైతే మొత్తం కాయనంతటినీ కోయకుండా– ఒక పక్కగా చిన్న రంధ్రం చేసి, కావలసినంత మాత్రమే రసం పిండి. ఆ నిమ్మకాయను ఫ్రిజ్‌లో ఉంచితే, ఆ తర్వాత దానిని మరల ఉపయోగించుకోవచ్చు.

పచ్చని కూరగాయలు వండిన తరువాత కూడా ఆ రంగుని కోల్పోకుండా ఉండాలంటే ఉడుకుతున్నప్పుడు కొద్దిగా పంచదార గాని, నిమ్మరసం గాని కలపాలి.

ముగ్గు - ముచ్చట

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ– వీధి పేరు కూడా రాయండి)





ఎస్. మౌనిక
జహీరాబాద్

19 చుక్కలు,
5 వరుసలు,
వరున చుక్క





జి. పద్మావతి
ఎమ్‌విపి కాలనీ, విశాఖపట్నం

17 చుక్కలు, 1 వచ్చే వరకు,
చుక్క వదిలి చుక్క

వంటిల్లు

రుచుల సంక్రాంతి

సంక్రాంతి దగ్గరకు వస్తోంది...
పిల్లలకు పరీక్షలు వచ్చేశాయి.
ఆ తర్వాత సెలవులు వస్తాయి.
పండక్కి కొత్త దుస్తులు వస్తాయి.
ఇంటికి రుచుల దినుసులు వస్తాయి.
వంటింట్లో రుచులు మొలకెత్తుతాయి.
ఈ రుచులకు ఇప్పుడే బాణలి పెట్టండి.
పండగ వరకు తాజాగా ఉంటాయి

అరిశెలు



కావలసినవి: బియ్యం – ఒకటింపావు కిలో ; బెల్లం – కిలో ; నువ్వులు– టేబుల్ స్పూన్ ; గసగసాలు– టేబుల్ స్పూన్ ; నెయ్యి లేదా నూనె – ముప్పావు కేజీ.

తయారీ: ● బియ్యాన్ని ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. సన్నని రంధ్రాలున్న జల్లెడతో జల్లించి ఒకపాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి. ● బెల్లాన్ని పొడి చేయాలి. పెద్దపాత్రలో ఒక గ్లాసు నీరు, బెల్లం పొడిని వేసి పాకం వచ్చేదాకా మరగనిచ్చి బియ్యప్పిండి వేసి కలుపుకోవాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేయాలి. పాకంపిండిని పెద్ద నిమ్మకాయంత తీసుకుని గసగసాలు, నువ్వులలో అద్ది పాలిథిన్ పేపర్ మీద పలుచగా తట్టి బాణలిలో వేయాలి. రెండువైపులా దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నెయ్యి కారిపోయేటట్లు వత్తాలి. అరిశెల పీటకు బదులుగా రంధ్రాలున్న చెక్క గరిటెలు కూడా వాడవచ్చు. వీటితో బాణలిలో నుంచి తీసేటప్పుడే వత్తి అదనపు నేతిని బాణలిలోకి జారేటట్లు వత్తవచ్చు. **గమనిక:** ● అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపితో కావాలనుకుంటే పాకాన్ని కాస్త ముదరనివ్వాలి. ● ఒక ప్లేటులో నీళ్లు పోసి ఉడుకుతున్న బెల్లం మిశ్రమాన్ని స్పూనుతో కొద్దిగా తీసుకుని నీటిలో వేయాలి. దీనిని చేత్తో నొక్కి రౌండ్ చేయాలి. జారి పోకుండా రౌండ్ వచ్చిందంటే పాకం వస్తున్నట్లు. ఆ రౌండ్‌ను పైకెత్తి ప్లేటు మీద వేసినప్పుడు మెత్తగా జారిపోకుండా అలాగే ఉంటే పాకం వచ్చినట్లు. ముదురు పాకం కావాలనుకుంటే ఆ రౌండ్ ప్లేటుకు తగిలినప్పుడు ఠంగున శబ్దం వచ్చే దాకా పాకం పట్టుకోవాలి. ● అరిశెలు పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి. తినే ముందు పెనం మీద వేడి చేస్తే అప్పుడు చేసిన అరిశెలాగా వేడిగా, మెత్తగా మారుతాయి.

సకినాలు



కావలసినవి: బియ్యం– పావు కేజీ ; వాము – టేబుల్ స్పూన్ ; నువ్వులు – నాలుగైదు స్పూన్లు ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినట్లు ; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీటిని వంపేసి మెత్తగా పొడి చేసి సన్నని చిల్లులున్న జల్లెడతో జల్లించాలి. ఇందులో వాము, నువ్వులు, ఉప్పు వేసి కలపాలి. అన్నీ సమంగా కలిసిన తర్వాత నీటిని పోసి ముద్దగా కలిపితే సకినాల పిండి రెడీ. ● శుభ్రమైన నూలు వస్త్రాన్ని తడి చేయాలి. సకినాల పిండిని చేత్తో తీసుకుని వేళ్లతో సన్నని తాడులాగ చేస్తూ వస్త్రం మీద వలయాకారంగా తిప్పాలి. అలా మూడు –నాలుగు వరుసలుగా వేయాలి. అలాగే పిండినంతటినీ నూలు వస్త్రం మీద సకినాల ఆకారంలో వేసి పది నిమిషాల సేపు ఆరనివ్వాలి. ● బాణలిలో నూనె వేడి చేసి నూలు వస్త్రం మీద నుంచి పచ్చి సకినాలను తీసి నూనెలో వేసి దోరగా వేయించి బాణలిలో నుంచి తీయాలి. నోరూరించే సకినాలు రెడీ. వేడి తగ్గి గోరువెచ్చగా ఉన్నప్పుడు తింటే చాలా రుచిగా ఉంటాయి.

నువ్వుల కజ్జికాయ



కావలసినవి: గోధుమ పిండి – కేజీ ; నువ్వులు – కేజి ; బెల్లం పొడి – 800గ్రా. ; ఏలకులు– 10 గ్రా. ; జీడిపప్పు– 100 గ్రా ; నెయ్యి లేదా నూనె– కేజీ. **తయారీ:** ● గోధుమ పిండి పూరీల పిండిలా ముద్దగా కలిపి పక్కన పెట్టాలి. ● నువ్వులను దోరగా వేయించి చల్లారిన తర్వాత కొంచెం పలుకుగా గ్రైండ్ చేయాలి. అందులో బెల్లం పొడి, ఏలకుల పొడి వేసి అన్నీ సమంగా కలిసే వరకు కలపాలి. ● గోధుమ పిండిని చిన్న నిమ్మకాయంత తీసుకుని పూరీలా వత్తుకుని దానిని సాంచిలో పరిచి అందులో ఒక స్పూను నువ్వులు, బెల్లం మిశ్రమాన్ని, ఒక జీడిపప్పును పెట్టి సాంచిని మూత వేయాలి. కజ్జికాయ ఆకారం వస్తుంది. ● సాంచిలో నుంచి తీసి మరుగుతున్న నూనెలో వేసి దోరగా కాలనివ్వాలి. ● ఇవి దాదాపుగా ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయి.

గమనిక: ● 'సాంచి' అంటే చెక్కతో చేసిన మౌల్డ్. ఇందులో పూరీని పెట్టి మడత వేస్తే అంచులు నొక్కుకుని అక్కడ పిండి అతుక్కుపోతుంది. లోపల పెట్టిన మిశ్రమం బయటకు రాకుండా ఉంటుంది. దీనికి బదులుగా చక్రం స్పూనులు కూడా ఉంటాయి. వాటిని కూడా వాడవచ్చు. ● నెయ్యి రుచిని పెంచుతుంది కాని, కజ్జికాయలు త్వరగా మెత్తబడతాయి. ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే నూనెలో చేసుకోవడం మంచిది.

సున్నుండలు



కావలసినవి: మినప్పప్పు– పావు కేజీ ; బెల్లం పొడి– 200గ్రా. ; ఏలకుల పొడి– టీ స్పూను ; నెయ్యి– 100గ్రా.

తయారీ: ● మందపాటి బాణలిలో నూనె లేకుండా మినప్పప్పు దోరగా వేయించి, చల్లారిన తర్వాత మిక్సీలో పొడి చేయాలి. ఇందులో బెల్లం పొడి, ఏలకుల పొడి, నెయ్యి వేసి కలపాలి. అన్నీ సమంగా కలిసిన తరువాత కావలసిన సైజులో ఉండలు చేయాలి. నెయ్యి వాడకాన్ని తగ్గించాలనుకుంటే నెయ్యిని పిండిలో కలపకుండా కొద్దిగా చేతికి రాసుకుంటూ ఉండలు చేసుకోవాలి.

పూతరేకులు



కావలసినవి: చక్కెర – కేజీ ; సగ్గుబియ్యం– ముప్పావు కేజీ ; జీడిపప్పు– పావు కేజీ ; ఏలకులు– 50గ్రా.; నెయ్యి– 100 గ్రా.

తయారీ: ● పూత రేకుల కోసం రేకులను తయారు చేసుకోవడం కొంచెం కష్టమే. ఇందుకు ప్రత్యేకమైన కుండ కావాలి. ● సగ్గుబియ్యాన్ని చిక్కటి గంజి చేసుకోవాలి. ఒక గట్టి కాటన్ క్లాత్‌ను నలుచదరంగా కట్ చేయాలి. కుండను మంట మీద బోర్లించి వేడెక్కిన తరువాత క్లాత్‌ను సగ్గుబియ్యం గంజిలో ముంచి వేడెక్కిన కుండ మీద పరచాలి. గంజి కుండకు అంటుకుని వేడికి పలుచని పొరలాగా వస్తుంది. ఆ పొర విరిగిపోకుండా అట్లకాడతో జాగ్రత్తగా తీయాలి. ఎన్ని రేకులు కావాలంటే అన్నింటికీ ఇదే పద్ధతి. రేకు ఏ సైజులో కావాలంటే క్లాత్‌ను ఆ సైజులో కట్ చేసుకోవాలి. ● చక్కెర, జీడిపప్పు, ఏలకులను పొడి చేసి కలుపుకోవాలి. ఇప్పుడు రెండు ఒక రేకు తీసుకుని నెయ్యిరాసి చక్కెర, జీడిపప్పు మిశ్రమాన్ని పలుచగా చల్లి పైన మరొక రేకు వేసి మడత వేయాలి. తెల్లగా నోరూరించే పూతరేకు రెడీ. ఇవి పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి. ● ఎక్కువ మోతాదులో రేకులను తయారు చేసుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు చక్కెర మిశ్రమాన్ని వేసి పూతరేకులను చేసుకోవచ్చు. అలాగే చక్కెర బదులు బెల్లం పొడి, ఖర్జూరాల పొడితో కూడా పూతరేకులు చేసుకోవచ్చు. జీడిపప్పుతో పాటు బాదం పలుకులు కూడా వాడవచ్చు.



సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 6-1-2023

● బ్రెయిన్ జిమ్

ఫటాఫట్ ధనాధన్

ABCDE x 4 = EDCBA

A=? B=? C=? D=? E=?

జవాబు: 21978 x 4 = 87912 : edcba=87912
a = 2 b = 1 c = 9 d = 7 e = 8



విన్నర్ విన్నర్ చికెన్ డిన్నర్

ఒకరి విజయాన్ని అభినందించే సందర్భంలో ఉపయోగించే ఎక్స్‌ప్రెషన్ విన్నర్ విన్నర్ చికెన్ డిన్నర్. గ్రేట్ డిప్రెషన్ కాలం నుంచి పుట్టిన మాట ఇది. గ్యాంబ్లర్స్ తమ విజయాన్ని చికెన్ డిన్నర్‌తో సెలబ్రెట్ చేసుకునే వారు. మల్టీప్లేయర్ షూటర్ వీడియోగేమ్ 'ప్లేయర్ అన్‌నోన్స్ బ్యాటిల్‌గ్రౌండ్స్'తో 'విన్నర్ విన్నర్...' ఎక్స్‌ప్రెషన్ ఆన్‌లైన్‌లో పాపులర్ అయింది. ఉదా: ఒక జట్టు కప్పు గెలిచిన సందర్భంలో...

'విన్నర్ విన్నర్ చికెన్ డిన్నర్! గ్రేట్ జాబ్ టుడే ఎవ్రీవన్'

● గేమింగ్

వన్ పీస్ ఒడిస్సీ

త్వరలో విడుదల కాబోతున్న రోల్‌ప్లేయింగ్ వీడియోగేమ్ వన్ పీస్ ఒడిస్సీ. 'వన్‌పీస్' ఫ్రాంచైజ్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ప్లేయర్స్ ఈ గేమ్‌లో మంకీ డి లుఫీని కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. మంకీ డి అలియాస్ స్ట్రా హ్యాట్ 'వన్‌పీస్' సిరీస్‌లో ప్రధాన కథానాయకుడు. సముద్రపు దొంగ కావాలనేది మంకీ చిన్నప్పటి కల. తన కలను నెరవేర్చుకోవడమే కాదు సముద్రపు దొంగలకు నాయకుడు అవుతాడు. ఈ గేమ్‌లో ప్రతి క్యారెక్టర్‌కు తనదైన ప్రత్యేకత ఉంటుంది. నిధుల వేటలో భాగంగా ఈస్ట్ సీలోకి వెళ్లాల్సి ఉంటుంది. ప్రమాదాలను పసిగట్టాల్సి ఉంటుంది.



ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: రోల్‌ప్లేయింగ్ గేమ్ **మోడ్:** సింగిల్

స్ఫూర్తి





సౌమ్య రాజన్

సాగర తీరాన సైన్యమై కదులుతున్నాడు

చిన్నప్పుడు చందమామ కథలతో పాటు సముద్రపు తాబేళ్ల కష్టాల కథలు కూడా విన్నాడు ఒడిషాకు చెందిన సౌమ్య రాజన్ బిస్వాల్. ప్రమాదం అంచున ఉన్న తాబేళ్ల స్థితి గురించి 'అయ్యో!' అనుకోవడానికి మాత్రమే పరిమితం కాలేదు సౌమ్య రాజన్. తానే ఒక ఉద్యమమై, సైన్యమై బలమైన అడుగులు వేస్తున్నాడు...

చిన్నప్పుడు స్కూల్లో ఉపాధ్యాయులు చెప్పే హుషారైన కథలు వినేవాడు సౌమ్య రాజన్ బిస్వాల్. దీంతో పాటు పర్యావరణ సంబంధిత అంశాలలో భాగంగా సముద్రపు తాబేళ్ల గురించి కూడా వినేవాడు. ఎన్నో కథల్లో తాబేలు మనకు సుపరిచిత ఫ్రెండు. అయితే వాస్తవప్రపంచంలో వాటి పరిస్థితి ఘోరంగా ఉంది.

ప్రతి 7 జాతులలో 3 జాతులు అంతరించబోయే ప్రమాదకర పరిస్థితులలో ఉన్నాయి.

తాబేళ్లకు ఎదురవుతున్న విపత్కర పరిస్థితుల గురించి విన్న తరువాత తన వంతుగా ఏదైనా చేయాలని బలంగా అనుకున్నాడు సౌమ్య. అప్పటికింకా తాను హైస్కూల్ విద్యార్థి. రోజూ పెద్ద సంచిని భుజాన వేసుకొని పూరీ జిల్లాలోని అస్తరంగ బీచ్‌కు వెళ్లేవాడు. ప్లాస్టిక్ సంచులు, వాటర్ బాటిల్స్, ఖాళీ సీసాలను ఆ సంచిలో వేసుకొని వచ్చేవాడు.

ఆలివ్ రిడ్లీ తాబేళ్లు పెట్టిన గుడ్లు నక్కలు, కుక్కలు, ఇతర జంతువుల పాలు కాకుండా రక్షించేవాడు.

ఆ తరువాత సౌమ్య రాజన్‌కు స్నేహితులు కూడా తోడయ్యారు.

కాలేజీరోజుల విషయానికి వస్తే, ప్రతి ఆదివారం పర్యావరణ విషయాలపై ఊరూవాడా సైకిల్‌యాత్ర నిర్వహించేవాడు. పర్యావరణ నేస్తాలైన తాబేళ్లను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి జాలర్లకు చెప్పేవాడు.

పర్యావరణానికి సంబంధించిన కార్యక్రమాలను విస్తృతం చేయడం కోసం 'ఒడిషా పర్యావరణ్ సంఘర్షణ్ అభియాన్' అనే స్వచ్ఛందసంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా వందమందితో ఒక సైన్యాన్ని తయారుచేశాడు సౌమ్య రాజన్. చుట్టు పక్కల ఎన్నో జిల్లాలకు వెళ్లి ఈ సైన్యం పర్యావరణ అంశాలపై ప్రచారం నిర్వహిస్తోంది.

'యూఎన్ ఇండియా యువ అడ్వకేట్స్'లో ఒకరిగా గుర్తింపు పొందిన 27 సంవత్సరాల సౌమ్య రాజన్ బిస్వాల్ ఎజెండాలో ఇప్పుడు సేంద్రియ వ్యవసాయం కూడా చేరింది. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత గురించి గిరిజనుల దగ్గరికి వెళ్లి ప్రచారం చేస్తున్నాడు.

> **సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ వికాస కోణంలో తన మనసులోని భావాలకు అక్షర రూపం ఇస్తుంటాడు సౌమ్య రాజన్. మచ్చుకు ఒకటి... 'గతంలో చేసిన తప్పుల నుంచి బయటికి రండి. కొత్త ప్రయాణం ప్రారంభించండి. కొత్త ప్రయాణానికి ప్రతిరోజూ ఒక అపురూప అవకాశమే'.**

యువర్స్

● టెక్..టాక్

సెర్చ్ ఇన్ వీడియో

యూట్యూబ్ 'సెర్చ్ ఇన్ వీడియో' అనే కొత్త ఫీచర్‌ని తీసుకురానుంది. మనకు అవసరమైన, ఆసక్తి కలిగించే టాపిక్ గురించి సులభంగా వెదకడానికి ఉపకరించే ఫీచర్ ఇది. దీంతో పాటు 'మల్టీ సెర్చ్' 'బై లింగ్వల్ సెర్చ్ రిజల్ట్' ఫీచర్‌లను తీసుకురానుంది. 'మల్టీ సెర్చ్ ఫీచర్'తో సందేహాలు కూడా అడగవచ్చు. 'బై లింగ్వల్ సెర్చ్ రిజల్ట్'లో ఇంగ్లీష్‌లో ప్రశ్నలు అడిగితే మనకు అవసరమైన భాషలో సమాధానాలు వస్తాయి.



యూ.కామ్‌లో యూఛాట్



సెర్చ్ ఇంజిన్ you.com గురించి చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. 'ప్రైవసీకి మా తొలి ప్రాధాన్యత' అంటున్న యూ.కామ్‌లో ప్రైవేట్ మోడ్‌లో సెర్చెస్ స్టోర్ కావు. వెబ్‌రిజల్ట్, న్యూస్, వీడియోలు, ఇమేజ్‌లు, మ్యాప్‌లు...మొదలైన విభాగాలు ఉన్నాయి. యూ.కామ్ తాజాగా ఏఐ ఛాట్‌బోట్ 'యూ ఛాట్'ను లాంచ్ చేసింది. సందేహాలకు సమాధానాలు, విషయ వివరణ, అనువాదం, ఇమెయిల్ కంపోజింగ్, కోడ్ రైటింగ్‌లో యూ ఛాట్ ఉపయోగపడుతుంది.

హైడ్ చేయడానికి...

ఆర్కైవ్‌తో పనిలేకుండా వాట్సాప్‌లో(ఐఫోన్) మెసేజ్ హైడ్ చేయడానికి...1. సెట్టింగ్స్-క్లిక్ 2. ఎకౌంట్-సెలెక్ట్ 3. ప్రైవసీ-సెలెక్ట్ 4. స్క్రీన్ లాక్-క్లిక్ 5. రిక్వెస్ట్ ఫేస్‌ఐడీ-యాక్టివేట్ 6. 'ఇమిడియెట్లీ' 'ఆఫ్టర్ 15 మినిట్స్' 'ఆఫ్టర్ 1 హవర్' ఆప్షన్‌లలో టైమ్‌లిమిట్ సెలెక్ట్ చేసుకోవాలి.



ఇక 60 నిమిషాల వీడియో



మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వీడియో క్రియేటర్స్‌కు నచ్చే ఆప్షన్‌ను ప్రవేశ పెట్టింది. తాజా మార్పుతో ట్విట్టర్ బ్లూ సబ్‌స్క్రైబర్‌లు 60 నిమిషాల నిడివి (2జీబీ) ఉన్న వీడియో ఫైల్‌ను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది వెబ్‌లోనే అందుబాటులో ఉంది. దీనికి ముందు 10 నిమిషాల వీడియోను మాత్రమే అప్‌లోడ్ చేసుకోవడానికి వీలయ్యేది. దీంతో పాటు నిర్దిష్టమైన ట్వీట్‌ను ఎన్నిసార్లు చూశారో తెలిపే 'వ్యూ కౌంట్' ఫీచర్‌ని కూడా పరిచయం చేసింది ట్విట్టర్.

లెనోవా ట్యాబ్ ఎం9

లెనోవా ట్యాబ్ ఎం9 గురించి ప్రకటించింది. దీన్ని లాస్ వేగాస్‌లో జరుగుతున్న టెక్ ఈవెంట్ సీయిఎస్ 2023లో ప్రదర్శిస్తారు. విడుదల తేదీ గురించి ప్రకటించలేదు.



- డిస్‌ప్లే: 9 అంగుళాలు
- రిజల్యూషన్: 1340×800 పిక్సెల్స్
- స్టోరేజ్: 128జీబి
- ఎక్స్‌టెండబుల్ స్టోరేజ్: 2టీబి
- బ్యాటరీ లైఫ్: 13 గంటలు
- సెల్ఫీ షూటర్: 2టీబి
- 15 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్
- బ్లూటూత్ 5.1



ఐ ప్రొటెక్షన్ డెస్క్ లైట్

స్వాప్‌కార్ట్ పోర్టబుల్ ఐ ప్రొటెక్షన్ యుఎస్‌బీ ఎల్‌ఈడీ డెస్క్ లైట్ తేలికపాటి బరువుతో అడ్జస్టబుల్, ఫ్లెక్సిబుల్‌గా ఉంటుంది. పుస్తకాలు చదువుకోవడానికి, పీసీ, ల్యాప్‌టాప్‌లతో పని చేస్తున్నప్పుడు ఇది ఉపకరిస్తుంది. **బ్రాండ్:** స్వాప్‌కార్ట్ **స్టైల్:** పోర్టబుల్

ఎంపవర్



ఆశ

సందేశ యాత్ర

మహిళా సాధికారత, మహిళల భద్రతకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయడానికి 24 సంవత్సరాల ఆశా మాల్వియ 'సంపూర్ణ్ భారత్ సైకిల్ యాత్ర' చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని నటరామ్ గ్రామానికి చెందిన ఆశకు చిన్నప్పటి నుంచి సాహసాలు చేయడం అంటే ఇష్టం. కొత్తగా ఆలోచించడం అంటే ఇష్టం.

పర్వతారోహకురాలిగా ఎన్నో సాహసాలు చేసిన ఆశకు సామాజిక విషయాలపై మంచి అవగాహన ఉంది.

గత సంవత్సరం నవంబర్ 1న ఈ సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు అయిదు రాష్ట్రాల గుండా ఆరువేల కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసింది.

'ఇంత సుదీర్ఘయాత్రను చేయడం కష్టంగా లేదా?' అనే ప్రశ్నకు ఆమె చిరునవ్వే సమాధానం చెబుతుంది. యాత్రలో ప్రతి రోజూ ఒక కొత్త ప్రపంచాన్ని దర్శించుకో గలిగే అదృష్టం లభించినప్పుడు కష్టం ఎందుకు! అనేది ఆమె చిరునవ్వు సారాంశం.

యాత్రలో భాగంగా రకరకాల సంస్కృతులు, ఆచార, వ్యవహారాల గురించి తెలుసుకుంటూ వెళుతుంది. ఉద్యమకారులు, ఉన్నతాధికారులు, నాయకులతో మాట్లాడుతుంది. వారితో ఎన్నో విషయాలు చర్చిస్తుంది. ప్రస్తుతం ఆశ సైకిల్ యాత్ర కేరళకు చేరుకుంది. ఈ సైకిల్ యాత్ర ఢిల్లీలో ముగుస్తుంది.

'భారతదేశం మహిళలకు భద్రమైన దేశం అనే సందేశాన్ని నా యాత్ర ద్వారా ప్రపంచానికి సందేశం పంపాలనుకుంటున్నాను' అంటోంది ఆశ.

సినిమా



● చిరంజీవి

సంక్రాంతి సంబరం... బాక్సాఫీస్ సమరం

ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా సంక్రాంతి సమరానికి బాక్సాఫీస్ ముస్తాబవుతోంది. థియేటర్ అనే గ్రౌండ్‌లో ప్రేక్షకులే సాక్షిగా బాక్సాఫీస్ బరిలో కలెక్షన్స్ పందేనికి కత్తులు కట్టిన కోడి పుంజుల్లా రెడీ అయ్యారు నలుగురు స్టార్ హీరోలు. వీరితో పాటు యంగ్ హీరో కూడా వస్తున్నాడు. పండగ సందర్భంగా సినిమాలు రావడం సినీ ప్రేమికులకు సంబరం... బాక్సాఫీస్‌కి వసూళ్ల సమరం. ఇక.. ఈ సంక్రాంతి పండక్కి వస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

సంక్రాంతి ఈ నెల 13న ఆరంభమవుతుంది. కానీ సినిమా సంక్రాంతి మాత్రం రెండు రోజులు ముందుగానే అంటే జనవరి 11న స్టార్ట్ అవుతుంది. తమిళ హీరోలు విజయ్ నటించిన 'వారసుడు' (తమిళంలో 'వారిసు'), అజిత్ 'తునివు' (తెలుగులో 'తెగింపు') చిత్రాలు జనవరి 11నే విడుదల కానున్నాయి. విజయ్, రష్మికా మందన్నా జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వారసుడు'. ఈ సినిమాను 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మించారు. ఓ సంపన్న ఉమ్మడి కుటుంబంలో చోటు చేసుకునే వివిధ సంఘటనల సమాహారంగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తోంది. ఇక 'నేర్కొండ పార్వై' (హిందీ 'పింక్' తమిళ రీమేక్), 'వలిమై' చిత్రాల తర్వాత హీరో అజిత్, దర్శకుడు హెచ్. వినోద్, నిర్మాత బోనీ కపూర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కిన మూడో చిత్రం 'తెగింపు' (తమిళంలో 'తునివు'). ఈ యాక్షన్ ఫిల్మ్ కథాంశం బ్యాంకు రాబరీ నేపథ్యంలో ఉంటుంది. బ్యాంకును హైజాక్ చేసిన ఓ వ్యక్తి, ఆ బ్యాంకు కస్టమర్లను హోస్టేజ్‌గా చేసి తన లక్ష్యాలు నెరవేరేలా ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేస్తాడు. 'తెగింపు' ప్రధానాంశం ఇదే అని తెలుస్తోంది. కాగా జనవరి 12న 'వీరసింహా రెడ్డి'గా వస్తున్నారు బాలకృష్ణ. 'అఖండ' వంటి హిట్ తర్వాత బాలకృష్ణ, 'క్రాక్' వంటి హిట్ తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందిన ఈ 'వీరసింహారెడ్డి'లో శ్రుతీహాసన్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. మరోవైపు 'వాల్తేరు వీరయ్య'గా జనవరి 13న వస్తున్నారు చిరంజీవి. ఆయన టైటిల్ రోల్‌లో నటించి, హీరో రవితేజ ఓ కీలక పాత్ర పోషించిన ఈ సినిమాకు కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకుడు. శ్రుతీ హాసన్ నాయిక. శ్రీకాకుళంలో నివాసం ఉండే వాల్తేరు వీరయ్య (చిరంజీవి)కు, మరో ఏరియాలో ఉండే పోలీస్ ఆఫీసర్ విక్రమ్ సాగర్ (రవితేజ)లకు మధ్య ఉన్న అనుబంధం, పగ అంశాలతో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. ఈ చిత్రాన్ని కూడా నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లే నిర్మించారు. ఇక ప్రతి సంక్రాంతికి పెద్ద స్టార్స్ మధ్య చిన్న హీరోల సినిమాలూ రిలీజ్ అవుతాయి. ఈ సంక్రాంతికి ఈ జాబితాలో నిలిచిన మూవీ 'కళ్యాణం కమనీయం'. సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. ఆళ్ల అనిల్ కుమార్ దర్శకత్వంలో ఈ సినిమాను యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. శివ (సంతోష్), శ్రుతి (ప్రియా) ప్రేమ బంధం నుంచి వైవాహిక జీవితంలోకి అడుగు పెడతారు. అయితే శివకు జాబ్ లేకపోవడం వారి మధ్య ఎలాంటి మనస్పర్థలకు దారి తీసింది అనేది చిత్రం ప్రధానాంశం. మరి.. ఈ సంక్రాంతి బరిలో ఏ సినిమాకు ప్రేక్షకులు 'సంక్రాంతి హిట్' ట్యాగ్ ఇస్తారో చూడాలి.



● బాలకృష్ణ



● విజయ్



● అజిత్

మళ్లీ క్లాష్

చిరంజీవి, బాలకృష్ణ ఇప్పటివరకు ఏడెనిమిది సార్లు సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద పోటీపడ్డ సంగతి తెలిసిందే. చివరిసారిగా 2017లో చిరంజీవి 'ఖైదీ నంబరు 150 (జనవరి 11)', బాలకృష్ణ 'గౌతమి పుత్రశాతకర్ణి' (జనవరి 12) చిత్రాలతో పోటీపడ్డారు. ఈ రెండు చిత్రాలూ విజయం సాధించాయి. మళ్లీ ఆరేళ్లకు వీరిద్దరూ సంక్రాంతి బరిలో ఉన్నారు. సేమ్ తమిళ హీరోలు అజిత్, విజయ్ కూడా పొంగల్‌కి బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డ హీరోలే. 2014లో అజిత్ 'వీరమ్ (జనవరి 10)', విజయ్ 'జిల్లా' (జనవరి 10) చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు వీరి తాజా చిత్రాలు 'తెగింపు', 'వారసుడు' కూడా ఒకేరోజు (జనవరి 11) విడుదల కానుండటం విశేషం.



● ప్రియా భవానీ, సంతోష్

పండగకి చిన్న సినిమాలూ హిట్టే

- అనిల్‌కుమార్ ఆళ్ల

"ప్రతి సంక్రాంతికి పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలూ విడుదలవుతుంటాయి.. హిట్టవుతుంటాయి కూడా. పండగకి ఎన్ని సినిమాలు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. పైగా నాలుగు మాస్ సినిమాల మధ్య వస్తున్న ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మా 'కళ్యాణం కమనీయం'. సంక్రాంతి పండగ అంటే సినిమా పండగ. కుటుంబం అంతా కలిసి చూసేలా మా సినిమా ఉంటుంది. అందుకే పెద్ద స్టార్స్ సినిమాలున్నా మా చిత్రాన్ని నమ్మకంగా రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే దొరుకుతున్నాయి" అని చిత్రదర్శకుడు అనిల్‌కుమార్ ఆళ్ల 'సాక్షి'తో అన్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ని గురువారం అనుష్క రిలీజ్ చేశారు.

రివెంజ్ హిట్టవ్వాలి

- దర్శకుడు ఎన్. శంకర్

"'రివెంజ్' దర్శకుడు శ్రీను, నా ప్రయాణం చెన్నై నుంచే ప్రారంభమైంది. తను మంచి రైటర్, డైరెక్టర్. సినిమానే ప్రాణంగా బతికే వ్యక్తి. శ్రీను, బాబులకు సినిమా అంటే ఎంతో ప్యాషన్.. అంకితభావం ఉన్న వీరిద్దరూ కలిసి చేసిన 'రివెంజ్' మంచి హిట్ కావాలి" అని దర్శకుడు ఎన్. శంకర్ అన్నారు. బాబు పెదపూడి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'రివెంజ్'. రెట్టడి శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేహా దేశ్‌పాండే హీరోయిన్. ఆది అక్షర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ట్రైలర్‌ను ఎన్. శంకర్ విడుదల చేశారు. హీరో–నిర్మాత బాబు పెదపూడి మాట్లాడుతూ– "త్రివిక్రమ్‌గారి 'అతడు', దశరథ్‌గారి 'శ్రీ' సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. ఆ తర్వాత అవకాశాలు వచ్చినప్పటికీ బిజీ వల్ల చేయలేకపోయాను. శ్రీనివాస్‌గారి అంకితభావం నచ్చి, 'రివెంజ్' అవకాశం ఇచ్చాను. త్వరలో సినిమా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం" అన్నారు. "30 ఏళ్లుగా చిత్ర రంగంలో ఉంటున్నాను. వంశీ, విజయ్ భాస్కర్ వంటి ప్రముఖ దర్శకుల వద్ద పని చేశాను. 'పొదరిల్లు, ఐపీసీ సెక్షన్' వంటి చిత్రాల తర్వాత నేను దర్శకత్వం వహించిన మూడో చిత్రం 'రివెంజ్'" అన్నారు రెట్టడి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో దర్శకుడు వీరభద్రమ్ చౌదరి, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శోభారాణి, వ్యాపార, రాజకీయవేత్త ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: చిడతల నవీన్, సంగీతం: విజయ్ కురాకుల.



● బాబు పెదపూడి, ఎన్. శంకర్, వీరభద్రమ్

సినిమా అంటే దేవాలయం

- రాజమౌళి

"నా దృష్టిలో సినిమా అంటే ఓ దేవాలయం. చిన్నప్పుడు సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు పొందిన ఆనందం నాకిప్పటికీ గుర్తుంది" అని దర్శకుడు రాజమౌళి అన్నారు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా గత ఏడాది విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పటికే ఈ చిత్రం పలు అవార్డులు అందుకుంది. తాజాగా ఉత్తమ దర్శకుడిగా 'న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డును అందుకున్నారు రాజమౌళి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– "'ఆర్ఆర్ఆర్'కి ఉత్తమ దర్శకుడి అవార్డును అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి సీన్‌ని నేను ఓ ప్రేక్షకుడిలా ఊహించుకుని తీస్తాను. ప్రపంచంలోని భారతీయులను ఆకట్టుకోవడం కోసం సినిమాలు తీస్తుంటాను. కానీ, 'ఆర్ఆర్ఆర్'పై భారతీయులు ఎలాంటి ప్రేమను చూపించారో విదేశీయులు కూడా అలానే చూపించారు. నా సినిమాలకు పని చేసే ముఖ్యమైన వ్యక్తులందరూ నా సొంత కుటుంబ సభ్యులే. నన్ను అత్యున్నత స్థానంలో నిలపడం కోసం వారు కష్టపడుతున్నారు. నేను ఎలాంటి విజయాలు అందుకున్నా నా కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. అలాగే, 'ఆర్ఆర్ఆర్' టీమ్, తారక్ (ఎన్టీఆర్), చరణ్ (రామ్‌చరణ్)లకు, సినిమా ప్రేమికులకు థ్యాంక్స్" అన్నారు. కాగా ఈ వేడుకలో రాజమౌళి సతీమణి రమా, వదిన వల్లి, తనయుడు కార్తికేయ, కోడలు పూజ, నిర్మాత శోభు యార్లగడ్డ పాల్గొన్నారు.



● న్యూయార్క్‌లో ఓ సెల్ఫీ

గుర్తుండిపోయే పాత్ర చేశా

- దునియా విజయ్



"**బా**లకృష్ణగారి సినిమాలు చూస్తూ పెరిగాను.. అలాంటిది ఆయనతో కలసి నటించడం మాటల్లో చెప్పలేని అనుభూతి. తొలిసారి ఆయన్ని సెట్‌లో చూసినప్పుడు నన్ను నేను నమ్మలేకపోయాను.. ఆయనది గొప్ప వ్యక్తిత్వం" అని నటుడు దునియా విజయ్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. ఈ చిత్రంలో మెయిన్ విలన్ పాత్ర పోషించిన కన్నడ నటుడు దునియా విజయ్ మాట్లాడుతూ– "గోపీచంద్‌గారు బ్రిలియంట్ డైరెక్టర్. 'వీరసింహారెడ్డి' లో నా పాత్ర (ముసలిమడుగు ప్రతాప్ రెడ్డి) గురించి చెప్పినప్పుడే చాలా థ్రిల్ అనిపించింది. చాలా మొరటుగా ఉండే నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. ఇంత మంచి పాత్రలో బాలకృష్ణగారి సినిమాలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన ఎనర్జీ సూపర్.. పనిపట్ల అంకితభావం గొప్పగా ఉంటుంది. 'వీరసింహారెడ్డి' ఆయన అభిమానులకు, ప్రేక్షకులకు గ్రేట్ ఎమోషనల్ జర్నీ. ఒక నటుడిగా అన్ని పాత్రలూ చేయాలని ఉంటుంది. ఈ సినిమా తర్వాత కూడా మంచి పాత్రలు వస్తే విలన్‌గా చేయడానికి సిద్ధమే. నటన, దర్శకత్వం వేర్వేరు. నటుడిగా చేస్తున్నప్పుడు నా దృష్టి కేవలం నటనపైనే ఉంటుంది. దర్శకునిగా చేస్తున్నప్పుడు నా నుండి ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో దానిపైనే ఫోకస్ ఉంటుంది. ప్రస్తుతం కన్నడలో 'భీమ' అనే చిత్రంలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నాను. తెలుగులోనూ కొన్ని చర్చలు జరుగుతున్నాయి" అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
6-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
304	51
60,353	17,992

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	10,341	▽	118
డోజోన్స్	32,893	▽	377
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,633	△	43
డాక్స్	14,436	△	54
షాంఘై	3,155	△	32
నికాయ్	25,821	△	104

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	55,796 △ 346
బంగారం (99.5 స్వచ్ఛత)	55,573 △ 344
వెండి (కిలో)	67,678 ▽ 1693

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.01	83.68
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.39	89.48
€	యూరో	ఎస్‌బీఐ	98.15	101.44
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.71	63.70
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.35	57.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.76	62.77
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.02	22.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.58	23.38
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.92

4,675 ఈ-బస్‌లకు సీఈఎస్‌ఎల్ టెండర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ (సీఈఎస్‌ఎల్) తాజాగా 4,675 ఎలక్ట్రిక్ బస్‌లకు టెండర్లను పిలిచింది. వీటి విలువ రూ.5,000 కోట్లు. నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ (ఎన్‌ఈబీపీ) కింద టెండర్లను ఆహ్వానించడం ఇది రెండవసారి అని సీఈఎస్‌ఎల్ గురువారం తెలిపింది. డ్రై లీజ్ ప్రాతిపదికన ఈ బస్‌లను తెలంగాణ, ఢిల్లీ, కేరళలో ప్రవేశపెడతారు. డ్రై లీజ్ పద్ధతిలో డ్రైవర్లు, కండక్టర్లు లేకుండా ఈ బస్‌లను ఆపరేటర్లు రాష్ట్ర రోడ్డు రవాణా (ఎస్‌టీసీ) సంస్థలకు సరఫరా చేస్తారు. ఎస్‌టీసీలు తమ సిబ్బందితో వీటిని నడిపిస్తాయి. యాజమాన్య హక్కులతోపాటు నిర్వహణ బాధ్యతలను 10, 12 ఏళ్లపాటు సర్వీస్ ప్రొవైడర్లు (ఆపరేటర్లు) చేపడతారు. ఒక్కో బస్‌కు నిర్దేశిత రుసుమును ఆపరేటర్లకు ఎస్‌టీసీలు చెల్లిస్తాయి. బిడ్డర్లు, ఎస్‌టీసీలు తప్పనిసరిగా మహిళలను నియమించుకోవడంతోపాటు సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుంది. 4,675 ఎలక్ట్రిక్ బస్‌లు వస్తే ఏటా 15 లక్షల కిలోలీటర్ల ఇంధనం ఆదా అవుతుందని సీఈఎస్‌ఎల్ తెలిపింది.

లిస్టెడ్ కంపెనీలకు సెబీ దన్ను

వార్షిక నివేదిక హార్డ్ కాపీలకు చెక్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ లిస్టెడ్ కంపెనీలకు వార్షిక నివేదికల విషయంలో మరోసారి దన్నుగా నిలిచింది. ఈ ఏడాది సెప్టెంబర్‌వరకూ వాటాదారులకు వార్షిక నివేదికల హార్డ్ కాపీలను పంపించనవసరం లేదని స్పష్టం చేసింది. ఇప్పటికే 2022 డిసెంబర్‌వరకూ అన్ని లిస్టెడ్ కంపెనీలనూ ఇందుకు అనుమతించింది. తాజాగా ఈ ఆదేశాలను 2023 సెప్టెంబర్‌వరకూ పొడిగించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-1-2023	
విశాఖ	555-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
5-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	541-00
వరంగల్	543-00
రిటైల్ ధర	6.00

అమెజాన్, సేల్స్‘ఫోర్స్’లో కోత

- యూఎస్‌లో ఉద్యోగులకు షాక్
- అమెజాన్‌లో 18,000 మందికి టాటా
- సేల్స్‌ఫోర్స్ నుంచి 8,000 మంది ఔట్

వాషింగ్టన్: ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ ఇంక్, ఐటీ దిగ్గజం సేల్స్‌ఫోర్స్ తాజాగా ఉద్యోగాలలో కోత పెట్టనున్నట్లు వెల్లడించాయి. వెరసి కరోనా మహమ్మారి తదుపరి సిబ్బందిని తగ్గించుకుంటున్న పలు కంపెనీల బాటలో నడవనున్నాయి. అమెజాన్ 18,000 పొజిషన్లను తప్పించనున్నట్లు తెలియజేసింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలోనూ పలు సంక్షోభ సమయాలను అధిగమించిన కంపెనీ భవిష్యత్‌లోనూ నిలదొక్కుకోగలదని ఉద్యోగులకు పంపిన నోట్‌లో అమెజాన్ సీఈవో ఆండీ జస్సీ పేర్కొన్నారు. ప్రధానంగా అమెజాన్ ఫ్రెష్, అమెజాన్ గో స్టోర్ల సిబ్బంది పైనే తాజా వేటు పడుతున్నట్లు వెల్లడించారు.



8,000 మందికి గుడ్‌బై

టెక్నాలజీ దిగ్గజం సేల్స్‌ఫోర్స్ 8,000 మంది ఉద్యోగులకు గుడ్‌బై చెప్పనుంది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో 10%కి సమానంకాగా.. 23ఏళ్ల కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికం! క్లౌడ్ కంప్యూటింగ్‌కు తెరతీసిన సేల్స్‌ఫోర్స్‌ను ఒరాకిల్ మాజీ ఎగ్జిక్యూటివ్ మార్క్ బెనియాఫ్ నెలకొల్పారు. మరోవైపు టాప్ ర్యాంక్‌లోనూ కోతలు కనిపిస్తున్నాయి. ట్విట్టర్ చైర్మన్‌గా వ్యవహరించిన కో-సీఈవో బ్రెట్ టేలర్, స్లాక్ సహవ్యవస్థాపకుడు స్టివార్ట్ బటర్‌ఫీల్డ్ సైతం సేల్స్‌ఫోర్స్ నుంచి వైదొలిగారు. స్లాక్‌ను 28 బిలియన్ డాలర్లకు సేల్స్‌ఫోర్స్ కొనుగోలు చేసింది.

బీఎస్‌ఈ సీఈవోగా సుందరరామన్

గత నెలలోనే సెబీ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజం బీఎస్‌ఈకి ఎండీ, సీఈవోగా సుందరరామన్ రామమూర్తి ఎంపికయ్యారు. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రామమూర్తి ఎంపికకు గత నెలలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు బీఎస్‌ఈ పేర్కొంది. అయితే ఈ ఆఫర్‌ను రామమూర్తి ఆమోదించవలసి ఉన్నట్లు తెలియజేసింది. బీఎస్‌ఈ గత ఎండీ, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ గతేడాది(2022) జూలైలో పదవి నుంచి తప్పుకుని మరో దిగ్గజ స్టాక్ ఎక్స్చేంజీ ఎన్‌ఎస్‌ఈకి తరలివెళ్లారు. దీంతో ఎన్‌ఎస్‌ఈలో సభ్యులుగా వ్యవహరించిన రామమూర్తికి బీఎస్‌ఈ అత్యున్నత పదవిని ఆఫర్ చేసింది.

2024లో బీఎస్‌ఎన్‌ఎల్ 5జీ సేవలు

కేంద్ర టెలికం మంత్రి వైష్ణవ్ వెల్లడి

భువనేశ్వర్: ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్ 2024 నుంచి 5జీ సర్వీసులను ప్రారంభిస్తుందని కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు కోసం టీసీఎస్, సీ-డీవోటీ సారథ్యంలోని కన్సార్షియంను బీఎస్‌ఎన్‌ఎల్ షార్ట్‌లిస్ట్ చేసిందని ఆయన చెప్పారు. దీన్ని ఏడాది వ్యవధిలో 5జీకి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఒడిషాలో జియో, ఎయిర్‌టెల్ 5జీ సర్వీసులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి వివరించారు. ఒడిషాలో టెలికం కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు కేంద్రం రూ. 5,600 కోట్లు కేటాయించిందని ఆయన చెప్పారు. మరోవైపు, రుణ సంక్షోభంలో ఉన్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియాకు (వీఐఎల్) నిధులు సహా వివిధ అవసరాలు ఉన్నాయని వైష్ణవ్ తెలిపారు. ఎంత మేర పెట్టుబడులు కావాలి, ఎవరు ఎన్ని నిధులను సమకూర్చాలనే అంశాలపై చర్చలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. వీఐఎల్‌కు రూ. 2 లక్షల కోట్ల పైగా రుణ భారం ఉంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 16,000 కోట్ల వడ్డీని ఈక్విటీ కింద మార్చే ఆప్షన్‌ను వినియోగించుకోవాలని వీఐఎల్ నిర్ణయించుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి దాదాపు 33 శాతం వాటా లభిస్తుండగా, ప్రమోటర్ల హోల్డింగ్ 74.99 శాతం నుంచి 50 శాతానికి తగ్గుతుంది.



విస్తరణలో రుషిల్ డెకోర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైజాగ్‌లో ఎండీఎఫ్ బోర్డుల తయారీ ప్లాంటును ఏర్పాటు చేసిన ఇంటీరియర్ ఇన్‌ఫ్రా తయారీ సంస్థ రుషిల్ డెకోర్ .. తాజాగా కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా రూ. 60 కోట్లతో గుజరాత్‌లో జంబో-సైజ్ డెకరేటివ్ ల్యామినేట్స్ ప్లాంటును నెలకొల్పుతోంది. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అందుబాటులోకి రాగలదని సంస్థ డైరెక్టర్ రుషిల్ ఠక్కర్ గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎండీఎఫ్, ల్యామినేట్స్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలో తమకు మొత్తం అయిదు అధునాతన ప్లాంట్లు ఉన్నాయని ఆయన వివరించారు. వైజాగ్ ప్లాంటు సామర్థ్య వినియోగం ప్రస్తుతం సుమారు 74%గా ఉందని, దీన్ని త్వరలో 100%కి పెంచుకోనున్నట్లు రుషిల్ చెప్పారు. తమ ఎండీఎఫ్ అమ్మకాల్లో తెలంగాణ వాటా 18%గా ఉండగా, దేశీయంగా మొత్తం ఎండీఎఫ్ మార్కెట్లో తమ వాటా సుమారు 24% వరకూ ఉంటుందని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 624 కోట్ల ఆదాయం ఆర్జించగా ఈసారి దాదాపు రూ. 800 కోట్ల పైచిలుకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు రుషిల్ తెలిపారు.

18,000 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ నష్టం 304 పాయింట్లు
- రెండోరోజూ సూచీల డీలా
- ఫెడ్ వడ్డీరేట్ల పెంపు అంచనా ఒత్తిళ్లు
- ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: అమెరికాలో కీలక వడ్డీరేట్ల పెంపు ఈ ఏడాదిలోనూ కొనసాగొచ్చని ఫెడ్ మినిట్స్ ద్వారా వెల్లడి కావడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ డీలా పడ్డాయి. వీక్లీ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో ట్రేడర్లు పొజిషన్లను వదిలించుకోవడంతో పాటు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. విదేశీ ఇన్వెస్టర్లు పదో ట్రేడింగ్ సెషన్‌లోనూ విక్రయాలను పాల్పడ్డారు. ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడటంతో ప్రపంచ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. ఫలితంగా ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఐటీ, వినిమయ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో గురువారం సెన్సెక్స్ 304 పాయింట్లు పతనమై 60,353 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51 పాయింట్లు నష్టపోయి 18వేల స్థాయి దిగువన 17,992 వద్ద నిలిచింది. ట్రేడింగ్ ప్రారంభంలో సానుకూలంగా కదలాడిన సూచీలు ఆ తర్వాత కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 607 పాయింట్లు క్షీణించి 60,050 వద్ద, నిఫ్టీ 150 పాయింట్లను కోల్పోయి 17,893 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. చివరి గంటలో ఫార్మా, మెటల్, ఇంధన, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ.., సూచీలు నష్టాల నుంచి తేరుకోలేకపోయాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.33%, 0.01 శాతం చొప్పున నష్టపోయాయి. వడ్డీ రేట్ల పెంపు అంశాన్ని ఫెడ్ మినిట్స్ ద్వారా ఖరారు చేసుకున్న ప్రపంచ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 37 పైసలు బలపడి 82.45 స్థాయి వద్ద స్థిరపడింది. రెండు వరుస ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 941 పాయింట్లు, నిఫ్టీ 240 పాయింట్లు నష్టపోయాయి.

‘‘ప్రపంచ ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే ఇప్పటికీ భారత మార్కెట్ వ్యాల్యుయేషన్లు అధికంగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, సవాళ్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు పొజిషన్లను పరిమితంగా చేసుకునేందుకు స్థిరంగా లాభాల స్వీకరణకు పాల్పడుతున్నారు. వడ్డీ రేట్ల పెంపు, భౌగోళిక అనిశ్చితులు తెరపైకి వస్తున్న తరుణంలో ఇన్వెస్టర్లు పూర్తి అప్రమత్తతతో వహిస్తున్నారు’’ అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

బజాజ్ ఫైనాన్స్‌కు రూ.28,681 కోట్ల నష్టం

డిసెంబర్ క్వార్టర్ ముందస్తు వ్యాపార గణాంకాలు అంచనాలను అందుకోలేకపోవడంతో ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజ బజాజ్ ఫైనాన్స్ షేరు భారీ పతనాన్ని చవిచూసింది. బీఎస్‌ఈలో ఏడుశాతానికి పైగా నష్టపోయి రూ.6,100 స్థాయి వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఎనిమిది శాతానికి పైగా క్షీణించి రూ.6,032 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే. షేరు భారీగా దిగిరావడంతో కంపెనీకి రూ.28,681 కోట్ల నష్టం వాటిల్లింది. వెరసి కంపెనీ మొత్తం మార్కెట్ విలువ రూ.3.69 లక్షల కోట్లుగా నమోదైంది.

ఫైనాన్స్ షేర్ల భారీ పతనం

బ్యాంకింగేతర కంపెనీల ప్రీ-క్వార్టర్ డేటా నిరాశపరచడంతో పలు ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్ కంపెనీల షేర్లు 7%, ఐదుశాతం చొప్పున పతనమయ్యాయి.. చోళ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 4-1% నష్టపోయాయి.

చిన్న ఫార్మా సంస్థల్లో రుణాలకు డిమాండ్

యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ సంగ్రామ్ సింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో ఫార్మా, ఆటో, ఇంజినీరింగ్, విద్య తదితర రంగాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) నుంచి రుణాలకు డిమాండ్ నెలకొందని యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ (కమర్షియల్ బ్యాంకింగ్ కవరేజీ విభాగం) సంగ్రామ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం తమ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లో ఎస్ఎంఈ రుణాల పోర్ట్‌ఫోలియో వాటా 20 శాతం మేర ఉంటుందని ఆయన చెప్పారు. గత అయిదేళ్లుగా ఈ విభాగం ఏటా 28 శాతం వృద్ధి నమోదు చేస్తోందని వివరించారు. రుణ, ఆర్థిక సేవల విషయంలో చిన్న సంస్థలకు తోడ్పాటు అందించే దిశగా యాక్సిస్ బ్యాంక్ గురువారమిక్కడ ‘ఎవాల్వ్’ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా సింగ్ ఈ విషయాలు చెప్పారు. యాక్సిస్ బ్యాంక్‌కు దేశవ్యాప్తంగా 4,760 పైచిలుకు శాఖలు ఉండగా, 189 ఎస్ఎంఈ సెంటర్ల ద్వారా చిన్న, మధ్యతరహా సంస్థలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌బీఎఫ్‌సీల్లాంటి వాటి నుంచి పోటీ ఉన్నా తాము రుణాలు మొదలుకుని డిపాజిట్, ట్రేడ్, ఫారెక్స్ వరకూ వివిధ ఆర్థిక సర్వీసుల అన్నీ అందిస్తాము కాబట్టి చిన్న సంస్థలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సింగ్ చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్


ఒగ్బెచె ‘హ్యాట్రిక్’తో హైదరాబాద్ ఘన విజయం

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) జోరు కొనసాగుతోంది. గురువారం గోవాలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 3-1 గోల్స్ తేడాతో గోవా ఎఫ్‌సీపై ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సాధారణ ప్రదర్శన కనబర్చిన బార్తొలొమెవ్ ఒగ్బెచె ఈ మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో చెలరేగి జట్టును గెలిపించాడు. హైదరాబాద్ తరఫున నమోదైన మూడు గోల్స్‌ను (21వ నిమిషం, 79వ నిమిషం, 90వ నిమిషం) కూడా ఒగ్బెచె సాధించడం విశేషం. గోవా తరఫున రెడీమ్ (54వ నిమిషం) ఏకైక గోల్ చేశాడు. తాజా విజయంతో హైదరాబాద్ మరో సారి అగ్రస్థానానికి దూసుకుపోయింది. 13 మ్యాచ్‌లలో 10 మ్యాచ్‌లు గెలిచిన జట్టు మొత్తం 31 పాయింట్లతో పట్టికలో నంబర్‌వన్‌గా కొనసాగుతోంది.



పరుగుల వరదలో తేడా పదహారు!

- రెండో టి20లో పోరాడి ఓడిన భారత్
- 16 పరుగులతో శ్రీలంక గెలుపు
- అక్షర్, సూర్యకుమార్ పోరాటం వృథా
- లంకను గెలిపించిన షనక


షనక

పుణే: భారత్ విజయలక్ష్యం 207 పరుగులు... ఒక దశలో స్కోరు 57/5... మిగిలిన 65 బంతుల్లో మరో 150 పరుగులు చేయాలి...భారీ ఓటమి ఖాయమనిపించింది...అయితే ఈ దశలో అక్షర్ పటేల్ (31 బంతుల్లో 65; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) అనూహ్యంగా చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఒకే ఒక్కసారి 30కి పైగా పరుగులు (గత మ్యాచ్‌లోనే) చేసిన అతను ఈ సారి విధ్వంస ప్రదర్శనతో చెలరేగిపోయాడు. మరో వైపునుంచి సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా సత్తా చాటడంతో భారత్ గెలుపు ఆశలు పెరిగాయి. వీరిద్దరు 40 బంతుల్లోనే 91 పరుగులు జోడించారు. అయితే 26 బంతుల్లో 59 పరుగులు చేయాల్సిన స్థితిలో సూర్య వెనుదిరగడంతో ఛేదన కష్టంగా మారిపోగా... అక్షర్ ఆఖరి ఓవర్ మూడో బంతికి అవుట్ కావడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. చివరకు 16 పరుగుల తేడాతో గెలిచి శ్రీలంక ఊపిరి పీల్చుకుంది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీస్కోరు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ దసున్ షనక (22 బంతుల్లో 56 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్సర్లు), కుశాల్ మెండిస్ (31 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 190 పరుగులు చేసి ఓడింది. ఈ మ్యాచ్ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను శ్రీలంక 1-1తో సమం చేసింది. సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి మ్యాచ్ శనివారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

మెరిపించిన మెండిస్

ఓపెనర్లు కుశాల్ మెండిస్, నిసాంక లంక ఇన్నింగ్స్‌ను వేగంగా నడిపించారు. 27 బంతుల్లో (3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించిన మెండిస్‌ను చహల్ అవుట్ చేశాడు. అసలంక (19 బంతుల్లో 37; 4 సిక్సర్లు) కూడా బ్యాట్ ఝుళిపించాడు. 17వ ఓవర్ ముగిసేసరికి కూడా షనక (7 బంతుల్లో 6) పది పరుగులైనా చేయలేదు. కానీ ఆఖరి మూడు ఓవర్లలో అతను విధ్వంసం సృష్టించాడు. అర్ధ సెంచరీ (20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో) సాధించి లంక తరఫున టి20ల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన బ్యాటర్‌గా షనక రికార్డులకెక్కాడు.

చెత్త బౌలింగ్

లంక 200 పైచిలుకు స్కోరులో భారత బౌలర్లు శివమ్ మావి (0/53), ఉమ్రాన్ (3/48) ఇద్దరే 101 పరుగులు సమర్పించుకోవడం విశేషం. అర్ష్‌దీప్ కేవలం 2 ఓవర్ల స్పెల్ మాత్రమే వేసి 37 పరుగులు ఇచ్చాడు. ఏకంగా 5 నోబాల్స్ వేయడం కూడా లంక భారీ స్కోరుకు అవకాశమిచ్చింది. దీంతో పాటు మరో 2 నోబాల్స్ కలిపి మొత్తం ‘7 నోబాల్’లు చివరకు భారత్ ఓటమిలో కీలకంగా నిలిచాయి.

టాపార్డర్ విఫలం...


భారత్ ముందు కొండంత లక్ష్యం వుంటే టాపార్డర్ 21 పరుగులకే డగౌట్ చేరింది. ఇషాన్ (2), గిల్ (5), త్రిపాఠి (5) చెత్త షాట్లతో అవుటయ్యారు. కెప్టెన్ పాండ్యా (12; 1 ఫోర్, 1 సిక్స్) పవర్‌ప్లేలోనే వెనుదిరిగాడు. కాసేపటికి దీపక్ హుడా (9) అవుట్ కావడంతో 57 పరుగులకే సగం వికెట్లు కూలాయి.

ఆశలు రేపిన అక్షర్ సిక్సర్లు...

పదో ఓవర్లో అక్షర్ వచ్చీ రాగానే హసరంగ ఓవర్లో సిక్సర్ బాదాడు. ఆ తర్వాత కరుణరత్నే బౌలింగ్‌లో బౌండరీ కొట్టిన అక్షర్ 13వ ఓవర్ వేసిన తీక్షణ బౌలింగ్‌లో బౌండరీ, భారీ సిక్సర్ బాదాడు. దీంతో లంక కెప్టెన్ తమ స్టార్ స్పిన్నర్ హసరంగను దించితే అక్షర్ చుక్కలు చూపించాడు. స్వీప్, స్లాగ్‌స్వీప్, లాఫ్టెడ్ షాట్లతో ‘హ్యాట్రిక్’ సిక్సర్లు బాదాడు. తర్వాత పరుగు తీసివ్వగా, సూర్యకుమార్ ఐదో బంతిని ఎక్స్‌ట్రా కవర్ దిశగా సిక్స్ కొట్టాడు. దీంతో ఈ ఓవర్లో 26 పరుగులు వచ్చాయి. తర్వాత కరుణరత్నేకు ఇద్దరు సిక్సర్లతో తమ ధాటిని చూపెట్టారు. 20 బంతుల్లోనే అక్షర్ (2 ఫోర్లు, 6 సిక్సర్లు) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. సూర్యకుమార్ కూడా భారీ సిక్సర్‌తో (33 బంతుల్లో; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీని అధిగమించాడు. శివమ్ మావి (15 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా కొంత పోరాడినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) త్రిపాఠి (బి) అక్షర్ 33; కుశాల్ (ఎల్బీ) (బి) చహల్ 52; రాజపక్స (బి) ఉమ్రాన్ 2; అసలంక (సి) శుబ్‌మన్ (బి) ఉమ్రాన్ 37; ధనంజయ (సి) హుడా (బి) అక్షర్ 3; షనక నాటౌట్ 56; హసరంగ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-80, 2-83, 3-96, 4-110, 5-138, 6-138.


అక్షర్

బౌలింగ్: హార్దిక్ 2-0-13-0, అర్ష్‌దీప్ 2-0-37-0, శివమ్ మావి 4-0-53-0, అక్షర్ 4-0-24-2, చహల్ 4-0-30-1, ఉమ్రాన్ 4-0-48-3.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (బి) రజిత 2; గిల్ (సి) తీక్షణ (బి) రజిత 5; త్రిపాఠి (సి) మెండిస్ (బి) మదుషంక 5; సూర్యకుమార్ (సి) హసరంగ (బి) మదుషంక 51; పాండ్యా (సి) మెండిస్ (బి) కరుణరత్నే 12; హుడా (సి) ధనంజయ (బి) హసరంగ 9; అక్షర్ (సి) కరుణరత్నే (బి) షనక 65; మావి (సి) తీక్షణ (బి) షనక 26; ఉమ్రాన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 190. వికెట్ల పతనం:** 1-12, 2-21, 3-21, 4-34, 5-57, 6-148, 7-189, 8-190.

బౌలింగ్: మదుషంక 4-0-45-2, రజిత 4-0-22-2, కరుణరత్నే 4-0-41-1, హసరంగ 3-0-41-1, తీక్షణ 4-0-33-0, షనక 1-0-4-2.

గెలిస్తే ఒక్కొక్కరికి రూ. 1 కోటి!



భువనేశ్వర్: భారత హాకీ జట్టుకు ఇప్పటికే ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఒడిషా ప్రభుత్వం ఆటగాళ్లను ఉత్సాహపరిచే మరో ప్రకటన చేసింది. స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌ను భారత్ గెలుచుకుంటే ఒక్కో ఆటగాడికి రూ. 1 కోటి చొప్పున కానుకగా అందజేస్తామని ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఈ నెల 13నుంచి 29 వరకు ఒడిషాలోని రెండు నగరాల్లో హాకీ ప్రపంచకప్ జరుగుతుంది. గురువారం రూర్కెలాలో జరిగిన కార్యక్రమంలో భారత్‌లోనే అతి పెద్దదైన బిర్సా ముండా ఇంటర్నేషనల్ హాకీ స్టేడియాన్ని పట్నాయక్ ప్రారంభించారు. దీంతో పాటు భువనేశ్వర్ (కళింగ స్టేడియం) కూడా వరల్డ్ కప్ మ్యాచ్‌లకు వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ‘ఒడిషా రే’ పుస్తకాన్ని కూడా ఆవిష్కరించిన అనంతరం భారత ఆటగాళ్లతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. తమ రాష్ట్రానికి హాకీతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్న పట్నాయక్...ఆటగాళ్లకు ‘బెస్ట్ విషెస్’ చెప్పారు. ఈ మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి.

ఫైనల్లో శివ థాపా

తుది పోరుకు హుసాముద్దీన్


శివ

హిస్సార్: జాతీయ సీనియర్ బాక్సింగ్ (ఎలైట్) చాంపియన్‌షిప్‌లో స్టార్ ఆటగాడు శివ థాపా ఫైనల్లోకి అడుగు పెట్టాడు. అస్సాంకు ప్రాతినిధ్యం వహిస్తున్న థాపా (63.5 కేజీల విభాగం) సెమీ ఫైనల్లో 5-0తో మనీశ్ కౌశిక్ (సర్వీసెస్)ను చిత్తు చేశాడు. ఫైనల్లో అంకిత్ నర్వాల్ (రైల్వేస్)తో థాపా తలపడతాడు.

తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ కూడా 57 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరాడు. సర్వీసెస్ తరఫున బరిలోకి దిగిన హుసాముద్దీన్ సెమీస్‌లో 5-0తో ఆశిష్ కుమార్ (హిమాచల్ ప్రదేశ్)పై ఘన విజయం సాధించాడు. ఇతర కేటగిరీల్లో సంజీత్, నరేందర్, సాగర్ కూడా తుది పోరుకు అర్హత సాధించారు.

విజయంపై ఆంధ్ర గురి!

- హైదరాబాద్ విజయలక్ష్యం 401
- ప్రస్తుతం 75/2

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు కీలక విజయంపై గురి పెట్టింది. చిరకాల ప్రత్యర్థి హైదరాబాద్‌తో జరుగుతున్న గ్రూప్ ‘బి’ మ్యాచ్‌లో ఆ జట్టు మూడో రోజు గెలుపు అవకాశాలు మెరుగుపర్చుకుంది. 401 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ గురువారం ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (21), ప్రజ్ఞయ్ రెడ్డి (0) అవుట్ కాగా...రోహిత్ రాయుడు (46 నాటౌట్), అలంకృత్ అగర్వాల్ (7 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. చివరి రోజు హైదరాబాద్ మరో 326 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 230/3తో ఆట కొనసాగించిన ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌట్ అయింది. రికీ భుయ్ (150 బంతుల్లో 116; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా, కేఎస్ భరత్ (70 బంతుల్లో 89; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆ అవకాశం చేజార్చుకున్నాడు. ఆపై కరణ్ షిండే (180 బంతుల్లో 105 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) కూడా శతకం బాదాడు. హైదరాబాద్ బౌలర్లలో రక్షణ్ రెడ్డి 3 వికెట్లు పడగొట్టాడు.


షిండే


భుయ్

ఖాజా, స్మిత్ శతకాలు

ఆస్ట్రేలియా 475/4

సిడ్నీ: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న చివరి టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు నమోదు చేసింది. మ్యాచ్ రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 475 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖాజా (368 బంతుల్లో 195 నాటౌట్; 19 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీకి చేరువ కాగా, స్టీవ్ స్మిత్ (192 బంతుల్లో 104; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం సాధించాడు. ఖాజాకు ఇది 13వ సెంచరీ కాగా, స్మిత్‌కు 30వ శతకం. వీరిద్దరు మూడో వికెట్‌కు 209 పరుగులు జోడించగా, ట్రవిస్ హెడ్ (70) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. నోర్జేకు 2 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఖాజాతో పాటు రెన్‌షా (5 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు.





30 టెస్టుల్లో స్మిత్‌కు ఇది 30వ సెంచరీ. డాన్ బ్రాడ్‌మన్ (29)ను అధిగమించిన అతను... అత్యధిక సెంచరీలు చేసిన ఆసీస్ ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానానికి (హేడెన్‌తో సమంగా) చేరుకున్నాడు. పాంటింగ్ (41), స్టీవ్ వా (32) అంతకంటే ముందున్నారు. వేగంగా 30 సెంచరీలు చేసిన ఆటగాళ్లలో సచిన్ (159 ఇన్నింగ్స్) తర్వాత రెండో స్థానంలో స్మిత్ (162 ఇన్నింగ్స్) నిలిచాడు.

కివీస్ గెలుపు దిశగా...

రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ 0/2


షఫీక్ క్లీన్ బౌల్డ్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై టెస్టు సిరీస్ విజయంపై న్యూజిలాండ్ గురి పెట్టింది. మూడున్నర రోజుల పాటు చప్పగా సాగిన రెండో టెస్టు గురువారం చివర్లో ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. 319 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాక్ ఆట ముగిసే సమయానికి 2.5 ఓవర్లలో ఒక్క పరుగు కూడా చేయకుండా 2 వికెట్లు కోల్పోయింది. అబ్దుల్లా షఫీక్ (0), నైట్ వాచ్‌మన్ మీర్ హమ్జా (0) బౌల్డ్ కాగా, ఇమామ్ ఉల్ హక్ (0 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. బంతి ఇప్పటికే అనూహ్యంగా స్పందిస్తుండగా చివరి రోజు పాక్ విజయాన్ని అందుకోవడం అంత సులువు కాదు! అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో 408 పరుగులకు ఆలౌటై పాక్ 41 పరుగుల ఆధిక్యం కోల్పోగా, రెండో ఇన్నింగ్స్‌ను న్యూజిలాండ్ 5 వికెట్లకు 277 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. బ్రేస్‌వెల్ (74 నాటౌట్), బ్లన్‌డెల్ (74), లాథమ్ (62) అర్ధ సెంచరీలు చేశారు. 1969లో చివరిసారిగా పాకిస్తాన్‌లో కివీస్ టీమ్ టెస్టు సిరీస్ గెలిచింది.


నెల్లూరు జిల్లా నాయుడుపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


అనంతపురం జిల్లా కణేకల్లులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


పల్నాడు జిల్లా మాచర్లలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


శ్రీకాకుళం జిల్లా వాండ్రాయిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

గడప గడపకు మన ప్రభుత్వం

గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో కీలక మార్పులు

విధివిధానాలను తెలుసుకునేలా వెబ్‌సైట్‌లో నమూనా ప్రశ్నపత్రం

- ఓఎమ్మార్‌లో ఒరిజినల్, డూప్లికేట్ పత్రాలు
- తక్కువ అర్హతలున్న వారికే స్క్రయిబ్‌లుగా అనుమతి
- నిర్ణీత సమయం దాటితే పరీక్ష కేంద్రంలోకి నో ఎంట్రీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్–1 పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహిస్తున్న ప్రిలిమ్స్‌లో ఏపీపీఎస్సీ కొన్ని కీలక మార్పులు చేసింది. గ్రూప్–1లో పేపర్–1, పేపర్2గా ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతో ఆఫ్‌లైన్ ఓఎమ్మార్ ఆధారిత పత్రాలతో పరీక్ష ఉదయం, మధ్యాహ్నం జరుగుతుంది. ఒక్కో పేపర్‌లో 120 చొప్పున ప్రశ్నలుంటాయి. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. గతంలో లేనివిధంగా ప్రతి పరీక్ష కేంద్రంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, సూపరింటెండెంట్లే కాకుండా జిల్లాస్థాయి అధికారి ఒకరిని ప్రత్యేక పర్యవేక్షకునిగా నియమిస్తున్నారు.

కోడింగ్ తప్పయితే..

ఈసారి ప్రిలిమ్స్ పరీక్షలో అభ్యర్థులు అనుసరించాల్సిన విధివిధానాలకు సంబంధించిన సవివర సమాచారం ప్రశ్నపత్రాలు, ఓఎమ్మార్ పత్రాల్లో ముద్రించి ఉంటుంది. వాటిని ముందుగా తెలుసుకునేందుకు వీలుగా వాటి నమూనాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దీనివల్ల అభ్యర్థికి సమయం కలసి రావడంతోపాటు పరీక్షపై ఒక అవగాహన ఏర్పడుతుంది. ప్రశ్నపత్రం, ఓఎమ్మార్ బుక్‌లెట్లపై కోడింగ్ సిరీస్ నంబర్లు సరిసమానంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి. తప్పు కోడింగ్ ఉంటే కనుక ఆ జవాబు పత్రాలు చెల్లుబాటు కావు. అభ్యర్థి తన రిజిస్టర్ నంబర్‌ను ప్రశ్నపత్రం బుక్‌లెట్‌పై నిర్ణీత స్థలంలోనే రాయాలి. అభ్యర్థులు హాల్‌టికెట్లతో పాటు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును కూడా పరీక్ష కేంద్రాల వద్ద చూపించాలి. అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచి 9.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి ప్రవేశించాలి. ఆ తరువాత 15 నిమిషాల గ్రేస్ పీరియడ్ కింద 9.45 వరకు మాత్రమే అనుమతిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 వరకు అనుమతిస్తారు. 15 నిమిషాల గ్రేస్ పీరియడ్ కింద 1.45 వరకు అవకాశమిస్తారు. తరువాత ఎవరినీ అనుమతించరు. అభ్యర్థి దరఖాస్తు ఫారంలో బయోడేటా వివరాలను తప్పుగా సమర్పించి ఉంటే ఇన్విజిలేటర్ వద్ద అందుబాటులో ఉన్న నామినల్ రోల్స్‌లో డేటాను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఓఎమ్మార్ సమాధాన పత్రంలో ఇన్విజిలేటర్ సంతకాన్ని తీసుకోవాలి.


ఓఎమ్మార్‌లో ఒరిజినల్, డూప్లికేట్ పత్రాలు

అభ్యర్థికి ఇచ్చే ఓఎమ్మార్ సమాధాన పత్రం రెండు కాపీలుగా ఉంటుంది. పరీక్ష పూర్తయిన తరువాత అభ్యర్థి పైన ఉండే ఒరిజినల్ కాపీని ఇన్విజిలేటర్‌కు అందించాలి. దిగువన ఉండే డూప్లికేట్ సమాధాన పత్రాన్ని తన రికార్డుకోసం తీసుకువెళ్లాలి. అభ్యర్థి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రశ్నపత్రంపై సమాధానాలను ఎంపిక చేయరాదు. కేవలం ఓఎమ్మార్ సమాధాన పత్రంలో ఇచ్చిన స్థలంలో నీలం లేదా నలుపు బాల్ పెన్నుతో బబుల్ చేయాలి. వైటనర్, మార్కర్, ఎరేజర్లను వినియోగించినా ఆ సమాధాన పత్రం చెల్లదు. అంధత్వం, రెండు చేతులకూ వైకల్యం, మస్తిష్క పక్షవాతం గల అభ్యర్థులకు స్క్రయిబర్లను అనుమతిస్తారు. ఈసారి అత్యధికంగా 714 మంది స్క్రయిబర్లు కావాలని దరఖాస్తు చేశారు. అభ్యర్థులు స్క్రయిబ్‌ను తామే తెచ్చుకుంటే వారికి ఆ పోస్టుకు నిర్ణయించిన అర్హత కన్నా తక్కువ అర్హత ఉండాలి. అభ్యర్థి తెచ్చుకున్న స్క్రయిబ్ అర్హుడు కాకుంటే చీఫ్ సూపరింటెండెంటు వేరొకరిని ఏర్పాటు చేస్తారు.

ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్–1 క్యాడర్ పోస్టుల భర్తీకి ఈ నెల 8వ తేదీన ప్రిలిమనరీ (స్క్రీనింగ్ టెస్ట్) పరీక్ష కోసం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేశామని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్ డి.గౌతమ్ సవాంగ్ తెలిపారు. గురువారం ఏపీపీఎస్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లోని 297 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 1,26,449 మంది హాజరవుతారన్నారు. పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి సకాలంలో పూర్తిచేయాలన్నది కమిషన్ లక్ష్యమని చెప్పారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

యూపీఎస్సీ తరహాలోనే..

ఈ సారి గ్రూప్–1లో 92 పోస్టుల భర్తీకి వీలుగా నోటిఫికేషన్ ఇచ్చాం. గత గ్రూప్–1లో మిగిలిన 16 నుంచి 18 వరకు పోస్టులను క్యారీఫార్వర్డ్ కింద ఈ నోటిఫికేషన్‌కు జత చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. న్యాయపరమైన సలహాల అనంతరం ప్రిలిమ్స్ నిర్వహించే 8వ తేదీలోపు వాటిని ప్రకటిస్తాం. యూపీఎస్సీ మాదిరిగా గ్రూప్–1 పోస్టులను నిర్ణీత కాలపట్టిక ప్రకారం పూర్తి చేయించాలని భావిస్తున్నాం. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని అదే రోజు రాత్రి లేదా మరునాడు ప్రకటిస్తాం. రెండు లేదా మూడు వారాల్లోపు ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటిస్తాం. అనంతరం మెయిన్స్ సన్నద్ధతకు తగిన వ్యవధి ఇచ్చి ఏప్రిల్ నెలాఖరున మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తాం. ఆపై రెండు నెలల్లో మూల్యాంకనం ముగించి జూన్‌కల్లా ఫలితాలు విడుదల చేస్తాం. అనంతరం రెండువారాలు గడువు ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం. ఆగస్టు నాటికి ఈ ప్రక్రియ మొత్తం పూర్తిచేయిస్తాం. అనంతరం ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మరో కొత్త గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేస్తాం. ప్రాథమిక కీపై అభ్యంతరాల సంఖ్య వేలల్లో ఉంటున్నందున ప్రశ్నకు రూ.100 చొప్పున చెల్లించాలన్న నిబంధన పెట్టాం. సరైన అభ్యంతరమైతే ఆ మొత్తాన్ని వెనక్కు ఇచ్చేస్తాం.

ఇంటర్వ్యూలకు మూడు బోర్డులు

గ్రూప్–1లో ఇంటర్వ్యూలను గతంలో వద్దనుకున్నా ప్రజలతో నేరుగా సంబంధాలు నెరిపి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన క్యాడర్ పోస్టులు కాబట్టి అభ్యర్థుల పర్సనాలిటీకి సంబంధించిన అంశాలను కూడా క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉంటుంది. అందుకే ఇంటర్వ్యూలను పునరుద్ధరించారు. గతంలో ఒకే బోర్డుతో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించగా.. ఇప్పుడు మూడు వరకు బోర్డులతో చేపడుతున్నాం. ఇందులో కమిషన్ చైర్మన్, సభ్యుడితో పాటు ఇద్దరు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సబ్జెక్టు నిపుణులైన వీసీ లేదా సీనియర్ ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రొఫెసర్లను బోర్డులో నియమిస్తున్నాం. అత్యంత పారదర్శకంగా కేవలం మెరిట్ ప్రాతిపదికనే ఎంపికలు ఉంటాయి. కనుక ఏ ఒక్కరూ బయట వ్యక్తులు, మధ్యవర్తుల మాటలు విని మోసపోవద్దు.

గ్రూప్–2 సిలబస్‌ను హేతుబద్ధీకరిస్తాం

గ్రూప్–2 పోస్టుల భర్తీపైనా ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నోటిఫికేషన్ ఇస్తాం. గ్రూప్–2కు సంబంధించి సిలబస్ విధానంలో మార్పులు తీసుకురానున్నాం. సిలబస్‌లో రేషనలైజేషన్ చేస్తాం. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఒకే రకమైన సిలబస్‌ను అనుసరిస్తున్నందున దానిని హేతుబద్ధం చేస్తాం. గ్రూప్–2 స్కీమ్, ప్యాట్రన్‌లో మాత్రం ఎలాంటి మార్పులుండవు.

అమరావతే రాజధాని అని బీఆర్‌ఎస్ ప్రకటించడం తగదు

- మూడు ప్రాంతాల అభివృద్ధికి సీఎం కృతనిశ్చయం
- రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): అమరావతే రాజధానిగా కొనసాగాలని, మూడు రాజధానులు అవసరం లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ ఖండించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతుంటే.. అందుకు విరుద్ధంగా ప్రకటనలు చేయడం తగదని అన్నారు. విశాఖపట్నం పరిపాలన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, అమరావతి శాసన రాజధానిగా కాకుండా ఎవరు అడ్డుకున్నా ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇంకా పురిటిలోనే ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధిగా అత్యంత సున్నితమైన ఈ అంశాన్ని టచ్ చేస్తే వారికే ప్రమాదకరమన్నారు. తెలంగాణలో దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 26 బీసీ కులాలకు బీసీ, ఓబీసీ రిజర్వేషన్ తొలగించడంతో గత నాలుగేళ్లుగా తీవ్ర సామాజిక అన్యాయానికి గురయ్యారన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించకుండా కొత్త వాటిని నెత్తినేసుకోవడం తోట చంద్రశేఖర్ రాజకీయ అపరిపక్వతను సూచిస్తోందన్నారు.

క్లుప్తంగా...

7న గవర్నర్ విశాఖ జిల్లా పర్యటన

పద్మనాభం: గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 7న విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. పద్మనాభం మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో దివ్యాంగ బాలబాలికల ఉచిత విద్య శిక్షణ కేంద్రం, వృద్ధాశ్రమం, యోగా కేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ విషయాన్ని రాజీవ్‌గాంధీ మానవ సేవ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ గురువారం తెలిపారు. 7న ఉదయం 11.30 గంటలకు గవర్నర్ బర్లపేటకు వచ్చి అక్కడ స్వాతంత్ర్య సమరయోధులు రూపాకుల విశాలాక్షి, రూపాకుల సుబ్రహ్మణ్యం విగ్రహాలకు పూలమాల వేస్తారు. అనంతరం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రసంగిస్తారు. గాయత్రి, వెల్ఫేర్ అండ్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు హాజరుకానున్నట్లు రవికుమార్ తెలిపారు. సభా ప్రాంగణాన్ని, శిలాఫలకం ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని డీసీపీ సునీల్ సుమిత్ గరుడ్, ఆర్డీవో భాస్కరరెడ్డి, సీఐ సన్యాసి నాయుడు గురువారం పరిశీలించారు.

ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంబీఏ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎమ్మెస్సీ(అగ్రి), ఎంటెక్, ఎమ్మెస్సీ(సామాజికశాస్త్రం), ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన దరఖాస్తులో ఈ నెల 11వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలు నమోదు చేసి, ఆ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆ అప్లికేషన్‌కు సంబంధిత అర్హత పత్రాలను జతపరిచి ఈ నెల 17వ తేదీలోపు విశ్వవిద్యాలయంలో అందజేయాలని తెలిపారు. పోస్టు ద్వారా అయితే రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం, గుంటూరు–522034 అనే చిరునామాకు పంపాలని సూచించారు.

'ఏపీఐడీసీ బకాయిలు చెల్లించండి'

సాక్షి, అమరావతి: పంచదార మిల్లుల నుంచి రావాల్సిన బకాయిలపై ఏపీ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) దృష్టి సారించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.87 కోట్ల బకాయిలను చెల్లించాల్సిందిగా డైరెక్టర్ ఆఫ్ షుగర్ కేన్ కమిషనర్ వి.వెంకట్రావును ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల కోరారు. గతంలో రాష్ట్రంలోని 5 షుగర్ ఫ్యాక్టరీల్లో ఏపీఐడీసీ రూ.17 కోట్ల పెట్టుబడులుపెట్టిందని, ఇప్పుడు ఆ మొత్తం రూ.87 కోట్లకు చేరిందన్నారు. గురువారం కమిషనర్‌ను కలిసిన పుణ్యశీల ఏపీఐడీసీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తక్షణం బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంకట్రావు సానుకూలంగా స్పందిస్తూ ప్రస్తుతం ఆ షుగర్ ఫ్యాక్టరీలు మూతపడటంతో వాటి ఆస్తులను విక్రయిస్తున్నామని, వీటి నుంచి ఏపీఐడీసీకి రావాల్సిన బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

జనసేన ఓట్లు చీల్చేందుకే ఆంధ్రాలోకి బీఆర్‌ఎస్

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): వచ్చే ఎన్నికల్లో జనసేన ఓట్లను చీల్చి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సహకారం అందించడానికే ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశించిందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. వారు బంగారు తెలంగాణ కోసం మీరు నిలబడ్డారని, బంగారు ఆంధ్రప్రదేశ్ కోసం కాదని అన్నారు. ఆంధ్రాకు కేసీఆర్ ఎలా ఉపయోగపడతారో చెప్పాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సభల నిర్వహణపై ఆంక్షలు విధించడం అన్యాయమని అన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషాకు కేబినెట్ ర్యాంకు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్ వి.ఖాదర్‌బాషాకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు గురువారం ఉత్తర్వులిచ్చారు.

కోర్టు ముందు హాజరు కావడానికి నామోషీనా?

కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయాల్సిందే

- అలా చేయకుండా అప్పీళ్లు దాఖలు చేయడం పరిపాటిగా మారింది
- సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోలేం
- తేల్చి చెప్పిన హైకోర్టు సీజే ధర్మాసనం
- విద్యుత్ శాఖ అధికారుల అప్పీల్ కొట్టివేత
- సింగిల్ జడ్జి ఆదేశాలను అమలు చేయని అధికారులు
- కోర్టు గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారులు
- దీంతో అధికారుల వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిచ్చిన సింగిల్‌జడ్జి

సాక్షి, అమరావతి: అధికారులు కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కావడం నామోషీగా ఎందుకు భావిస్తున్నారని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేసి తీరాల్సిందేనని తేల్చి చెప్పింది. కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సింగిల్ జడ్జిలు ఆదేశాలు జారీ చేయగానే, వాటిని సవాలు చేస్తూ ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేసే ధోరణి పెరిగిపోయిందని ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ తీరు సరైనది కాదంది. వ్యక్తిగత హాజరు శిక్షేమీ కాదని, జడ్జేమీ ఉరి తియ్యరని,



ఆ అధికారం తమకు లేదని వ్యాఖ్యానించింది. ఫలానా అధికారి కోర్టు ముందు హాజరయ్యారని పత్రికల్లో రావడం పరువు తక్కువగా భావిస్తున్నందునే అప్పీళ్లు దాఖలు చేస్తున్నట్లుందని వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడమే గాక, ఉత్తర్వుల కాపీని తీసుకునేందుకు నిరాకరిస్తూ కోర్టునుద్దేశించి కింది స్థాయి అధికారులు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీడీసీఎల్) సీఎండీ, చీమకుర్తి సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), మరికొందరు అధికారులను వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఇచ్చిన ఆదేశాల్లో జోక్యానికి నిరాకరించింది. సింగిల్ జడ్జి ఆదేశాలను సవాలు చేస్తూ సీపీడీసీఎల్ చీమకుర్తి ఎస్‌ఈ తదితరులు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. సింగిల్ జడ్జి ముందు హాజరై, అన్నీ అక్కడే చెప్పుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారుల వ్యాఖ్యల రికార్డ్‌ను కోర్టు ముందుంచిన పిటిషనర్

ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన వీఎల్ గణపతి గ్రానైట్స్ విద్యుత్ బిల్లులు బకాయి పడటంతో సీపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీనిపై ఆ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. కంపెనీపై ఆధారపడి పలువురు జీవనం సాగిస్తున్నందున విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని దీనిని విచారించిన జస్టిస్ బట్టు దేవానంద్ డిసెంబర్ 16న మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ వ్యాజ్యం ఈ నెల 3న మరోసారి విచారణకు రాగా.. కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయలేదని, అంతేగాక కోర్టు ఆదేశాల కాపీని కూడా తీసుకోలేదని, పైపెచ్చు కోర్టునుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని గణపతి గ్రానైట్స్ న్యాయవాది తెలిపారు. ఆ వ్యాఖ్యల సీడీని న్యాయమూర్తి ముందుంచారు. కోర్టు ఆదేశాలను అమలు చేయని అధికారులపై తీవ్ర చర్యలు తీసుకోవాలని ఈ కోర్టు భావిస్తున్నప్పటికీ, వారి వాదన కూడా వినడం సమంజసమని, ఈ నెల 6న కోర్టు ముందు హాజరు కావాలంటూ ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ సీపీడీసీఎల్ చీమకుర్తి ఎస్‌ఈ తదితరులు సీజే ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. అధికారుల తరపున వీఆర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గణపతి గ్రానైట్స్ సంస్థ రూ.48 లక్షల వరకు బిల్లులు బకాయి పడినందునే విద్యుత్ సరఫరా నిలిపేశామన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు గడువు ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. కోర్టు పట్ల అధికారుల సంభాషణను దృష్టిలో పెట్టుకుని వారి తీరును ఆక్షేపించింది.

నేటి నుంచి ఆర్గానిక్ మహోత్సవ్–సీ ఫుడ్ ఫెస్టివల్

రాష్ట్ర ప్రభుత్వం, భూమి ఆర్గానిక్స్ సంయుక్తంగా విజయవాడలో నిర్వహణ

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం, భూమి ఆర్గానిక్ సంయుక్తంగా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు 5వ ఆర్గానిక్ మహోత్సవ్- సౌత్ ఇండియన్ సీ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. విజయవాడలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భూమి ఆర్గానిక్స్ ఎండీ మాగులూరి రఘురామ్ ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఆర్గానిక్ మహోత్సవ్- సౌత్ ఇండియన్ సీ ఫుడ్ ఫెస్టివల్‌లో వందకు పైగా స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నామని, వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది సేంద్రియ రైతులు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని, విక్రయిస్తారని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగపడేలా టెక్నాలజీని రైతులకు ఉచితంగా ఇచ్చేందుకు 26 స్టార్టప్ కంపెనీలు ముందుకొచ్చాయని చెప్పారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా టెక్నాలజీ బదలాయించడం ఇదే తొలిసారని తెలిపారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు సౌజన్యంతో నిర్వహిస్తున్న సీ ఫుడ్ ఫెస్టివల్‌లో వివిధ రకాల సముద్ర చేపలతో పలు వంటకాలను అన్‌లిమిటెడ్‌గా సందర్శకులకు అందిస్తామని వివరించారు. సముద్ర చేపల తలసరి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆర్గానిక్ మహోత్సవ్, సీ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్స్‌ను ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సీఈవో అలోక్ గోవిల్, లోటస్ చీఫ్ చెఫ్ దేవరాజ్‌తో కలిసి రఘురామ్ ఆవిష్కరించారు.

గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ వాదనలు వినిపిస్తూ.. గంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. జస్టిస్ ఎంఆర్ షా స్పందిస్తూ.. డిఫాల్ట్ బెయిల్ (పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు నిర్ణీత వ్యవధిలో నివేదిక దాఖలు చేయడంలో విఫలమైతే మంజూరు చేసే బెయిల్)ను చాప్టర్ 33 ప్రకారం మాత్రమే రద్దు చేయొచ్చని.. ఆ సందర్భంలోనే సెక్షన్ 437, సెక్షన్ 439 బెయిల్‌ను రద్దు చేయొచ్చు కానీ మెరిట్స్ మీద కాదన్నారు. నటరాజన్ జోక్యం చేసుకుంటూ.. మెరిట్స్ మీద కూడా రద్దు చేయొచ్చన్నారు. ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం విడుదలయ్యే హక్కు ఉంటుంది కానీ బెయిల్‌పై కొనసాగే హక్కు ఉండదన్నారు. గంగిరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. చట్టం ఎప్పుడూ ఒకేలా ఉంటుందని, అదనపు సొలిసిటర్ జనరల్ తీర్పులను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. నిందితుడు బెయిల్‌పై వచ్చిన తర్వాత అతని ప్రవర్తనపైనే అంతా ఆధారపడి ఉంటుందన్నారు. గంగిరెడ్డి విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేయడమంటే.. బెయిల్‌ను మెరిట్స్‌పై పునఃపరిశీలించాలన్న అర్థం కాదని ఆదినారాయణరావు వివరించారు. అనంతరం వాదనలు ముగిశాయని.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

ఫిబ్రవరిలో ఎర్రచందనం వేలం

- 5,300 మెట్రిక్ టన్నుల విక్రయానికి చర్యలు
- అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి మధుసూదనరెడ్డి

సాక్షి, అమరావతి: ఎర్రచందనం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో ఆదాయం చేకూర్చడానికి తమ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి వై.మధుసూదనరెడ్డి చెప్పారు. అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎర్ర చందనం కొనుగోలుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర ఉన్న ఎర్రచందనం నిల్వలను వేలం వేసేముందు బయ్యర్లు, ఏజెన్సీలను అవగాహన కోసం ఆహ్వానించినట్లు చెప్పారు. ప్రభుత్వానికి వీలైనంత ఎక్కువ ఆదాయాన్ని సాధించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యర్థన మేరకు కేంద్రప్రభుత్వం 5,300 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం అమ్మడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏజెంట్ ఫర్ సేల్ అండ్ ఎక్స్‌పర్ట్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ–టెండర్, ఈ–ఆక్షన్ విధానం ద్వారా గ్లోబల్ సేల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులో వేలం నిర్వహించడానికి ప్రాథమిక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గతంలో టెండర్లు ఏవిధంగా జరిగాయో పరిశీలించి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పారదర్శకతతో టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మనదేశంతోపాటు హాంకాంగ్ నుంచి వచ్చిన బయ్యర్లు, పీసీసీఎఫ్ ప్రొడక్షన్ ఆర్పీ ఖజూరియ, ఫారెస్ట్ కార్పొరేషన్ సీజీఎం రేవతి, జీఎం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం భగవత్‌సేవతో సమానం

- కోవిడ్ సమయంలో వైద్యుల సేవలు అమోఘం
- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

తిరుపతి తుడా/రేణిగుంట/తిరుమల: పేదలకు నాణ్యమైన వైద్యం అందించగలిగితే అది భగవత్ సేవతో సమానమని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ భవనంలో డిజిటల్ లైబ్రరీకి గురువారం గవర్నర్ శంకుస్థాపన చేశారు. ఆధునీకీకరించిన ఆడిటోరియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ విపత్తు సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా వైద్యులు అమోఘమైన సేవలందించారని కొనియాడారు. మనదేశంలో కోవిడ్ ఫోర్త్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల కృషిని కొనియాడారు. ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు రాయపు రమేష్ తమ సంఘ కార్యకలాపాలను వివరించారు.


బాలాజీ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్,మంత్రులు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

వైద్య విద్యార్థులు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషిచేయాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బాలాజీ మెడికల్ కాలేజీలో 2022–23 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ సమాజంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్యం, విద్యను అందించాలనే లక్ష్యంతో శ్రీ కంచి కామకోటి ట్రస్ట్, సాయిరాం ఫౌండేషన్ ముందుకురావడం అభినందనీయమన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని,ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి ఆర్కే రోజా, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, గవర్నర్ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా, కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో గవర్నర్

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943